Sahiti ELEVATING LIFESTYLES

ఈనాడు

Sahiti ELEVATING LIFESTYLES

విజయవాడ 11-1-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 . సంచిక 152

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

Sahiti
ELEVATING LIFESTYLES

PROUDLY INVITES YOU TO
THE FOUNDATION STONE LAYING CEREMONY OF

SAHITI'S VAAGDEVI TECHNO PARK
&
HITHA CAPITAL

BY



Sri. N. Chandrababu Naidu *Garu*

HONOURABLE CHIEF MINISTER OF ANDHRA PRADESH



IN THE AUGUST PRESENCE OF

Sri **V. Jagapathi Babu** *Garu*
(DIRECTOR SAHITI GROUP)
RENOWNED FILM STAR



Smt. **P. Ramyakrishnan** *Garu*
RENOWNED FILM ACTRESS

TIME & DATE

FRIDAY, 11-01-2019, 5:00 PM ONWARDS

LOCATION

NH-16, VIJAYAWADA -
GUNTUR EXPRESSWAY, KAZA




Contact: +91 8862812345, 8863812345

www.sahiticonstructions.in

ఈనాడు

విజయవాడ 11-1-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 . సంచిక 152
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈ తరంగాలు గ్రహాంతర జీవులవేనా?

భూమి మీదున్న జీవకోటిలో సాంకేతిక సామర్థ్యం మానవుడి సొంతం. మన ఊహకూ అందని రీతిలో మానవుడి కన్నా ఎన్నో లక్షల రెట్లు ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగిన గ్రహాంతర జీవులు ఈ సువిశాల విశ్వంలో ఉన్నాయా? మనకు 150 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో రెప్పపాటు కాలంలో మెరుపులా మెరిసిన ఒక శీఘ్ర రేడియో తరంగ విస్ఫోటం (ఎఫ్‌ఆర్‌బీ) గ్రహాంతర జీవుల ఉనికిపై చర్చకు తెరలేపింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ తరంగం ఏకంగా నక్షత్ర మండలాలనూ దాటి వచ్చేంత అపార శక్తి కలిగి ఉంది. సుదూర విశ్వంలో ఉండొచ్చని భావిస్తున్న బుద్ధిజీవులే దీన్ని సృష్టించాయా అన్నదానిపై విశ్లేషణలు మొదలయ్యాయి.

సమగ్ర కథనం 10లో

ఆలోక్‌కు ఉద్వాసన

- సీబీఐ నుంచి అగ్నిమాపక సేవల డీజీగా బదిలీ
- అత్యున్నత స్థాయి కమిటీ సంచలన నిర్ణయం
- సీవీసీ నివేదిక ఆధారంగానే చర్య
- వాదన వినిపించుకునే అవకాశమిద్దామన్న ఖర్గే
- ససేమిరా అన్న ప్రధాని మోదీ, జస్టిస్ సిక్రి
- సీబీఐ పగ్గాలు మళ్లీ నాగేశ్వరరావు చేతికి

55 ఏళ్ల సీబీఐ చరిత్రలో తొలిసారిగా ఒక డైరెక్టర్ ఉద్వాసనకు గురయ్యారు. ప్రధాని మోదీ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఆలోక్‌ను సీబీఐ నుంచి బదిలీ చేసింది.

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ గురువారం సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మను పదవి నుంచి తప్పించింది. ఆలోక్‌పై అవినీతి, విధులు పట్ల అలసత్వం వంటి ఆరోపణలున్నట్లు కేంద్ర నిఘా కమిషన్(సీవీసీ) సమర్పించిన నివేదిక ఆధారంగానే ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కమిటీలో సభ్యుడిగా ఉన్న కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించినప్పటికీ మెజారిటీ ప్రాతిపదికన నిర్ణయం వెలువడింది. అనంతరం సీబీఐ పగ్గాలను తాత్కాలికంగా అదనపు డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావుకు ప్రభుత్వం అప్పగించింది. ఆలోక్ వర్మను కేంద్ర హోంశాఖ పరిధిలో అగ్నిమాపక సేవలు, సివిల్ డిఫెన్స్, హోంగార్డుల డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు (మిగతా 2లో)


మోదీ
ఖర్గే
జస్టిస్ సిక్రి


ఆలోక్ వర్మ

చిన్న వ్యాపారులకు జీఎస్టీ మినహాయింపు



- రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ వరకు పన్ను ఉండదు
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి

దిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరో అస్త్రాన్ని సంధించింది. చిన్నవ్యాపారులను, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆకట్టుకోవడంలో భాగంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో మినహాయింపులు ప్రకటించింది. ఖాతాలు, బిల్లుల రూపకల్పన నిమిత్తం వారికి ఉచితంగా సాఫ్ట్‌వేర్‌ను కూడా అందించనుంది. గురువారం జరిగిన జీఎస్టీ మండలి సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పన్ను మినహాయింపు పరిధిలోకి వచ్చే వార్షిక టర్నోవర్; సంవిధాన పథకం (కాంపొజిషన్ స్కీం) విషయాల్లో మార్పులు చేసింది. ఈ నిర్ణయాలన్నీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయి.

జీఎస్‌టీ వర్తించే వార్షిక టర్నోవర్ పరిమితి రెట్టింపు

ప్రస్తుతం వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు పైబడిన వారంతా జీఎస్టీ పరిధిలోకి వస్తున్నారు. ఇకపై ఆ పరిమితిని రూ.40 లక్షలకు పెంచారు. అంటే రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ ఉన్న (మిగతా 2లో)

అయోధ్య కేసు వాయిదా



- విచారణ నుంచి వైదొలగిన జస్టిస్ లలిత్
- 29న కొత్త ధర్మాసనం ఏర్పాటు

దిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదంపై విచారణ జరపనున్న అయిదుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం నుంచి జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ వైదొలిగారు. దీంతో ఈ నెల 29న కొత్త ధర్మాసనం ఏర్పాటు కానుంది. తొలుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఏర్పాటయింది. గురువారం 20 నిమిషాల పాటు వాదనలు కొనసాగిన అనంతరం జస్టిస్ లలిత్ మాట్లాడుతూ తాను ఈ కేసు విచారణలో ఉండబోవడం లేదంటూ ప్రకటించారు. గతంలో జస్టిస్ లలిత్ న్యాయవాదిగా ఉన్నప్పుడు బాబ్రీ మసీదు వ్యవహారానికి చెందిన కేసును వాదించారంటూ ఓ న్యాయవాది చెప్పడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. తొలుత సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ మాట్లాడుతూ కల్యాణ్ సింగ్ ఉత్తర్‌ప్రదేశ్ సీఎంగా ఉన్న సమయంలో బాబ్రీ మసీదు కూల్చివేత చోటు చేసుకుందని తెలిపారు. దానిపై దాఖలైన కేసు వ్యవహారంలో కల్యాణ్ సింగ్ తరపున 1997లో లలిత్ వాదించారని చెప్పారు. అయితే ధర్మాసనం నుంచి జస్టిస్ లలిత్ (మిగతా 2లో)

అమరావతికి స్వాగత తోరణం

- 'వెల్‌కం గ్యాలరీ'కి ముఖ్యమంత్రి శంకుస్థాపన
- 'సింగపూర్' హామీని నిలబెట్టుకుంటున్నా
- అతి త్వరలో ప్రపంచానికే ఆదర్శమవుతాం
- చంద్రబాబు నాయుడి వ్యాఖ్యలు
- అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా తీర్చిదిద్దుతాం: ఈశ్వరన్

ఈనాడు - అమరావతి, తుళ్లూరు - న్యూస్‌టుడే

రాజధాని అమరావతిని సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అప్పటి ఆలోచనలన్నీ ఇప్పుడు ఆచరణలోకి వస్తున్నాయని, రాజధాని ఒక రూపు సంతరించుకుంటోందని చెప్పారు. రాజధానిలోని అంకుర ప్రాంత అభివృద్ధి ప్రదేశంలో అమరావతి అభివృద్ధి భాగస్వామి (ఏడీపీ) చేపట్టే 'వెల్‌కమ్ గ్యాలరీ' నిర్మాణానికి సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా (మిగతా 6లో)


రాజధాని అమరావతి పరిధిలోని లింగాయపాలెం వద్ద 'వెల్‌కమ్ గ్యాలరీ' శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కరచాలనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, మంత్రి నారాయణ, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, సింగపూర్ ప్రతినిధుల బృందం

రూ.600 కోట్లతో శ్రీసిటీలో యాంకర్ కంపెనీ

ANCHOR ®

జపాన్‌కు చెందిన యాంకర్ ఎలక్ట్రికల్స్ కంపెనీ శ్రీసిటీలో 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.600 కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మొదటి విడత రూ.250 కోట్లు పెట్టుబడి పెట్టి దశలవారీగా మరో రూ.350 కోట్లు వెచ్చించనుంది. గురువారం అమరావతి వెల్‌కం గ్యాలరీ శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో యాంకర్ ఎలక్ట్రికల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు దినేశ్ అగర్వాల్, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) జాస్తి కృష్ణ కిశోర్‌తో ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో సింగపూర్ మంత్రి ఈశ్వరన్ కూడా పాల్గొన్నారు. దాదాపు 55ఏళ్ల క్రితం ఏర్పాటైన యాంకర్ కంపెనీని 2007లో జపాన్‌కు చెందిన పానాసోనిక్ కొనుగోలు చేసింది.


క్రమబద్ధీకరణ ఓటు బ్యాంక్ విధానమా!



- ఉల్లంఘనులకు అది సర్కారిచ్చే కానుకలా ఉంది
- అమలులో పేద, ధనిక వర్గాలకు తేడా కనిపించటం లేదు
- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణపై హైకోర్టు ఆక్షేపణ
- అది చట్ట విరుద్ధమంటూ వ్యాఖ్య
- ప్రత్యామ్నాయం చూడాలంటూ ప్రభుత్వానికి హితవు

6లో

ఇదీ సంగతి!



ఏయే క్లాసు వారు ఆయా పాఠం చదువుకోండి!

ఫిబ్రవరి నుంచి రెట్టింపు భరోసా



ఈనాడు - అమరావతి

వృద్ధాప్య, వితంతు పింఛను మొత్తం నెలకు రూ.2,000

వివిధ వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇస్తున్న సామాజిక భద్రత పింఛన్ల మొత్తాన్ని ఫిబ్రవరి నుంచి రెట్టింపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి నుంచే పెంపును అమల్లోకి తీసుకురావాలన్న యోచనా చేస్తోంది. అలా అమలు చేసినట్లైతే ఫిబ్రవరిలో జనవరికి సంబంధించిన పెంపు మొత్తం కూడా అందజేస్తారు. 2014కి ముందు నెలకి రూ.200గా ఉన్న అన్నిరకాల పింఛన్లను తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే అయిదు రెట్లు పెంచి రూ.1,000 చొప్పున అందించింది. దివ్యాంగులకు, హిజ్రాలకు రూ.1,500 చేసింది. 2017 సెప్టెంబరు నుంచి డయాలసిస్ రోగులకు రూ.2,500 చొప్పున పింఛను అందిస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లపై సమీక్షించి.. రెట్టింపు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో వృద్ధాప్య, వితంతువులకు పింఛను మొత్తం నెలకు రూ.2,000 చెల్లించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల పింఛన్లు కలిపి 50,61,906 మందికి పంపిణీ అవుతున్నాయి. వీటిపై నెలకి రూ.560కోట్లు చొప్పున ఏడాదికి రూ.6,720కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అన్నిరకాల పింఛన్ల మొత్తాన్ని (మిగతా 2లో)

చిన్న వ్యాపారులకు జీఎస్టీ మినహాయింపు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులు ఎలాంటి జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కూడా చేయించాల్సిన పనిలేదు. ఈశాన్య రాష్ట్రాలకయితే ప్రస్తుతం రూ.10 లక్షల టర్నోవర్ ఉన్న వారికి ఈ మినహాయింపులు ఉన్నాయి. అక్కడ ఈ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు.

చిన్న షరతు

ఒక రాష్ట్రం పరిధిలో జరిగే వ్యాపారానికే టర్నోవర్ పరిమితి పెంపు నిబంధన వర్తిస్తుంది. అంతర్రాష్ట్ర వ్యాపారం చేసే వారికి వర్తించబోదని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. ప్రస్తుతం రూ.20 లక్షల టర్నోవర్ కన్నా తక్కువ ఉన్నప్పటికీ 10.93 లక్షల మంది జీఎస్టీ చెల్లిస్తున్నారని చెప్పారు. వారందరికీ ఊరట కలగనుంది.

పెంచడం, పెంచకపోవడం రాష్ట్రాల ఇష్టం

టర్నోవర్ పరిమితిని పెంచడం కారణంగా రాష్ట్రాలు రూ.5,200 కోట్ల ఆదాయాన్ని కోల్పోవలసి ఉంటుంది. అందువల్ల పరిమితిని పెంచాలా, వద్దా అన్న నిర్ణయాన్ని ఆయా రాష్ట్రాలకు విడిచిపెట్టారు. టోర్నోవర్ పరిమితి పెంపు వల్ల పన్ను చెల్లించే వారి సంఖ్య తగ్గుతుందని, అందువల్ల ఆదాయాన్ని కోల్పోతామని కొన్ని రాష్ట్రాలు అభ్యంతరం తెలపడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏ విషయాన్ని ఆయా రాష్ట్రాలు వారం రోజుల్లోగా జీఎస్టీ మండలి సెక్రటేరియట్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. పుదుచ్చేరి ఈ ప్రతిపాదన చేసిందని అరుణ్ జైట్లీ తెలిపారు. ఇది ఏకకాల మినహాయింపు మాత్రమేనని స్పష్టంచేశారు. దీని ప్రభావం అంతర్రాష్ట్ర వ్యాపారంపై ఉండబోదని తెలిపారు.

ప్రయోజనం ఏమిటి?

సంవిధాన విధానాన్ని ఎంచుకున్న వ్యాపారులకు మూడు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి.. ఏడాదికి ఒక రిటర్ను సమర్పిస్తే సరిపోతుంది. రెండు.. నెలనెలా కాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్ను చెల్లించే వెసులుబాటు ఉంటుంది. మూడు... మిగిలిన పన్ను చెల్లింపుదారుల మాదిరిగా సవివరమైన దస్త్రాలు నిర్వహించవలసిన అవసరం లేదు.

కేరళకు ప్రత్యేక వెసులుబాటు

వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన కేరళకు అదనంగా నిధులు సమీకరించుకోవడానికి జీఎస్టీ మండలి ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. అంతర్రాష్ట్ర వ్యాపారంపై 1 శాతం విపత్తుల సెస్సు విధించుకునే అవకాశం ఇచ్చింది.

చిన్నవ్యాపారులంతా సంవిధాన పథకంలోకి..

చిన్నవ్యాపారులంతా సంవిధాన పథకంలోకి వచ్చేలా జీఎస్టీ రెండు మార్పులు చేసింది.

మొదటిది: ఈ పథకం కింద ప్రస్తుతం రూ.కోటి వార్షిక టర్నోవర్ ఉన్న చిన్న వ్యాపారులు 1 శాతం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది. ఈ టర్నోవర్‌ను రూ.1.5 కోట్లకు పెంచింది. పన్ను శాతంలో మార్పులు చేయలేదు. వస్తువుల తయారీదార్లు, సరఫరాదార్లకు ఇది ఉపకరిస్తుంది. రూ.40 లక్షల వరకు మినహాయింపును ఉపయోగించుకోవడంతో పాటు, ఆ పైన ఉన్న టర్నోవర్‌కు 1 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

రెండోది: రూ.50 లక్షల వార్షిక టర్నోవర్ ఉన్న వస్తు, సేవల సర్వీసు ప్రొవైడర్లు, సరఫరాదారులు సంవిధాన విధానాన్ని ఎంచుకొని 6% పన్ను చెల్లిస్తే సరిపోతుంది. సేవల రంగంలో ఉన్నవారికి లబ్ధి కలుగుతుంది.

రెండేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుంది.

స్థిరాస్తిపై ఏడుగురు మంత్రుల అధ్యయనం

స్థిరాస్తి రంగంపై ఎంత జీఎస్టీ ఉండాలన్నదానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దాంతో దీనిపై అధ్యయనానికి ఏడుగురు మంత్రులతో బృందం ఏర్పాటయింది. లాటరీ వ్యవహారాలపైనా మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు.

బయట ఒకలా.. లోపల మరోలా..

కాంగ్రెస్‌ను విమర్శిస్తూ మోదీ ట్వీట్

జీఎస్టీ విషయంలో కాంగ్రెస్ బయట ఒకలా...లోపల మరోలా వ్యవహరిస్తోందంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. "జీఎస్టీ వర్తించే పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచాం. కేరళ, ఛత్తీస్‌గఢ్ మాత్రం రూ.20 లక్షలకే పరిమితం చేయాలని పట్టుబట్టాయి. అందుకే స్వేచ్ఛను రాష్ట్రాలకే ఇచ్చాం. సంవిధాన విధానంలో రూ.50 లక్షల వార్షిక టర్నోవర్ ఉన్నవారికి 6% పన్ను వేశాం. ఛత్తీస్‌గఢ్, ఇతర కాంగ్రెస్ రాష్ట్రాలు 8% పన్ను ఉండాలని అడిగాయి. కాంగ్రెస్ పార్టీ బయట పన్నులు తగ్గించాలని అడుగుతోంది. సమావేశాల్లో మాత్రం అధిక పన్నుల రేటు కోసం పోట్లాడుతోంది" అంటూ విమర్శలు చేశారు.

అమరావతికి స్వాగత తోరణం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు.

'అమరావతిలో రూ.40వేల కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. వెల్‌కమ్ గ్యాలరీ రాజధానికి ముఖద్వారంగా ఉంటుంది. అత్యుత్తమ ఆచరణలు, అత్యాధునిక సాంకేతికతలను ఈ గ్యాలరీలో ప్రవేశపెట్టొచ్చు. సాంకేతికతను వినియోగించి పారదర్శక పరిపాలనను అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంది. అతి త్వరలో ప్రపంచానికే ఆదర్శమవుతుంది.' అని చంద్రబాబు పేర్కొన్నారు.


- అదానీ గ్రూపుతో కలిసి ప్రపంచంలోనే అద్భుతమైన డేటా కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్నాం.
- అతి తక్కువ అవినీతి కలిగిన రాష్ట్రాల జాబితాలో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నాం.
- సులభతర వాణిజ్యంలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నాం.
- ప్రజలకు అత్యుత్తమ జీవన ప్రమాణాలను కల్పిస్తున్నాం.
- ప్రతి కుటుంబానికి త్వరలో స్మార్ట్ ఫోన్ ఇవ్వనున్నాం.

అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా చేస్తాం

రాజధాని అమరావతిలో ఏం జరుగుతోంది? పెట్టుబడులు పెట్టేందుకు ఇక్కడున్న అవకాశాలేమిటనే అంశాలను 'వెల్‌కమ్ గ్యాలరీ'లో చూపిస్తామని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ తెలిపారు. 'అంకుర ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన సంస్థలు ముందుకొచ్చాయి. ఇది ప్రారంభం మాత్రమే. ఇంకా అనేక సంస్థలు వస్తాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, సృజనాత్మక ఆలోచనల వల్లే ఇది సాధ్యమైంది' అని పేర్కొన్నారు.

15 సంస్థలతో ఒప్పందాలు

అంకుర ప్రాంత అభివృద్ధిలో భాగంగా అమరావతి అభివృద్ధి భాగస్వామి (ఏడీపీ) పలు సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌తో పాటు భారత్‌కు చెందిన 15 సంస్థలతో ఈ ఒప్పందాలు కుదిరాయి. చంద్రబాబు, ఈశ్వరన్ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న యాంకర్ కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు దినేశ్ అగర్వాల్. చిత్రంలో సింగపూర్ మంత్రి ఈశ్వరన్, ఈడీబీ సీఈవో కృష్ణ కిశోర్

తక్కువ సమయంలో ఇంత అభివృద్ధా: ఈశ్వరన్

రాజధాని అమరావతిలో అతి తక్కువ సమయంలో చాలా అభివృద్ధి సాధించారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ అభినందించారు. ప్రభుత్వ భవన నిర్మాణ సముదాయాలను వారిద్దరు పరిశీలించారు. 5 టవర్లుగా నిర్మిస్తున్న సచివాలయ భవనాల 2 పిల్లర్లకు వేసిన రాఫ్ట్ ఫౌండేషన్‌ను ఈశ్వరన్‌కు చంద్రబాబు చూపించారు. అంతకుముందు చంద్రబాబుతో కలిసి రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ఈశ్వరన్ సందర్శించారు. ఆర్టీజీ పనితీరు స్ఫూర్తిదాయకంగా ఉందని ప్రశంసించారు. రాజధాని పనుల వేగాన్ని చూసి ఈశ్వరన్ ఆశ్చర్యపోయారని, ఇంత పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయని అనుకోలేదని వ్యాఖ్యానించారని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు.

మరోవైపు భారత్‌లోని ప్రతిభకు సింగపూర్ సామర్థ్యం తోడైతే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని ఈశ్వరన్ పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సింగపూర్‌కు చెందిన సింక్రో స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో పెళ్లి కుమార్తెల అలంకరణ, ఫొటో గ్రాఫిక్ ఆర్టిస్ట్ విభాగంలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు విజయవాడలో నిర్వహించిన పట్టభద్రుల వేడుకలో ఆయన మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినుల ఫ్యాషన్ షో, వస్త్రాలంకరణ ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నారాయణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

విమాన సర్వీసులను పెంచాలి

విజయవాడ- సింగపూర్ మధ్య ఇకపై వారానికి 4 రోజులు విమానాలు నడిచేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని అమరావతి ప్రాజెక్టు సంయుక్త అమలు పర్యవేక్షణ కమిటీ (జేఐఎస్‌సీ) సమావేశం తీర్మానించింది. ఫిబ్రవరి నుంచి దుబాయ్- విజయవాడ మధ్య విమాన సర్వీసులకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలని నిర్ణయించింది. వెలగపూడి సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబు నాయుడు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ల సారథ్యంలో జేఐఎస్‌సీ నాలుగో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలో పేర్కొన్న 6 ప్రధానాంశాలపై చర్చించారు. వాటన్నింటినీ సంపూర్ణంగా ఆమోదిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. వెల్‌కమ్ గ్యాలరీ నిర్మాణం 75 రోజుల్లో పూర్తి కావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

వెల్‌కమ్ గ్యాలరీ విశేషాలు...

విస్తీర్ణం: 5 ఎకరాలు (2.6 హెక్టార్లు)

నిర్మిత ప్రాంతం: 4,080 చ.మీటర్లు

కార్యకలాపాలు ప్రారంభమయ్యేది: 2019 అక్టోబరు చివరికి

సందర్శకుల సామర్థ్యం: రోజుకు 2వేల నుంచి 3వేల మంది

ఏమేం ఉంటాయి?

సిటీ గ్యాలరీ: ఆంధ్రప్రదేశ్ ఔన్నత్యాన్ని, ఇక్కడి ప్రజల సంస్కృతిని గుర్తు చేసేలా..

ఎగ్జిబిషన్ జోన్: కళలు, వినూత్న సాంకేతికత, అర్బన్ సొల్యూషన్స్‌కు వేదిక.

సామాజిక ప్రదేశాలు (కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ ఏరియా): కన్వెన్షన్ సెంటర్లు, వినోద, విహార జోన్లు, ఆరోగ్య కేంద్రాలు.

పని ప్రదేశాలు (కో-వర్కింగ్ జోన్లు): రాజధానిలో అంకుర ప్రాంత అభివృద్ధిని ప్రోత్సహించే కేంద్రాలు.

ఆలోక్‌కు ఉద్వాసన

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రధాని నివాసంలో అత్యున్నత స్థాయి కమిటీ గురువారం సమావేశమైంది. ఇందులో ప్రధానితోపాటు లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.సిక్రి సభ్యులుగా ఉన్నారు. వాస్తవానికి ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ రంజన్ గొగొయి సభ్యుడిగా ఉండాలి. ఆలోక్‌ను సీబీఐ డైరెక్టర్‌గా పునర్నియమిస్తూ తీర్పు చెప్పిన ధర్మాసనంలో తాను సభ్యుడిగా ఉండటంతో తన తర్వాత సర్వోన్నత న్యాయస్థానంలో అత్యంత సీనియర్‌గా ఉన్న జస్టిస్ సిక్రిని తన ప్రతినిధిగా సీజేఐ పంపారు. సమావేశంలో.. సీవీసీ చేసిన ఆరోపణలపై వాదన వినిపించుకునేందుకు ఆలోక్‌కు అవకాశమివ్వాలని ఖర్గే పట్టుబట్టారు. అందుకు మోదీ, జస్టిస్ సిక్రి నిరాకరించారు. ఆశించినస్థాయిలో ఆలోక్ చిత్తశుద్ధి కనబర్చడం లేదని, ఆయనపై కొన్ని కేసుల్లో క్రిమినల్ దర్యాప్తు అవసరమని వారిద్దరు అభిప్రాయపడ్డట్లు తెలిసింది. దీంతో మెజారిటీ(2-1) ప్రాతిపదికన ఆలోక్‌ను తప్పించారు.

విధుల్లో చేరిన రెండు రోజులకే..

ఆలోక్ 1979 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. సీబీఐ డైరెక్టర్‌గా ఆయన రెండేళ్ల పదవీకాలం ఈ నెల 31తో ముగియాల్సి ఉంది. ఆలోక్, సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా మధ్య విభేదాలు ముదరడంతో వారిద్దరినీ నిర్బంధ సెలవుపై పంపిస్తూ గతేడాది అక్టోబరు 23న కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడం కలకలం సృష్టించింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆలోక్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ నిర్వహించిన న్యాయస్థానం సీబీఐ డైరెక్టర్‌గా ఆయనకు తిరిగి పగ్గాలు అప్పగిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. అయితే విధానపరమైన కీలక నిర్ణయాలేవీ తీసుకోవద్దని ఆయన్ను ఆదేశించింది. ఆలోక్ భవితవ్యాన్ని వారం రోజుల్లోగా తేల్చాలని ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీని ఆదేశించింది. సుప్రీం ఆదేశాల నేపథ్యంలో 77 రోజుల నిర్బంధ సెలవు తర్వాత ఆలోక్ బుధవారం తిరిగి విధుల్లో చేరారు. తాను వెళ్లిపోయాక సీబీఐలో చోటుచేసుకున్న బదిలీలను రద్దు చేశారు. అయితే, తిరిగి విధుల్లో చేరిన రెండు రోజులకే ఆయనను పదవి నుంచి తప్పించారు. ఇంతకుముందు ఆలోక్ వర్మను సెలవుపై పంపినప్పుడు ప్రభుత్వం నాగేశ్వరరావునే సీబీఐ తాత్కాలిక అధిపతిగా నియమించింది.



సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులైన నాగేశ్వరరావు

అంతకుముందు నాటకీయ పరిణామాలు

ఆలోక్ వర్మ తొలగింపునకు ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాపై నమోదైన అవినీతి కేసు దర్యాప్తు అధికారి(ఐవో)గా ఎస్పీ హోదాలోని మోహిత్ గుప్తాను ఆలోక్ వర్మ నియమించారు. ప్రస్తుతం గుప్తా గాజియాబాద్ సీబీఐ యూనిట్‌కు నేతృత్వం వహిస్తున్నారు. అస్థానా కేసులో తొలుత డీఎస్పీ ఎ.కె.బస్సి, అదనపు ఎస్పీ ఎస్.ఎస్.గుర్మ ఐవోలుగా ఉన్నారు. అనంతరం వారి స్థానంలో సతీశ్ దాగర్ నియమితులయ్యారు. సతీశ్‌ను తప్పించి గుప్తాకు ఆలోక్ బాధ్యతలు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న అవినీతి నిరోధక(ఏసీ)-3 విభాగం బాధ్యతలు చేపట్టేందుకు డీఐజీ ఎం.కె.సిన్హా విముఖత వ్యక్తం చేయడంతో ఇప్పటికే ఈ కేసు పర్యవేక్షణ విధుల్లో ఉన్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ తరుణ్ గౌబను ఆలోక్ కొనసాగించారు. సిన్హాకు 'బ్యాంకింగ్, సెక్యూరిటీలు, మోసాలు సెల్(బీఎస్ఎఫ్ఎసీ)' విభాగం పర్యవేక్షణను కేటాయించారు.

అస్థానా పిటిషన్‌పై తీర్పు నేడు

అవినీతి కేసులో తమపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కోరుతూ రాకేశ్ అస్థానా, సీబీఐ డిప్యూటీ ఎస్పీ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్లపై దిల్లీ హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది.

పది అభియోగాలపై సీవీసీ విచారణ నివేదిక

దిల్లీ: ఆలోక్ వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సమర్పించిన విచారణ నివేదికలో పది ప్రధాన అభియోగాలున్నాయి. 4 కేసుల్లో ఆలోక్‌కు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలు లభించినట్లు సీవీసీ ఇందులో పేర్కొంది. భారత గూఢచర్య సంస్థ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) చేపట్టిన ఫోన్ ట్యాపింగ్‌ల వివరాలను కూడా ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ట్యాపింగ్‌ల్లో 'నగదు చేతులు మారడంలో సీబీఐ డైరెక్టర్ పాత్ర' గురించిన సంభాషణలున్నట్లు కొందరు అధికారులు తెలిపారు. మాంస వ్యాపారి మోయిన్ ఖురేషీ నుంచి రూ.2 కోట్ల ముడుపుల కేసులో ఆలోక్ తీరు అనుమానాస్పదంగా ఉందని.. పూర్తి స్థాయి విచారణ జరిగితే వాస్తవాలు వెలుగుచూస్తాయని సీవీసీ ఈ నివేదికలో వ్యాఖ్యానించింది. మాజీ రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ నిందితుడిగా ఉన్న ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసు నుంచి రాకేశ్ సక్సేనా పేరును తప్పించాలని ప్రయత్నించినందుకు ఆలోక్‌పై తీవ్ర క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. విధుల్లో అలసత్వం వహించడం ద్వారా ఆలోక్ రాంచీ బ్యాంకు కుంభకోణం కేసులో రాజీవ్ సింగ్ అనే సీబీఐ అధికారికి అనుకూలంగా వ్యవహరించినట్లు పేర్కొంది. అవినీతి అధికారులను సీబీఐలోకి తీసుకువచ్చేందుకు ఆలోక్ ప్రయత్నించినట్లూ ఆధారాలు లభించాయని వివరించింది. ఆలోక్‌పై రాకేశ్ అస్థానా మోపిన ఈ పది అభియోగాలతోపాటు.. లఖ్‌నవూకు చెందిన సీబీఐ అధికారి చేసిన మరో ఐదు ఆరోపణలపైనా సీవీసీ విచారణ జరిపింది.

ఆలోక్ వర్మ తొలగింపుపై.. అత్యున్నత కమిటీలో విభేదించిన ఖర్గే

దిల్లీ: ఆలోక్ వర్మ ఉద్వాసనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే అత్యున్నత కమిటీ సమావేశంలో భిన్నాభిప్రాయపత్రం (డిసెంట్-నోట్) ఇచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఈ త్రిసభ్య కమిటీలో ఖర్గేతో పాటు జస్టిస్ ఎ.కె.సిక్రి కూడా సభ్యుడిగా ఉన్నారు. ఆలోక్‌పై ఆరోపణలున్నాయని సమావేశంలో సిక్రి పేర్కొనగా... అవేంటో వివరించాలని ఖర్గే పట్టుపట్టారని సమాచారం. ప్రభుత్వం బలవంతంగా ఆలోక్‌ను 77 రోజులపాటు సెలవుపై పంపిందని, ఆయనకు అన్ని రోజులపాటు పనిచేసే అవకాశం కల్పించాలని ఖర్గే డిమాండ్ చేసినట్టు సమాచారం. "తన వాదనను వినిపించుకునే అవకాశమైనా ఇవ్వకుండా ఆలోక్‌వర్మను తొలగించారు. సీబీఐ డైరెక్టర్/సంయుక్త పార్లమెంటరీ కమిటీ ద్వారా తన అవినీతిపై విచారణ చేపడతారని ప్రధాని భయపడుతున్నట్టు దీనిద్వారా రుజువైంది' ' అని ట్విట్టర్‌లో ఖర్గే వ్యాఖ్యానించారు.



వెంట రాకపోయినా..!

జీవితంలో కొన్నిసార్లు అత్యంత ఆప్తమిత్రులను కూడా వదిలేసి ముందుకుపోవాల్సిన సందర్భాలు ఎదురవుతాయి. ఇలాంటి సంఘర్షణ తలెత్తినప్పుడు మన మనస్సులో ఎక్కడో మూలన కర్తవ్యబోధ చేస్తున్న ఆ చిన్న స్వరమే అంతిమ నిర్ణేత కావాలి!

– మహాత్మా గాంధీ

ఫిబ్రవరి నుంచే రెట్టింపు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

రెట్టింపు చేస్తే నెలకి రూ.1,120కోట్లు, ఏడాదికి రూ.13,440కోట్లు చొప్పున వెచ్చించాలి. ఇప్పటికే మంజూరై పంపిణీ అవుతున్న పింఛన్లకే ఈ మొత్తం ఇవ్వాలి. డిసెంబర్ ఆఖరు నాటికి వివిధ రకాల పింఛన్లు కావాలని కోరుతూ ప్రభుత్వానికి 2.5లక్షల దరఖాస్తులందాయి. తాజా జన్మభూమి గ్రామ సభల్లో తొమ్మిదో తేదీ నాటికి పింఛన్ల కోసం మరో 1.05లక్షల దరఖాస్తులందాయి. ఇతర రూపాల్లో అందిన విజ్ఞప్తులకు మరో లక్ష మందికి ఇవ్వాల్సి వస్తుందనుకున్నా మొత్తం 4.55లక్షల కొత్త పింఛన్లు మంజూరయ్యే వీలుంది.

వీటికి సైతం ఫిబ్రవరి నుంచే పెంచిన మొత్తం అందుతుంది. కొత్త వాటినీ కలిపితే మొత్తం పింఛన్ల సంఖ్య 55.16లక్షలకు చేరుతుంది. ఈ మేరకు ప్రభుత్వం వెచ్చించాల్సిన మొత్తం కూడా పెరుగుతుంది. కొత్త పింఛన్ల మంజూరుతోపాటు పెంచే మొత్తానికి సంబంధించిన అధికారిక ప్రకటన ఈనెల మూడు, నాలుగో వారంలో వెలువడే అవకాశముందని అధికార వర్గాల సమాచారం.

ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లో ఉన్న పింఛన్ల మొత్తం సంఖ్య 50,61,906

విభాగాలు	సంఖ్య
వృద్ధులు	22,46,947
వితంతువులు	19,07,307
దివ్యాంగులు	6,18,699
చేనేత కార్మికులు	95,415
ఒంటరి మహిళలు	88,202
కల్లు గీత కార్మికులు	22,701
కళాకారులు	32,979
మత్స్యకారులు	39,967
ట్రాన్స్‌జెండర్స్	1,645
డయాలసిస్ రోగులు	8,044

అయోధ్య కేసు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

వైదొలగాలని కోరుకోవడంలేదని, నిర్ణయాన్ని ఆయనే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే విచారణనుంచి వైదొలగుతున్నట్టు జస్టిస్ లలిత్ చెప్పారు. దీంతో మరో న్యాయమూర్తిని నియమిస్తూ కొత్త ధర్మాసనం ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏర్పడింది.

ధర్మాసనం ఏర్పాటుపై అభ్యంతరం

రాజీవ్ ధావన్ మాట్లాడుతూ అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటుపై అభ్యంతరం తెలిపారు. తొలుత ఈ కేసును త్రిసభ్య ధర్మాసనం విచారించిందని, ఎక్కువ మంది సభ్యులతో ధర్మాసనం ఏర్పాటు చేయాలంటే న్యాయపరమైన ఉత్తర్వులు అవసరమని చెప్పారు. మసీదు అన్నది ఇస్లాం మతంలో అంతర్భాగం కాదంటూ 1994లో ఇచ్చిన తీర్పుపై విచారణకు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరితే..ఆ అవసరం లేదంటూ గత సెప్టెంబరు 27న ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా మరో సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే జోక్యం చేసుకుంటూ రాజ్యాంగపరమైన అంశాలు ఉన్నప్పుడు అయిదుగురు కన్నా తక్కువ సభ్యుల ధర్మాసనం నిర్ణయాలు తీసుకోలేదని తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగొయి స్పందిస్తూ అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు తప్పేమీ కాదంటూ ఇందుకు సంబంధించిన నిబంధనలను ఉటంకించారు.

పరిశీలించాల్సిన సమస్యలు 120

కేసుకు ఉన్న ప్రాధాన్యం, పరిశీలించాల్సిన పత్రాల సంఖ్య దృష్ట్యా అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి వచ్చిందని జస్టిస్ గొగొయి తెలిపారు. మొత్తం 120 సమస్యలను పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి సీలు చేసిన 50 పెట్టెల్లో పత్రాలు ఉండగా వాటన్నింటినీ సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్వయంగా పరిశీలిస్తుంది. ఆ పెట్టెలు ఉన్న గదులను కూడా సీలు చేశారు. కొన్ని దస్త్రాలు సంస్కృతం, అరబిక్, ఉర్దూ, హిందీ, పర్షియన్, గురుముఖి భాషల్లో ఉన్నాయి. అవసరమైతే అధికారిక అనువాదకుల సహాయం తీసుకుని వాటిని పరిశీలించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఎప్పటికి సిద్ధమవుతాయో రిజిస్ట్రీ ఈ నెల 29న నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అలహాబాద్ హైకోర్టు 88 మంది సాక్షులను విచారించి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేసింది. ఇవే 13,886 పేజీల వరకు ఉన్నాయి. ఇవికాక సాక్ష్యాలుగా 257 పత్రాలు, ఇతరాలు ఉన్నాయి. దీనిపై ధావన్ జోక్యం చేసుకుంటూ పురావస్తు శాఖ ఇచ్చిన మూడు ఆధారాలు సహా మొత్తం 533 సాక్ష్యాలు ఉన్నాయని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు 4,304 పేజీలు ఉంది. అనుబంధాలతో కలిసి 8,533 పేజీల వరకు ఉంటుంది. ఈ తీర్పుపై 14 అపీళ్లు దాఖలయ్యాయి.

టమోటా పండుగ

- తమిళనాట సంక్రాంతి ప్రభావంతో పెరిగిన ధర
- మదనపల్లెలో గరిష్ఠంగా కిలో రూ.42

మదనపల్లె (గ్రామీణ), న్యూస్‌టుడే: తమిళనాడులో సంక్రాంతి సందడి ఆంధ్రా టమోటా రైతులకు పండుగ తెచ్చింది. పండుగ నేపథ్యంలో తమిళనాటంతటా అన్ని వంటకాల్లో టమోటాలను విస్తృతంగా వినియోగిస్తారు. దీంతో ఆ రాష్ట్ర వ్యాప్తంగా టమోటాకు ఎక్కడలేని డిమాండ్ వచ్చింది. ఇదే సమయంలో తమిళనాడులో ఎక్కడా టమోటా పంట సాగులో లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో మన రాష్ట్రంలో పది రోజుల క్రితం వరకూ ధర లేని టమోటాకు ఇప్పుడు ఒక్కసారిగా మంచి ధర వచ్చింది. టన్నుల కొద్దీ టమోటాలు మన రాష్ట్రంలోని మదనపల్లె మార్కెట్ నుంచి తమిళనాడుకు తరలిపోతున్నాయి.

మరో వారం పాటు పెరిగే అవకాశం

చిత్తూరు జిల్లా మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌లో గురువారం కిలో టమోటాలు అత్యల్పంగా రూ.10 నుంచి, నాణ్యమైన టమోటాల ధర కిలో రూ.42 వరకు పలికింది. కేవలం సంక్రాంతి కారణంగానే మరో వారం రోజుల పాటు ధరలు పెరిగే అవకాశం ఉందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. మదనపల్లె ప్రాంతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి గణనీయంగా టమోటా దిగుబడి తగ్గింది. ఈ కారణంగా ఎగుమతికి కావాల్సిన సరకు లేకపోవడం, అలాగే తమిళనాడులో సంక్రాంతికి వినియోగం ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ధరలు పెరిగాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రోజుకు 50 నుంచి 60 లోడ్ల టమోటాలను అక్కడికి తరలిస్తున్నారు.

తలాక్‌పై మళ్లీ అత్యవసర ఆదేశాలు: కేంద్ర మంత్రివర్గం

దిల్లీ: ముమ్మారు తలాక్‌పై మళ్లీ అత్యవసర ఆదేశాలు (ఆర్డినెన్స్) జారీ చేయాలన్న ప్రతిపాదనకు గురువారం కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జారీ చేసిన అత్యవసర ఆదేశాల కాలపరిమితి ఈ నెల 22న ముగియనుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీన్ని చట్టరూపంలో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా రాజ్యసభలో ఇంకా ఆమోదం లభించలేదు.

గ్రహం అనుగ్రహం

11-1-2019 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత ఋతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
పంచమి: మ. 4.02 తదుపరి షష్ఠి
పూర్వాభాద్ర నక్షత్రం: తె. 5.22 తదుపరి ఉత్తరాభాద్ర
అమృత ఘడియలు: రా. 8.37 నుంచి 10.22 వరకు
వర్జ్యం: ఉ. 10.06 నుంచి 11.51 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.50 నుంచి 9.34 తిరిగి మ. 12.31 నుంచి 1.15 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-39

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.7	28.3
హైదరాబాద్	10.9	29.0
గుంటూరు	14.2	29.6
తిరుపతి	15.0	30.0
శ్రీకాకుళం	16.0	25.0
కడప	16.0	33.0
కర్నూలు	16.2	32.8
అనంతపురం	16.3	32.1
విశాఖపట్నం	16.4	27.2
రాజమహేంద్రవరం	16.5	31.0
విజయవాడ	18.6	29.4
నెల్లూరు	20.0	20.0
తాడేపల్లిగూడెం	21.0	28.0

రిలయన్స్ సెజ్‌కు 31న శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: భారీ పెట్టుబడితో తిరుపతిలో ఏర్పాటయ్యే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)కి ఈ నెల 31న శంకుస్థాపన చేయనున్నారు. 150 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న సెజ్‌లో ఆర్ఐఎల్ రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. జియో ఫోన్లు, సెట్‌టాప్ బాక్సులు, టెలివిజన్లు, ఇతర అనేక ఎలక్ట్రానిక్ వస్తువులను ఇక్కడ రోజూ 10 లక్షలకుపైగా తయారు చేయనున్నారు. సెజ్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు. 2018 ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో కలిసిన రిలయన్స్ గ్రూపు సంస్థల ఛైర్మన్ ముఖేశ్ అంబానీ తిరుపతిలో ఆర్ఐఎల్ సెజ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రావడంతో ప్రభుత్వం తరఫున కేటాయించిన భూమిలో సెజ్ ఏర్పాటుకు 31న నిర్వహించే భూమి పూజలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్, ముఖేశ్ అంబానీ పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

శ్రీలంక పర్యటనకు ఐఆర్‌సీటీసీ ప్యాకేజీ

రైల్వేస్టేషన్(విజయవాడ), న్యూస్‌టుడే: శ్రీలంకలోని యాత్రా ప్రదేశాలు సందర్శించే వారి కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ విజయవాడ మేనేజర్ మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 22న హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 26న తిరుగు ప్రయాణం అయ్యే ఈ ప్యాకేజీలో శ్రీలంకలోని మున్నేశ్వరం ఆలయం, లక్ష్మీనారాయణ ఆలయం, గౌతమ బుద్ధ, శ్రీభక్త హనుమాన్ ఆలయం, రామబోద, సీత అమ్మన్ ఆలయ సందర్శన ఉంటుంది. విమాన టికెట్లు, భోజనం, వసతి, విడిది, రవాణా, గైడ్‌తో కలిపి టికెట్టు ధర ఒక్కొక్కరికీ రూ.58120 ఉంటుంది. టికెట్లు, ఇతర వివరాలకు 0866-2572280, 97013 60620, 97013 60605 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి సేవలో జగన్

- **అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు**

ఈనాడు, తిరుపతి - తిరుమల, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహనరెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి మొక్కు చెల్లించుకున్నారు. బుధవారం ప్రజాసంకల్ప యాత్ర పూర్తి చేసుకున్న అనంతరం ఆయన విజయనగరం నుంచి రైలులో బయలుదేరి గురువారం ఉదయం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తిరుపతిలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. అనుమతించిన అతి కొద్ది మంది పార్టీ నేతలను కలుసుకున్నారు. మధ్యాహ్నం 1.10 గంటలకు అలిపిరి నుంచి నడక ప్రారంభించి ఆలయాలను సందర్శిస్తూ.. అక్కడక్కడా సేద తీరుతూ సాయంత్రం 5.30కు తిరుమలకు చేరుకున్నారు. ఆయన వెంట మిథున్‌రెడ్డి, రోజా, కరుణాకర రెడ్డి తదితరులు నడిచారు. దివ్యదర్శనం టోకెన్ తీసుకున్న జగన్ కోసం భక్తులను కొద్దిసేపు ఆపి ప్రత్యేక దర్శనాన్ని తితిదే కల్పించింది. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన హుండీలో కానుకలు సమర్పించారు. ఆలయం నుంచి బయటకు వచ్చిన జగన్.. శ్రీశారదపీఠానికి చేరుకుని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు.



శ్రీవారిని దర్శించుకుని ఆలయం నుంచి వస్తున్న జగన్. ఇటూఅటూ భూమన, చెవిరెడ్డి

కార్యకర్తల హల్‌చల్

జగన్ వెంట వచ్చిన కార్యకర్తలు అలిపిరి మార్గంలో మొదటి మెట్టు నుంచే 'జై జగన్, సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. ఆయన స్వామివారి ఆలయానికి వచ్చిన సమయంలోనూ అనుచరుల హడావుడి కనిపించింది. జగన్‌తోపాటు వందలాది మంది ప్రత్యేక ప్రవేశ దర్శన మార్గంద్వారా (రూ.300 టిక్కెట్) ఆలయంలోకి వెళ్లారు. టోకెన్లు లేనివారు సైతం ప్రవేశించడంతోపాటు తనిఖీలకు సహకరించకుండా మందిరం వైపునకు దూసుకుపోయారు. దీంతో మహాద్వారం, ధ్వజస్తంభంవద్ద తోపులాటలు జరిగాయి. జగన్ గరుడాద్రినగర్ టోల్‌గేటు నుంచి శ్రీకృష్ణ విశ్రాంతి గృహానికి చేరుకోవడం, అక్కడి నుంచి వైకుంఠం-1కు, ఆలయం నుంచి తిరుగు ప్రయాణం సమయంలో కార్యకర్తలతోపాటు జగన్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది హడావుడి చేశారు. సహస్రదీపాలంకరణ సేవ టిక్కెట్లు కలిగిన భక్తులను సాధారణ సమయానికి శ్రీవారి దర్శనాన్ని తితిదే కల్పించలేకపోయింది. రాత్రి 8 గంటల అనంతరం వీరికి దర్శనం లభించింది.

మున్సిపల్ అధికారులతో వాగ్వాదం

తిరుపతి నగరంతోపాటు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ మార్గంలో వైకాపా నాయకులు ప్లాస్టిక్ తోరణాలను కట్టారు. తిరుపతిలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలులో ఉన్న కారణంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయమై అధికారులు, కార్యకర్తల నడుమ వాగ్వాదం జరిగింది.



జన్మభూమి గ్రామసభలో నేత్ర, అవయవదాన ప్రతిజ్ఞ చేస్తున్న అలజంగి గ్రామస్థులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ సేవకులు

అవయవ దానానికి మేము సైతం

జన్మభూమి సాక్షిగా ముందుకొచ్చిన అలజంగి గ్రామం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు గ్రామసభ సాక్షిగా...ప్రజా చైతన్యం వెల్లివిరిసింది. ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు తమ వంతుగా మరణానంతరం నేత్ర, అవయవదానం చేస్తామంటూ గ్రామమంతా ముందుకొచ్చింది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం అలజంగి గ్రామ పంచాయతీ ఇందుకు వేదికైంది. వారం రోజులుగా ఈ గ్రామంలో చీపురుపల్లికి చెందిన సత్యరామ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా అవయవదానం ఆవశ్యకతపై వలంటీర్లు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వారిలో స్ఫూర్తిని పెంపొందించారు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన జన్మభూమి గ్రామసభలో ఎంపీడీవో ఐ.సురేష్, ప్రత్యేకాధికారి ఎన్‌వీ వేణుగోపాల్, గ్రామపెద్దలతో పాటు హాజరైన సభికులు.. మొత్తం 463 మంది సంయుక్తంగా అవయవదానం చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈమేరకు వాగ్దాన పత్రాలను చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన సత్యరామ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు జగదీష్, పీవో ముకుంద, గ్రామపెద్దలను అధికారులు అభినందించారు.

రాష్ట్రాల మొర ఆలకించరా?

జీఎస్‌టీ కౌన్సిల్‌పై యనమల ఆగ్రహం

ఈనాడు, దిల్లీ: రాష్ట్రాల పరిస్థితులను జీఎస్‌టీ కౌన్సిల్ విస్మరిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. గురువారం ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలో జరిగిన 32వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రాలను సంప్రదించకుండా అజెండా అంశాలను కౌన్సిల్ నిర్ణయిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. "మినహాయింపులు, పన్ను తగ్గింపుల విషయాల్లో రాష్ట్రాలకు ప్రత్యేక సమస్యలున్నాయి. వాటిపై కౌన్సిల్ చర్చించడంలేదు. ఈ అంశంపై కౌన్సిల్‌కు ఎన్ని లేఖలు రాసినా ఫలితం లేదు. ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన విజ్ఞాపనలను దృష్టిలో ఉంచుకొని అజెండా అంశాలు ఖరారు చేయాలి" అని యనమల డిమాండ్ చేశారు. ఈ వాదనకు కౌన్సిల్ సమావేశంలో కర్ణాటక, కేరళ, దిల్లీ ఆర్థిక మంత్రులు మద్దతు పలికారు. కాంపోజిషన్ పథకం కింద టర్నోవర్ పరిమితిని కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచడాన్ని, ఏడాదికోసారి రిటర్న్‌ల దాఖలు, మూడు నెలలకోసారి పన్ను చెల్లించాలన్న నిర్ణయాలకు యనమల మద్దతు తెలిపారు. వస్తువుల సరఫరా వ్యాపారుల రిజిస్ట్రేషన్ పరిమితిని పెంచడాన్ని స్వాగతించారు. దీనివల్ల రాష్ట్రాలకు ఆదాయ నష్టం జరిగినా చిన్న పరిశ్రమలకు మేలు జరుగుతుందన్నారు. ఈ నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.7 వేల కోట్ల మేర ఐజీఎస్‌టీ మొత్తం అపరిష్కృతంగా ఉందని, దీన్ని త్వరగా పరిష్కరించి రాష్ట్రాలకు చెల్లింపులు చేయాలని కోరారు. తాత్కాలిక ప్రాతిపదికన ఏపీకి రూ.100 కోట్లు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.



28న కలెక్టర్ల సదస్సు

ఈనాడు, అమరావతి: కలెక్టర్ల సదస్సు ఈ నెల 28వ తేదీన ఉండవల్లి ప్రజా వేదికలో జరగనుంది. ఈ మేరకు రెవెన్యూశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

దేవదాయశాఖ ప్రభుత్వ సలహాదారుగా రామకోటయ్య

దేవదాయశాఖకు సంబంధించి ప్రభుత్వ సలహాదారుగా చెరువు రామకోటయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీఅయ్యాయి.

కదిలే రైళ్లలోనూ ఖాళీ బెర్తుల వివరాలు

- **తొలిసారి దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రారంభం**

ఈనాడు, హైదరాబాద్: రైలు కదిలే సమయానికి ఖరారైన రిజర్వేషన్ బెర్తుల పట్టిక మాత్రమే ఇప్పటివరకూ అందరికీ అందుబాటులో ఉండేది. ఇకపై రైలు కదిలాక కూడా ఖాళీ బెర్తుల వివరాలను తెలుసుకోవచ్చు. రైల్వే శాఖ తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చిన హ్యాండ్ హెల్డ్ టర్మినల్స్ (హెచ్‌హెచ్‌టీ) వ్యవస్థతో ఇది సాధ్యమయింది. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా మొదటిసారి ఈ వ్యవస్థను దక్షిణ మధ్య రైల్వేలో డివిజనల్ రైల్వే మేనేజర్ అమిత్ వరదాన్ గురువారం ప్రారంభించారు. హెచ్‌హెచ్‌టీ పరికరాల ద్వారా రైలు ప్రయాణంలో టికెట్ల తనిఖీని నిర్వహించనున్నారు. వివిధ స్టేషన్ల మధ్య ఖాళీగా ఉన్న బెర్తుల వివరాలను తెలుసుకోవడంతోపాటు వాటిని కేటాయించవచ్చు. తొలిసారి సికింద్రాబాద్ నుంచి వెళ్లే నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని సిబ్బందికి 40 హెచ్‌హెచ్‌టీ పరికరాలను అందించారు.

ఈనాడు


రగులుతున్న ఈశాన్యం

పెను వివాద కేంద్రమైన పౌరసత్వ సవరణ బిల్లు కారణంగా ఈశాన్య భారతవాసుల ప్రయోజనాలకు ఎటువంటి భంగం వాటిల్లబోదని కేంద్రప్రభుత్వం భరోసా ఇస్తున్నా- అసోం, చుట్టుపక్కల రాష్ట్రాల్లో నిరసనోద్యమ ఉద్ధృతి తగ్గడంలేదు. లోక్‌సభామోదం పొంది ఇంకా రాజ్యసభలో నెగ్గాల్సి ఉన్న ఆ బిల్లును ఉపసంహరించుకునేదాకా ప్రధానమంత్రి, కేంద్ర హోమంత్రులు అసోమ్‌లో అడుగుపెట్టనిచ్చేదే లేదని ఆందోళనకారులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. పౌరసత్వ చట్టసవరణ ప్రతిపాదన వెలుగుచూశాక నిరుడు మే నుంచి బ్రహ్మపుత్ర లోయలో రాజుకున్న నిరసనలు, బిల్లు పార్లమెంటు దిగువ సభలో నెగ్గడంతోనే ప్రజ్వరిల్లాయి. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్లకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించడానికి ఉద్దేశించిన బిల్లును కేంద్రమంత్రిమండలి సమ్మతించడం తరువాయి- ఎన్డీయేతో అసోం గణపరిషత్ తెగతెంపులు చేసుకొంది. ఇటీవలి ఎన్నికల్లో నెగ్గి అధికారం చేపట్టిన మిజో నేషనల్ ఫ్రంట్‌తోపాటు నాగాలాండ్‌లో గిరిజన సమితి (ఎన్‌టీపీ), మేఘాలయ మంత్రివర్గం, వివిధ రాజకీయ పక్షాలు, ఈశాన్యభారత విద్యార్థి సంస్థ(నెసో)... బిల్లును చాపచుట్టేయాల్సిందేనని గళమెత్తుతున్నాయి. పోటెత్తుతున్న అక్రమ వలసల మూలాన సొంతగడ్డపై తామే మైనారిటీలయ్యే దుస్థితి దాపురించిందంటూ ఎనభై దశకంలో ఆసు(ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్) ఆరేళ్లపాటు కొనసాగించిన ఆందోళన తీవ్ర సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఆసు, కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి (కేఎమ్ఎస్ఎస్) సహా నలభైకి పైగా సంస్థలు ఉద్యమపథంలో కదం తొక్కుతున్నాయి. భారీయెత్తున వలసదారులకు అధికారికంగా భారత పౌరసత్వం దఖలుపడితే స్థానిక భాషలు, సంస్కృతి, ఆర్థిక సామాజిక రంగాలు ఛిద్రమైపోతాయన్న భయాందోళనల లావా ఎగదన్నుతున్న వేళ- ఈశాన్య భారతం కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాన్ని తలపిస్తోంది!

మొన్నీమధ్యే వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం, ఒక్క అసోమ్‌లోనే తిష్ఠ వేసిన 'విదేశీ అక్రమ వలసదారుల' సంఖ్య సుమారు 35 లక్షలు. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లో బంగ్లాదేశీ అక్రమ వలసదారులు రెండు కోట్లకు పైబడినట్లు రెండేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం రాజ్యసభాముఖంగా ప్రకటించింది. అంతగా చిలవలు పలవలు వేసుకుపోయిన సమస్యకు పరిష్కారాన్వేషణలో ఏం జరిగింది? 2018 డిసెంబరు చివరిదాకా సాగిన అసోం పౌరుల వడపోత మహాయజ్ఞం- సంక్షుభిత హృదయాలకు సాంత్వన ప్రసాదించే మాట ఎలాగున్నా, లక్షల మందిలో ఆరని ఆవేదన రగిలించింది. జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ)లో 40 లక్షలమంది వరకు పేర్లు లేకుండాపోవడం గగ్గోలు పుట్టించింది. సమీక్ష దరిమిలా అదృశ్యమైన పేర్ల సంఖ్య కొంతమేర తగ్గిందంటున్నా, నిరసన ధ్వనుల జోరు ఉపశమించలేదు. ఈ దశలో పౌరసత్వ సవరణ బిల్లు పార్లమెంటు ఆమోదముద్ర పొంది చట్టరూపం దాలిస్తే- వర్తింపజేసే తేదీలో మార్పువల్ల లక్షల మంది రాత్రికి రాత్రి భారతీయ పౌరులైపోతారన్న ఆలోచనే, ఆందోళనకారుల్ని కుపితుల్ని చేస్తోంది. మూడున్నర దశాబ్దాల క్రితం అక్రమ వలసల నిర్ధారణ ట్రైబ్యునల్‌ను అవతరింపజేస్తూ తెచ్చిన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదంటూ 2005 జులైలో సర్వోన్నత న్యాయస్థానం అడ్డంగా కొట్టేసింది. ఆ పరిణామంతో 'జాతీయ నాయక్'గా ప్రాచుర్యంలోకి వచ్చి అసోం ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన శర్బానంద సోనోవాల్, ఎన్నికల హామీని భాజపా నిలబెట్టుకున్నదంటూ పౌరసత్వ బిల్లును స్వాగతించేసరికి ఆందోళనకారులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. మతం ప్రాతిపదికన పౌరసత్వం దఖలుపరచడమేమిటన్న ఘాటు విమర్శలు ఒకవంక, చరిత్రాత్మక అసోం ఒడంబడిక స్ఫూర్తినే కాలరాస్తున్నారన్న పరుష వ్యాఖ్యలు మరోవైపు- అసోమ్‌లో సెగలుపొగలు కక్కుతున్న రాజకీయ చిత్రాన్ని కళ్లకు కడుతున్నాయి.

గతంలో కుదిరిన అసోం ఒడంబడిక ప్రకారం- 1971, మార్చి 24వ తేదీ తరవాత ఈ గడ్డమీద అడుగిడిన బంగ్లా ప్రవాసులు (హిందువులైనా, ముస్లిములైనా) అందర్నీ విదేశీయులుగానే పరిగణించాల్సి ఉంటుంది. జాతీయ పౌర రిజిస్టరుకూ అదే తేదీ ప్రామాణికమైంది. ఈ అంశాన్ని ఉపేక్షించి డిసెంబరు 2014 లోగా ఇక్కడికొచ్చిన హిందూ బంగ్లాదేశీ వలసదారులకు భారత పౌరసత్వం దఖలుపరుస్తామనడం ఎంతవరకు సహేతుకమన్న ప్రశ్నలిప్పుడు దూసుకొస్తున్నాయి. బిల్లు చట్టమైతే ఎన్ఆర్‌సీ పేరిట ఇన్నాళ్లూ చేపట్టిన కసరత్తు వ్యర్థమే కదా అన్న అభ్యంతరాలకు సరైన సమాధానం కరవు! పౌరసత్వ సవరణ వల్ల ఏ దశలోనూ రాష్ట్రంపై అదనపు భారం పడే ప్రసక్తే లేదని కేంద్రప్రభుత్వం, శర్బానంద సర్కారు పదేపదే హామీలిచ్చాయి. స్థానికులకు ఏ అసౌకర్యమూ కలగకుండా వలసదారులు కుదురుకునేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్రానిదేనన్న సంయుక్త పార్లమెంటరీ సంఘం నివేదిక బహిర్గతం కావడం తరువాయి- కొలిమంటుకుంది. నష్ట నివారణలో భాగంగా, అసోం ఒడంబడికలోని ఆరో షరతు ప్రకారం- స్థానికుల రాజకీయ హక్కుల పరిరక్షణకు కేంద్రం గొడుగు పడతామంటోంది. 371 రాజ్యాంగ అధికరణను వర్తింపజేసి పార్లమెంటరీ, శాసనసభ నియోజకవర్గాల్లో స్థానికులకు కోటా కట్టబెడతామంటోంది. అదే జరిగితే హిందూ బెంగాలీలతో పాటు ముస్లిమ్ బెంగాలీల నుంచీ నిరసన తప్పదు. ముందు నుయ్యి వెనక గొయ్యిలా పరిణమించిన ఈ ఇరకాటం నుంచి కమలనాథులు ఎలా గట్టెక్కుతారో చూడాలి. పార్టీగతమైన సమస్య ఎలాగున్నా, ఈశాన్యంలో మళ్ళీ పరిస్థితులు అదుపు తప్పుతున్నాయన్నది యథార్థం. దీటైన పరిష్కారాల సాధనలో ఏమాత్రం జాగుచేసినా దేశం మరింత మూల్యం చెల్లించుకోకతప్పదన్నదే ఆలోచనాపరుల ఆక్రోశం!

లోక్‌పాల్... ఇంకెప్పుడు?



కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ హయాములో మేరమీరిన అవినీతే లేకపోతే ఏమై ఉండేది? అవినీతిని అంతమొందిస్తామని, విదేశాల్లో దాచిన నల్లడబ్బు వెనక్కు తెప్పిస్తామని, లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని భీషణ ప్రతిజ్ఞలు చేసి అధికారం చేజిక్కించుకునే అవకాశం నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీకి వచ్చేదే కాదు. లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి అంతుచూస్తామని చెప్పిన మోదీ అయిదేళ్ల పాలన చివరి దశకు చేరుకుంటున్నా లోక్‌పాల్ ఏర్పడనే లేదు. అసలు ఈ విషయం గురించి ఆలోచించడానికి, లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశం నిర్వహించడానికి 45 నెలలపాటు కేంద్రానికి తీరికే చిక్కలేదు. చిక్కిన తరవాత సాధ్యమైనదల్లా లోక్‌పాల్ పీఠానికి తగిన వారిని, ఆ వ్యవస్థలో సభ్యులుగా ఉండగలిగినవారి పేర్లు సూచించడానికి అన్వేషణ సంఘం (సెర్చ్ కమిటీ) ఏర్పాటు కావడమే. ఆ సంఘమూ ఒక్క సమావేశమైనా నిర్వహించలేదు! తాము అధికారంలోకి వస్తే విదేశాల్లో దాచిన నల్లధనాన్ని 30 రోజుల్లోగా తరలించుకొస్తామన్న హామీకీ లోక్‌పాల్‌కు పట్టిన గతే పట్టింది. అవినీతిని ఏ రూపంలోనూ సహించబోమన్న వాగ్దానానిదీ అదే వరస.

కదలని రథం

లోక్‌పాల్ ఏర్పాటు చేస్తామన్న మంత్ర జపం అయిదున్నర దశాబ్దాలుగా సాగుతోంది. లోక్‌పాల్ మాటను మొదటిసారి ప్రసిద్ధ న్యాయకోవిదుడు, పార్లమెంటు సభ్యుడు డాక్టర్ ఎల్.ఎం. సింఘ్వీ ఉపయోగించారు. రెండో లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన సింఘ్వీ అవినీతిపై దర్యాప్తు చేయడానికి సర్వాధికారాలున్న కాపలాదారు(లోక్‌పాల్)ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని పరిపాలన సంస్కరణల సంఘం సైతం కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటు చేయాలని 1966నాటి ప్రత్యేక మధ్యంతర నివేదికలో సూచించింది. ఈ నేపథ్యంలోనే ప్రసిద్ధ న్యాయవాది శాంతిభూషణ్ 1968లో మొదటి జన లోక్‌పాల్ బిల్లును ప్రతిపాదించారు. ఆ బిల్లును నాలుగో లోక్‌సభ 1969లో ఆమోదించింది. కానీ రాజ్యసభ ఆమోదం దక్కలేదు. తరవాత 1971, 1977, 1985, 1989, 1996, 1998, 2005, 2008లో లోక్‌పాల్ బిల్లులను ప్రతిపాదించడం, అవి గట్టెక్కకపోవడం సాగుతూనే వచ్చింది. చివరకు 2013 డిసెంబర్ 18న లోక్‌పాల్ బిల్లుకు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం లభించింది. 2014 జనవరి ఒకటిన ఈ చట్టం అమలులోకి వచ్చినట్లు ఉత్తర్వు జారీ అయింది. అయినా ఇన్నేళ్లుగా ఒక్కసారైనా ఎవరినీ లోక్‌పాల్‌గా నియమించలేదు.

లోక్‌పాల్‌ను నియమించడానికి ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆయన పంపిన మరో న్యాయమూర్తి, ఇంకో న్యాయకోవిదుడితో కూడిన కమిటీ ఉంటుంది. లోక్‌పాల్ చట్టం అమలులోకి వచ్చిన తరవాత మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉండగా ఫిబ్రవరి మూడున, 21న ఎంపిక కమిటీ సమావేశం రెండుసార్లు జరిగింది. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత 45 నెలల తరవాతగానీ ఈ సమావేశాలు జరగలేదు. 2018 మార్చి ఒకటిన, ఏప్రిల్ 10న ఈ కమిటీ సమావేశమైంది. 2018 జులై 19, ఆగస్టు 21, సెప్టెంబర్ 4, సెప్టెంబర్ 19న మరో నాలుగు సమావేశాలు జరిగాయి. అయినా లోక్‌పాల్ నియామకం ఒక కొలిక్కి రాలేదు. దీనికి ప్రధాన కారణం ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరు కాకపోవడమే. అందుకు సహేతుకమైన కారణం ఉంది. ఆయనను మోదీ ప్రభుత్వం 'ప్రత్యేక ఆహ్వానితుడి'గానే పరిగణించింది తప్ప 'సభ్యుడి'గా కాదు. ప్రత్యేక ఆహ్వానితుడిగా అయితే సమావేశంలో ఆయన అభిప్రాయాలను నమోదు చేయడానికి, చర్చలో భాగస్వామి కావడానికి, ఓటు వేయడానికి వీలుండదు. ఖర్గేకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి హోదా లేదు. ఆ హోదా ఉండాలంటే ప్రధాన ప్రతిపక్షానికి లోక్‌సభలో 10 శాతం సభ్యులు అంటే 55 మంది మద్దతు ఉండాలి. అదే లేదు. నిజానికి లోక్‌పాల్ చట్టంలోని నాలుగో సెక్షన్ ప్రకారం ప్రతిపక్ష నాయకుడి హోదా ఉంటేనే సభ్యుడిగా పిలవడం సాధ్యమని ఎక్కడా లేదు. అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడిని ఆహ్వానించడానికి లోక్‌పాల్ ఎంపిక కమిటీ అంగీకరించింది. అయినా ప్రభుత్వ ధోరణి మారలేదు. లోక్‌పాల్ చట్ట సవరణకు 2016లో ప్రభుత్వం బిల్లు ప్రతిపాదించింది. కానీ ప్రతిపక్ష నేతకు ప్రత్యేక ఆహ్వానితుడి హోదాకు బదులు సభ్యుడి హోదా కల్పించడానికి ఇందులో ఏ సవరణా ప్రతిపాదించలేదు. అంటే లోక్‌పాల్ ఎంపికలో ప్రతిపక్ష పార్టీకి స్థానం లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఖర్గేతో పాటు సామాజిక కార్యకర్తలూ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడికి ఎంపిక కమిటీలో స్థానం కల్పించడానికి నాలుగేళ్ల కాలంలో అలాంటి సవరణే చేయలేదు. అంటే, ప్రతిపక్ష వాదన వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థమవుతోంది. ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నాయకుడు ఉండాలన్న నిబంధన ఉందన్నది ప్రభుత్వ వాదన. ఇది ఆనవాయితీయే తప్ప చట్టంలో ఉన్న నియమం కాదు. లోక్‌సభలో ఏ పక్షానికీ పది శాతం మద్దతు లేకపోతే లోక్‌పాల్ నియామకం కుదరదన్నది ప్రభుత్వ విధానంగా కనిపిస్తోంది. ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉన్న పక్షాన్ని ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ పని చేయడానికి అంగీకరించలేదు. సమాచార హక్కు చట్టం, కేంద్ర నిఘా వ్యవస్థ చట్టం మొదలైన వాటన్నింటిలోనూ ప్రతిపక్షంలోని పెద్ద పక్షం నాయకుడిని ప్రతిపక్ష నేతగా గుర్తించే అవకాశం ఉంది. అన్నింటినీ మించి ప్రతిపక్ష నేత లేకపోయినా లోక్‌పాల్ నియామకం జరగాలని సుప్రీంకోర్టు సైతం చెప్పినా ప్రభుత్వం ఏదో ఒక సాకు చూపుతోంది.

నిరుడు మార్చిలో ఎంపిక కమిటీ సమావేశం ఏర్పాటు చేయడానికి సుప్రీంకోర్టులో ఈ విషయమై 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ తరఫున దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణే కారణం. లోక్‌పాల్‌ను నియమించడానికి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో ప్రమాణపత్రం దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినందువల్లే సమావేశం నిర్వహించామనిపించారు. అన్వేషణా సంఘాన్ని ప్రభుత్వం నియమించడం లేదు కనక రాజ్యాంగంలోని 142వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టు ఆ కమిటీని నియమించి లోక్‌పాల్‌ను నియమించాలని 'కామన్ కాజ్' సంస్థ అభ్యర్థించింది. సవరణ ప్రతిపాదనలో ఉంది కనక తాము ఈ విషయంలో జోక్యం చేసుకోవడమంటే అధికార విభజన నియమాలను ఉల్లంఘించడమే అని సుప్రీంకోర్టు చెప్పింది. ప్రతిపక్ష నాయకుడంటే ఎవరో నిర్వచించడానికీ సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అయితే లోక్‌పాల్ చట్టం 'పనికివచ్చే చట్టమే' కనుక కేంద్ర ప్రభుత్వం లోక్‌పాల్‌ను నియమించకపోవడం 'సమర్థనీయం' కాదని మాత్రం వ్యాఖ్యానించింది. 2017 జులై 17న సుప్రీంకోర్టు ఆదేశాన్ని ప్రధాని నాయకత్వంలోని ఎంపిక కమిటీ పరిగణనలోకి తీసుకుంది తప్ప, నికరంగా చేసిందేమీ లేదు. ఇది కోర్టు ధిక్కారం కిందే లెక్క. సాంకేతిక కారణాలు చూపి లోక్‌పాల్ నియామకాన్ని వాయిదా వేయడం మీదే మోదీ ప్రభుత్వం దృష్టి ఉన్నట్లు కనిపిస్తోంది. ఎట్టకేలకు 2018 సెప్టెంబర్ 27న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ నాయకత్వంలో ఎనిమిది మంది సభ్యులతో అన్వేషణా కమిటీని ఏర్పాటు చేసింది.

చట్టానికి అయిదేళ్లు- కార్యరూపం దాల్చని నియామకం



అన్నా హజారే పూరించిన అవినీతి వ్యతిరేక ఉద్యమం నాటి దృశ్యం

అన్నా హజారే స్ఫూర్తితో...

లోక్‌పాల్ ఏర్పాటు ప్రతిపాదన అయిదున్నర దశాబ్దాలుగా ఉన్నా 2010 తరవాతే ఒత్తిడి పెరిగింది. అరుణారాయ్ నాయకత్వంలోని సమాచార హక్కు చట్టంకోసం ఉద్యమించిన నేషనల్ కాంపేన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీపీఆర్ఐ) ఒత్తిడి పెంచడమేకాక, జన లోక్‌పాల్ బిల్లు రూపొందించడానికి కమిటీ ఏర్పాటు చేసింది. 2011లో అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో లోక్‌పాల్ ఏర్పాటు ప్రధానాంశమైంది. ప్రభుత్వం సిద్ధంచేసిన బిల్లు బలహీనంగా ఉందని భావించి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కర్ణాటక మాజీ లోకాయుక్త సంతోష్ హెగ్డే, ప్రసిద్ధ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, అరవింద్ కేజ్రీవాల్ జన లోక్‌పాల్ బిల్లును రూపొందించారు. దీని ప్రకారం అవినీతి ఆరోపణలు నిజమని తేలితే మొత్తం వ్యవహారం రెండేళ్లలో పూర్తయి దోషులను జైలుకు పంపించాలి. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల మీద వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రభుత్వ ఆమోదం లేకుండానే విచారణకు అవకాశం ఉండటం ఈ బిల్లులో ప్రధానాంశం.

నిరంతర యత్నాలు

కేంద్ర ప్రభుత్వం ఎంతకూ లోక్‌పాల్‌ను నియమించకపోవడంతో నేషనల్ కాంపేన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీపీఆర్ఐ) నిరుడు జనవరిలో ప్రధానికి సవివరమైన లేఖ రాసింది. లోక్‌పాల్ నియామక కమిటీ సమావేశాల వివరాలు తెలియజేయాలని సంస్థ సభ్యురాలు అంజలీ భరద్వాజ్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే- కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ ఎలాంటి వివరాలూ వెల్లడించలేదు. ఈ కమిటీలో ఉన్నతస్థాయివారు ఉన్నందువల్ల ఆ వివరాలన్నీ 'రహస్యమే' అని తప్పించుకున్నారు. సమాచార హక్కు చట్టం కింద ఈ వివరాలు ఏవీ రహస్యాలు కావు. ఎంపిక కమిటీ సమావేశాల వివరాలు తెలియజేయకపోవడం చట్ట విరుద్ధమని అంజలీ భరద్వాజ్ అంటున్నారు. సాక్షాత్తు సుప్రీంకోర్టే ప్రభుత్వం తీరు 'పూర్తి అసంతృప్తికరంగా ఉంది' అని వ్యాఖ్యానించినా కేంద్ర సర్కారులో చలనం లేదు. ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన కోర్టుధిక్కార పిటిషన్‌పై విచారణ సందర్భంగా లోక్‌పాల్ విషయంలో కేంద్ర వైఖరి ఏమిటో తెలియజేయాలని గత జులైలోనే సుప్రీంకోర్టు కోరింది. అన్వేషణా కమిటీని 2018 సెప్టెంబర్ 27న ఏర్పాటు చేసినప్పటి నుంచీ ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో వెల్లడించాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. సెప్టెంబర్‌లో అన్వేషణా కమిటీని ఏర్పాటు చేయడానికి కూడా అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగడమే కారణం. వర్షకాల సమావేశాల్లోనైనా చట్టాన్ని తగు రీతిగా సవరించడానికి ప్రభుత్వం ప్రయత్నించలేదు. చివరకు లోక్‌పాల్‌ను నియమించే బాధ్యత మరో నాలుగైదు నెలల్లో ఏర్పడే కొత్త ప్రభుత్వం మీదే ఉంటుందేమో!

– ఆర్వీ రామారావ్

బంధనాలు తెంచాల్సిన నిబంధనలు

గత సంవత్సరం జులైలో లోక్‌సభ ఆమోదం పొందిన మానవ అక్రమ రవాణా నిరోధక బిల్లు పార్లమెంటు శీతకాల సమావేశాల్లో రాజ్యసభ ఆమోదం కూడా పొంది చట్టరూపం ధరిస్తుందని బాధితులు, సేవాసంస్థలు, సంఘ ప్రముఖులు వేయికళ్లతో ఎదురుచూశారు. అక్రమ రవాణాదారుల గుప్పిట నుంచి విముక్తులైన దాదాపు 12 వేల మంది, బిల్లు త్వరగా ఆమోదం పొందేట్లు చూడాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. వీరిలో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మొత్తం 14 రాష్ట్రాలకు చెందినవారున్నారు. వీరు గత నెలలో ఇదే అంశంపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకూ విన్నపం పంపారు. కానీ, బిల్లు రాజ్యసభ పరిశీలనకు రాకుండానే పార్లమెంటు శీతకాల సమావేశాలు ముగిశాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2016లో మొత్తం 15,379 మంది అభాగ్యులు అక్రమ రవాణాకు గురయ్యారని తెలిపింది. వారిలో 4,980 మందిని వ్యభిచార ఊబి నుంచి కాపాడినట్లూ వివరించింది.

లోపాలే శాపాలు

ఇప్పటివరకు మానవ అక్రమ రవాణా కార్యకలాపాలను భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లోని వివిధ సెక్షన్లతోపాటు అనేక ఇతర చట్టాల కింద విచారించి శిక్షలు విధిస్తున్నారు. కానీ, ఈ చట్టాల్లో పలు లోపాలు ఉండటంతో అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టలేకపోతున్నాయి. ఉదాహరణకు 1956నాటి అక్రమ రవాణా నిరోధక చట్టంలోని ఏడో సెక్షన్ 'వ్యభిచార సేవ అందిస్తానంటూ వెంటబడటం, ప్రలోభపెట్టడం' నేరమని పేర్కొంటున్నా, 'వెంటబడటం, ప్రలోభపెట్టడం' అంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించలేదు. కొత్త బిల్లులో ఇలాంటి లోపాలను సరిదిద్ది సమగ్ర రూపం కల్పించారు. ఉదాహరణకు కొత్త బిల్లులోని ఆరో సెక్షన్ కొన్ని వర్గాలు ఆనవాయితీగా వ్యభిచార రొంపిలోకి వెళ్లకుండా చూడటానికి రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో అక్రమ రవాణా నిరోధక సంఘాలు సంబంధిత వర్గాల కోసం విద్య, ఉపాధి కల్పన కార్యక్రమాలను చేపట్టాలని నిర్దేశిస్తోంది. అక్రమ రవాణాకు పాల్పడినట్లు రుజువై, శిక్ష పడినవారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి ఇదే బిల్లులోని పదో సెక్షన్ వీలుకల్పిస్తోంది. మొత్తంమీద బాధితుల పునరావాసంపై బిల్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా ఒక పునరావాస నిధిని ఏర్పాటు చేయాలంది. దీన్ని ఉపయోగించి బాధితులకు విద్య, నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయంఉపాధి కోసం పెట్టుబడి, ఇతర సదుపాయాలు కల్పించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. బాధితులు మళ్ళీ వ్యభిచార ఊబిలోకి జారిపోకుండా సొంత కాళ్లపై నిలబడటానికి, అవసరమైనప్పుడు న్యాయ సహాయం కోరడానికి పునాది ఏర్పరచాలని ఉద్దేశిస్తోంది. చట్టం అమలును పర్యవేక్షించే నోడల్ అధికారులకు; రాష్ట్ర, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో మానవ అక్రమ రవాణా నిరోధక బాధ్యతలు నిర్వహించే పోలీసు అధికారులకూ మధ్య సమన్వయాన్ని ఏర్పరుస్తోంది. మానవ అక్రమ రవాణా రాష్ట్రాలు, దేశాల ఎల్లలు దాటి జరుగుతున్న దృష్ట్యా సాక్ష్యాధారాలూ సులువుగా సరిహద్దులు దాటే వీలు కల్పించింది. న్యాయస్థానాల విచారణ కార్యకలాపాలను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా చూడటానికి, బాధితులు, నేరస్థులు, సాక్షులు, సాక్ష్యాధారాలు రాష్ట్రాలు, దేశాల మధ్య బదిలీ కావడానికీ సౌలభ్యం ఏర్పడింది. నేపాల్, బంగ్లాదేశ్, ఉక్రెయిన్, మధ్యాసియా దేశాల నుంచి భారత్‌కు మానవ అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో బిల్లులో ఈ అంశాలను పొందుపరచారు. ఈ ప్రక్రియను



పర్యవేక్షించడానికి కొత్తగా జాతీయ అక్రమ రవాణా నిరోధక బ్యూరోను ఏర్పరచాలని బిల్లు నిర్దేశించింది.

కేవలం కఠిన చర్యలతోనే మానవ అక్రమ రవాణాను నిరోధించలేమని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. కొత్త బిల్లు అక్రమ రవాణా సమస్యను మానవ హక్కుల కోణం నుంచి కాకుండా కేవలం నేర శిక్షాస్మృతి దృష్టితోనే చూడటం సమగ్ర పరిష్కారమనిపించుకోదని ఐక్యరాజ్య సమితి నిపుణులు భావిస్తున్నారు. కోల్‌కతా, హైదరాబాద్, సాంగ్లిలలో సంఘటితమై రాజకీయంగా చురుగ్గా ఉన్న సెక్స్ వర్కర్ల బృందాలు వేటినీ బిల్లు రూపకల్పన సమయంలో సంప్రతించకపోవడం, వారి సూచనలను పరిగణనలోకి తీసుకోకపోవడం పెద్ద లోపమనే విమర్శ వచ్చింది. వ్యభిచార వృత్తిలో ఉన్నవారిని నేరస్థులుగానో, బాధితులుగానో మాత్రమే బిల్లు పరిగణించడమూ సరికాదంటున్నారు. ఉదాహరణకు కోల్‌కతా వ్యభిచారవాడ సోనాగచిలో బతుకుతెరువు కోసం ఈ వృత్తిలోకి దిగినవారెందరో కనిపిస్తారు. వీరిలో అత్యధికులు భారత్, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లోని గ్రామ ప్రాంతాలనుంచి వచ్చినవారే. వ్యవసాయం కుదేలై కుటుంబం గడవడం కష్టమై స్వచ్ఛందంగా ఈ వృత్తిని చేపట్టామని వారు చెప్పారు. తమ సంపాదనలో కొంత సొంత ఊర్లోని కుటుంబానికి పంపుతున్నామనీ తెలియజేశారు. ఇక భర్త, ప్రియుడు, స్నేహితుల వల్ల మోసపోయి వ్యభిచారంలో కూరుకుపోయినవారి సంగతి చాలా దయనీయం. అక్రమ రవాణా నిరోధక బిల్లు ఇలాంటి ఉదంతాల్లో బాధితులను కాపాడటానికి, అక్రమ రవాణాదారులను శిక్షించడానికి ప్రాధాన్యమివ్వడం తప్పక స్వాగతించాలి. ఈ తరహా లైంగిక దోపిడిని నిలువరించడానికి సోనాగచి సెక్స్ వర్కర్లు 1997లో ఏర్పాటు చేసుకున్న దర్బార్ మహిళా సమన్వయ సంఘం సమర్థ చర్యలు తీసుకుంటోంది. సంఘం నియమించిన స్వయంనియంత్రణ సంస్థ, సోనాగచికి కొత్తగా వచ్చే యువతులు ఒక ఉపాధిగా వ్యభిచారంలోకి దిగారా లేక మోసపోయి వచ్చారా అన్నది నిగ్గుతేలుస్తుంది. స్వచ్ఛందంగా వచ్చినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి గుర్తింపు కార్డులిస్తుంది. అక్రమ రవాణాకు గురైనవారిని ప్రత్యేక శిబిరాల్లో ఉంచి అధికారులకు తెలియజేస్తుంది. ప్రభుత్వం ఈ అభాగినులను భద్రంగా స్వస్థలాలకు పంపుతుంది.

పునరావాసం కీలకం

పూర్వాపరాలను ఆలోచించకుండా బిల్లు చేసేయడం కన్నా సోనాగచి పద్ధతిలో వ్యభిచారాన్ని ఉపాధిగా గుర్తించి, కొన్ని భద్రతలను కల్పించడం ఉత్తమమని పరిశోధకుల అభిప్రాయం. కానీ, సోనాగచిలో అంతా స్వచ్ఛందం కాదని, నిర్బంధంగా వ్యభిచారంలోకి దించుతున్న ఉదంతాలు అధికమనే ప్రతివాదనా వినిపిస్తోంది. మొత్తంమీద చిత్తశుద్ధితో పనిచేస్తున్న సెక్స్ వర్కర్ల బృందాలనూ అక్రమ రవాణా నిరోధక చట్టం అమలులో భాగస్వాముల్ని చేస్తే మంచి ఫలితాలే వస్తాయి. వెట్టిచాకిరీ నుంచి విముక్తులైనవారికి, అక్రమ రవాణాకులోనైన మహిళలు, పిల్లలకు నగదు సహాయం, భూమి, గృహ, విద్యా వసతుల కల్పన, జీవనాధారం చూపడం వంటి ముఖ్యాంశాలు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ విధానాల్లో అంతర్భాగం. కానీ, అక్రమ రవాణా నిరోధక బిల్లులో వీటికి స్థానం కల్పించకపోవడం మరో పెద్దలోటు. పునరావాస నిధి గురించి బిల్లులో ప్రస్తావించినా దానికి ఇంత మొత్తాన్ని కేటాయించాలని నిర్దేశించకపోవడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు. రాజ్యసభ ఆమోదం కోసం తొందరపడేకన్నా ఈ లోటుపాట్లను సవరించి మరింత సమగ్రంగా బిల్లును రూపొందించడం అవసరం!

– ప్రసాద్

కస్తూరి పరిమళం

నీకోసమే జీవించే మనిషి ఒకరున్నప్పుడు ఈ లోకంలో, ఈ జీవితంలో మరొకటేదీ లేకపోయినా ఫరవాలేదనిపిస్తుంది. మన కోసం ఒకరు... ఎంత అందమైన ఊహ అది!

మనమే తప్పు చేసినా, మనమే కష్టంలో ఉన్నా, మనకే సంతోషం కలిగినా, ఎట్టి పరిస్థితుల్లోనైనా మనం ఒంటరివాళ్లం కాదనే నమ్మకం, భరోసా కలిగినప్పుడు అలాంటివారొకరున్నారనే ధైర్యం పొందినప్పుడు ఎంత ధీమాగా, నిర్భీతిగా ఉంటుంది! కానీ అదే అనుభూతి, అదే భరోసాను మనం మరొకరెవరికైనా ఇవ్వగలగాలి. మన వల్ల ఎవరైనా అలాంటి శాశ్వత మధుర భావనను పొందితే అది మనకెంతో అపురూపమైన అనుభవమవుతుంది. ఆ అనుభవాన్ని పొందితేగానీ అర్థం కాదు. జీవితంలో కొన్ని అద్భుతమైన విషయాలు, అపురూపమైన అనుభవాలు మన మధ్యలోనే మనలోనే ఉంటూనే మనకు అపరిచితంగా ఉండిపోతాయి. అవి మనకు అర్థమైనప్పుడు, అనుభవంలోకి వచ్చినప్పుడు అంతవరకూ మనమేం కోల్పోతున్నామో అర్థమై చెప్పలేనంత ఆశ్చర్యానికి లోనవుతాం. మన అమాయకత్వానికి, మూర్ఖత్వానికి మనల్ని మనమే నిందించుకుంటాం. కస్తూరి మృగం నాభిలోని కస్తూరిలా మనమూ మనలోనే నిక్షిప్తమై ఉన్న ఒకానొక అమృతమయ ఆత్మతృప్తిని గ్రహించలేకపోయినందుకు సిగ్గుపడతాం.



నిజానికి మనం ఇతరుల నుంచి ఏదైతే ఆశిస్తామో దాని అవసరం, విలువ మనకంటే బాగా ఎవరికీ అర్థం కాదు. మనం అంతే, అదే పరిమాణంలో ఇతరులకు అది అవసరమున్న విషయం చాలామందికి అర్థం కాదు.

తల్లి- బిడ్డలు తింటే తాను తిన్న దానికంటే ఎక్కువ తృప్తి పడుతుంది. బిడ్డ కాలిలో ముల్లు విరిగితే తన గుండెల్లో గునపం దిగినంతగా తల్లడిల్లుతుంది. అలాగే, ఏదైనా ఒకదానివెంట అన్ని వనరులూ కుదరాల్సిన పని లేదు. అన్ని పరిస్థితులూ అనుకూలించాల్సిన అవసరం లేదు. ప్రేమ ఉంటే ఎన్నో సానుకూలపడతాయి. మాతృహృదయం తల్లికే ఉండాలని నియమమేమీ లేదు. మనకైనా ఉండొచ్చు. ఎవరికైనా ఉండొచ్చు. అది పనో, బాధ్యతో, త్యాగమో కాదు. మన హృదయ నాభిలోని కస్తూరిని గుర్తించి ఆఘ్రాణించగలిగితే ఆ పరిమళాన్ని ముందు మనమే ఆస్వాదించవచ్చు. ఆనందించవచ్చు. మనలోని ఆ ప్రేమ కస్తూరి పరిమళం అనేది ఇతరులకూ పంచవచ్చు. మనకు ఆనందాన్ని కలిగించే విషయమే ప్రపంచానికి ఆనందాన్ని కలిగించే అవకాశం ఉందనుకున్నప్పుడు, ఇతరులకు ఆనందాన్ని కలిగించేలా మనకు దొరికిన అవకాశం మరింత ఆత్మతృప్తిని కలిగిస్తుంది. అంతకంటే అపురూపం, అద్భుతం మరేముంటుంది? స్వామికార్యం, స్వకార్యం ఒకే పనిలో ఇమిడి ఉన్నప్పుడు అంతకంటే అదృష్టం మరేముంది!

– చక్కిలం విజయలక్ష్మి

ఈనాడు లేఖలు

ఊరెళ్తున్నారా...

సంక్రాంతి రావడంతో హైదరాబాద్, ఇతర నగరాలు, పట్టణాల నుంచి ప్రజలు పల్లెలకు తరలి వెళ్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లను గుల్ల చేయడానికి దుండగులు కాచుకొని ఉంటారు. కాబట్టి, కుటుంబ సమేతంగా గ్రామాలకు వెళ్లాలనుకునే వారు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీసుల గస్తీ పెరగాలి. ప్రజలు సైతం సమన్వయంతో వ్యవహరించాలి. తమ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఎవరు తచ్చాడినా, వెంటనే గస్తీ పోలీసులకు సమాచారం అందజేయాలి. ఈ తరహా వ్యవస్థల ఏర్పాటుపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రసార సాధనాల్లో విరివిగా ప్రచారం చేయాలి.

- రుత్తుల ప్రవీణ్‌కుమార్, అమీర్‌పేట, హైదరాబాద్

ఈ ప్రమాదకర యాప్‌లు...



మీ ఫోన్‌లో లేవు కదా!

- ప్రయోజనకర సాఫ్ట్‌వేర్ల ముసుగులో కోట్లాది చరవాణులపై 'యాడ్‌వేర్' పంజా!
- ప్లే స్టోర్ నుంచి 85 అప్లికేషన్లను తొలగించిన గూగుల్

గేమ్స్‌.. టీవీ.. రిమోట్ కంట్రోల్.. ఆండ్రాయిడ్ ప్లే స్టోర్‌లో ఇలాంటి ఎన్నో అప్లికేషన్లు సరికొత్త ఫీచర్లతో మనల్ని కట్టిపడేస్తుంటాయి. వెంటనే డౌన్‌లోడ్ చేసుకుని, ఉల్లాసంగా వాటిని వాడేయాలనుకుంటాం. కానీ... జాగ్రత్త! ప్రయోజనకర యాప్స్ ముసుగులో ఇవి మీ ఫోన్లను తమ నియంత్రణలోకి తీసుకుంటున్నట్లు పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి 85 యాప్‌లను సాంకేతిక దిగ్గజం 'గూగుల్' తాజాగా ప్లే స్టోర్ నుంచి తొలగించింది.

వివిధ అప్లికేషన్లు లభ్యమయ్యే ఆండ్రాయిడ్ 'ప్లే స్టోర్'లో ప్రమాదకర యాప్‌లు ఉన్నట్లు ఇటీవల పలువురు సాంకేతిక పరిశోధకులు గుర్తించారు. 'ట్రెండ్ మైక్రో' బ్లాగ్ స్పాట్‌కు చెందిన నిపుణులు తొలుత ఈ విషయాన్ని బహిర్గతం చేయడంతో గూగుల్ సంస్థ ఉలిక్కిపడింది! ఇవన్నీ 'యాడ్‌వేర్' సాఫ్ట్‌వేర్లే కావడం గమనార్హం. గేమ్స్, టీవీ, రిమోట్ కంట్రోల్ తదితర ప్రయోజనకర అప్లికేషన్ల ముసుగు వేసుకునే ఈ యాప్‌లు.. డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత తమ అసలు నైజాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఒక్క చోట నుంచే వస్తున్నాయా?




పైకి ఒక్కోటి ఒక్కో ప్రయోజనార్థం రూపొందించినట్టు కనిపిస్తున్నా... వాటి లక్ష్యం మాత్రం ఒక్కటే! ఫోన్‌లపై పంజా విసిరి యాడ్స్‌ను గుప్పించడం. వీటిని వివిధ సంస్థలు అభివృద్ధి చేస్తున్నా... వాటి యంత్రస్థాయి సంకేతాలు (సోర్స్ కోడ్) మాత్రం ఒకేలా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇలాంటి 13 యాప్స్‌ను గూగుల్ గత నవంబరులో తొలగించింది. ఆ తర్వాత మరో 22 నకిలీ యాప్స్‌ను, తాజాగా ఇప్పుడు మరో 85 అప్లికేషన్లను తొలగించింది.

అసలు ఏం చేస్తాయివి?

ఈ యాప్‌లు ఫోన్లను తమ నియంత్రణలోకి తెచ్చుకుని.. తెర నిండుగా ప్రకటనలు చూపిస్తాయి. ఒకవేళ మీరు స్క్రీన్‌ను మూసివేసేందుకు ప్రయత్నించినా ఫలితం ఉండదు! మీరు తప్పకుండా ఆ ప్రకటనను ఆద్యంతం చూసి తీరాల్సిందే! పైగా ఒక పేజీని మూసివేసేందుకు ప్రయత్నిస్తే... మరికొన్ని పేజీలు తెరుచుకుంటాయి. పైగా వాటి నిండా ప్రకటనలే ఉంటాయి. చివరకు యాప్ స్తంభించిపోయే వరకూ ఇలా జరుగుతూనే ఉంటుంది. మరికొన్ని యాప్‌లైతే బఫర్ అవుతున్నట్టు చూపించి, ఆ తర్వాత మాయమైపోతుంటాయి. కానీ, ఇవి ఫోన్‌లో అంతర్గతంగా పని చేస్తూ... ప్రతి అరగంట లేదా గంటకు తెరపై కొన్ని సెకన్లపాటు కనిపిస్తాయి. అంతలోనే మళ్లీ కనుమరుగైపోతాయి. ప్లేస్టోర్ నుంచి ఇలాంటి యాప్స్ సుమారు కోటి సార్లు డౌన్‌లోడ్ అయినట్టు నిపుణులు గుర్తించారు. ఇలాంటివి మొత్తం 85 అప్లికేషన్లు ఉన్నాయనీ, వీటన్నింటిలోనూ 'ఈజీ యూనివర్సల్ టీవీ రిమోట్' అన్న యాప్‌ను సుమారు 5 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని వారు వెల్లడించారు. పోలీస్ ఛేజ్, రేసింగ్ కార్ త్రీడీ గేమ్స్, బస్ డ్రైవర్, ఏసీ రిమోట్, టీవీ వరల్డ్ తదితర యాప్‌లు కూడా లక్షల సంఖ్యలో డౌన్‌లోడ్ అయినట్టు తెలిపారు.

నిజమైన యాప్‌లను గుర్తించడమెలా?



గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్నంత మాత్రాన అన్ని యాప్‌లు అసలైనవని అనుకోవడానికి లేదు. యాంటీ వైరస్, గేమ్స్ పేరుతో ఉన్న మాల్‌వేర్, యాడ్‌వేర్ తదితర అప్లికేషన్లను ఆ సంస్థ ఎప్పటికప్పుడు తొలగిస్తూనే ఉంది. ఇంకా ఇలాంటివెన్నో ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంటున్నాయి. మరి నిజమైన యాప్‌లను గుర్తించడమెలా అంటే...

1. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే ముందు దాని తయారీ సంస్థ గురించి తెలుసుకోవాలి. ఆ సంస్థ తప్పకుండా తమ వెబ్‌సైట్ చిరునామా ఇస్తుంది.
2. దానిని అప్పటికే వినియోగించినవారి అభిప్రాయాలను తెలుసుకోవాలి.
3. చిన్నపాటి అక్షరాల మార్పుతో నకిలీ యాప్‌లు అందుబాటులో ఉన్నందున అప్లికేషన్ పేరును సరిచూసుకోవాలి.
4. యాప్ తేదీని పరిశీలించండి. 'అప్‌డేట్ ఆన్' అనే లేబుల్ తప్పకుండా ఉంటుంది. చాలా నకిలీ యాప్‌లలో ఇది కనిపించదు.
5. నిజమైన యాప్‌లు అడ్డగోలుగా షాపింగ్ డిస్కౌంట్‌లను ప్రకటించవు. ఒకవేళ అలా ప్రకటించదలిస్తే ముందుగానే తమ వెబ్‌సైట్లలో స్పష్టంగా వెల్లడిస్తాయి.
6. బ్రౌజర్ లేదా అధికారిక వెబ్‌సైట్‌లోని 'గెట్ అవర్ యాప్'పై క్లిక్ చేయడం ద్వారా నిజమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



రైతుకు రక్షణ కిట్టు అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు సీతామహాలక్ష్మి. పక్కన తానా అధ్యక్షుడు సతీష్ వేమన, రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు తదితరులు

అన్నదాతకు తానా అండదండ

అధ్యక్షుడు సతీష్ వేమన వెల్లడి

పుల్లడిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్నదాతలకు అన్ని వేళలా అండగా ఉంటామని తానా అధ్యక్షుడు సతీష్ వేమన ప్రకటించారు. మహారాష్ట్రలో గతేడాది పురుగుమందుల పిచికారీ సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై 300 మంది వరకు రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంటలో గురువారం తానా ఏర్పాటు చేసిన వ్యవసాయ వేదికలో సతీష్ వేమన మాట్లాడారు. ప్రవాసాంధ్రుడు ఉప్పుటూరి రామచౌదరి, ఆయన తల్లి, జడ్పీటీసీ సభ్యురాలు సీతామహాలక్ష్మి సూచన మేరకు గుంటూరు జిల్లాలో తానా ఆధ్వర్యంలో రైతు రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మేకా లక్ష్మీనారాయణ, గుంటూరు వైద్యుడు హరిప్రసాదరావు, తానా ప్రతినిధులు నవీన్ కొడాలి, రవి పొట్లూరి, సూరపనేని రాజా, భాను తదితరులు మాట్లాడారు.

సతీష్ వేమన ఆధ్వర్యంలోని ప్రవాసాంధ్రుల బృందం కొర్నెపాడులోని ప్రకృతి వ్యవసాయ శిక్షణ కేంద్రాన్ని గురువారం సందర్శించింది.

మూకాంబిక సన్నిధిలో ఏసుదాస్

ఉడుపి, న్యూస్‌టుడే: ప్రముఖ నేపథ్య గాయకుడు కె.జె.ఏసుదాస్ తన 79వ జన్మదిన వేడుకను గురువారం కర్ణాటకలోని కొల్లూరు మూకాంబిక అమ్మవారి సన్నిధిలో జరుపుకొన్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన ఆయన అమ్మవారి దర్శనంతోపాటు చండికా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన గానామృతంతో తాదాత్మ్యం చెందుతూ అమ్మవారిని ఆరాధించారు. ఏసుదాస్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో కేరళ నుంచి అభిమానులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టిన వెంటనే ఆయన అక్కడి అమ్మవారి పాదుకలకు నమస్కారం చేసి లోనికి ప్రవేశించారు. ఏసుదాస్ పాటల్ని వినేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



మూకాంబిక ఆలయంలో గానం ఆలపిస్తున్న కె.జె.ఏసుదాస్

ఆరోగ్యంపై అందరికీ అవగాహన

- ప్రభుత్వాసుపత్రుల్లో టీవీల ద్వారా ప్రసారాలు

ఈనాడు - గుంటూరు

అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న బాధితులు, వారికి తోడుగా వచ్చే సహాయకులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో హెల్త్ బులెటెన్లు ప్రసారం చేయటానికి ప్రభుత్వం పూజారి టీవీతో ఒప్పందం చేసుకుంది. విజయవాడ కేంద్రంగా పని చేసే ఈ సంస్థ ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకొచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో కేవలం హెల్త్ ఇన్ఫర్మేషన్ కార్యక్రమాలు మాత్రమే నిరంతరం ప్రసారం చేసేలా టీవీలు, ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేస్తోంది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో 24 టీవీలు బిగించారు. ఆసుపత్రుల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ టీవీలను ఏర్పాటు చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఒక స్టూడియోను కూడా ఏర్పాటు చేయనున్నారు. నిత్యం వైద్యులు వచ్చి ఆయా అంశాలపై ప్రసంగిస్తారు. ఆ ప్రసంగం రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో ఒకే సమయంలో వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన వైద్య బృందంతో ఆరోగ్య మెలకువలు చెప్పిస్తారు. వెన్నునొప్పితో బాధపడేవారికి ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది.. మోకీలు మార్పిడి ఆవశ్యకత, దారితీసిన కారణాలను సైతం చిత్ర సహితంగా చెబుతారు. వీటి నిర్వహణ బాధ్యతలు మొత్తం పూజారి టీవీ యాజమాన్యమే చూసుకుంటుంది. ఇవి ప్రసారం చేసినందుకు సంబంధిత యాజమాన్యానికి కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య ప్రాజెక్టులకు ఇచ్చే స్పాన్సర్‌షిప్ నుంచి చెల్లింపులు చేస్తుంది.



గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన టీవీలో ప్రసారమవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు

రామాయపట్నం ఓడరేవుతో 50 వేల మందికి ఉపాధి

సీఐఐ ఏపీ చాప్టర్ రుద్రరాజు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రకాశం జిల్లాలో రామాయపట్నం ఓడరేవుకు శంకుస్థాపన, కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు విమానాశ్రయం ప్రారంభోత్సవం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వరంగా మారుతుందని సీఐఐ చాప్టర్ రుద్రరాజు అన్నారు. రామాయపట్నం ఓడరేవు ఏర్పాటుతో చుట్టుపక్కల అనేక పరిశ్రమలు ఏర్పాటవుతాయన్నారు. దీంతో రాష్ట్రంలో దాదాపుగా 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఓర్వకల్లు విమానాశ్రయం దోహదపడుతుందన్నారు. ప్రత్యేకించి ఈ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంలో సాయపడుతుందన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

కోడి పందేల దాడుల్లో విషాదం

- ★ పరారవుతూ బావిలోకి పడిన జూదరులు
- ★ ఇద్దరు వ్యక్తుల గల్లంతు

చాట్రాయి, న్యూస్‌టుడే : పోలీసులు దాడులు చేసిన సమయంలో పరారవుతూ నేల బావిలో పడి ఇద్దరు వ్యక్తులు గల్లంతైన ఉదంతం కృష్ణా జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామం శివారు గొల్లగూడెంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గొల్లగూడెంలో కొన్ని రోజులుగా రాత్రి సమయాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో గురువారం అర్ధరాత్రి సమయంలో దాడులు చేశారు. సుమారు 20 మంది జూదరులు పరారవుతుండగా.. వీరిలో ఇద్దరు వ్యక్తులు నేల బావిలో పడి గల్లంతయ్యారు. వీరు చాట్రాయి మండలం చిత్తపూరు, విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన వారుగా భావిస్తున్నారు. అత్యవసర వాహన, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పాడుపడిన బావిలో నీరు ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. అర్ధరాత్రి దాటాక వెనుదిరిగారు. ఈ సమయంలో స్థానికంగా విషాదం నెలకొంది.

అన్ని పాఠశాలల్లో మహాత్ముని విగ్రహాలు

- మంత్రి గంటా వెల్లడి
- భీమిలి నియోజకవర్గానికి 212 గాంధీ విగ్రహాల పంపిణీ

విశాఖపట్నం(ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు మహాత్మాగాంధీ విగ్రహాలను మంత్రి గంటా శ్రీనివాసరావు అందజేశారు. గురువారం విశాఖ నగరంలోని వుడా బాలల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు మొత్తం 212 విగ్రహాలను మంత్రి పంపిణీచేశారు.

ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో కాకుండా ప్రయివేటు పాఠశాలలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వీటిని తయారుచేయించినట్లు వివరించారు. మహాత్ముని గొప్పతనం నిత్యం గుర్తుచేయడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పంపిణీ కోసం తీసుకొచ్చిన వందలాది మహాత్ముని విగ్రహాలతో వేదికకు ప్రత్యేక శోభ చేకూరింది. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ బసంత్‌కుమార్, ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు, జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, డీఈవో లింగేశ్వరరెడ్డి, ఎస్ఎస్ఏ పీవో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి గంటా, ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు. వేదికపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ బసంత్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు తదితరులు

బైపీసీ విద్యార్థులకు 'బ్రిడ్జి' నుంచి మినహాయింపు!

ఈనాడు - హైదరాబాద్: బైపీసీ విద్యార్థులు గణితం బ్రిడ్జి కోర్సు పూర్తిచేయకున్నా బీటెక్ బయోటెక్నాలజీ చదివే అవకాశాన్ని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) కల్పించింది. ఆ బీటెక్ కోర్సులో గణితం అవసరం కాబట్టి, కొంత పాఠ్యప్రణాళికను ఆయా విశ్వవిద్యాలయాలు చేర్చాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మార్పు చేసేందుకు అవి అంగీకరిస్తే, బీటెక్ బయోటెక్నాలజీలో ప్రవేశాలు కల్పించవచ్చని సూచించింది. ఆదర్శ పాఠ్యప్రణాళికను కూడా రూపొందించాలని నిర్ణయించింది. ఇది బైపీసీవారికి ఊరట కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇంటర్ బైపీసీ పూర్తిచేసినవారిలో కొందరు వైద్య విద్య, వెటర్నరీ, ఆయుష్, బీఎస్సీ అగ్రికల్చర్ వంటి కోర్సుల్లో ప్రవేశాలు దొరకకుంటే బీఫార్మసీలో చేరుతుంటారు. వారు బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు అవకాశం ఉన్నా, ఇంటర్‌లో ఉండగానే గణితంలో బ్రిడ్జి కోర్సు పూర్తిచేయాల్సి ఉంది. దీనిపై పలువురికి అవగాహన లేదు. అసలే బైపీసీ విద్యార్థులకు అవకాశాలు తక్కువ. అందులోనూ 'బ్రిడ్జి' నిబంధనతో వారు బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు వెనకడుగు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల ఏఐసీటీఈకి లేఖ రాయడంతో...ఐఐటీ దిల్లీ, జమ్ము విశ్వవిద్యాలయాల నిపుణులతో కమిటీని నియమించారు. ఆ నివేదిక మేరకు- బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు గణితం బ్రిడ్జి కోర్సు అవరోధమని భావిస్తే దాన్ని మినహాయిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. బీటెక్ బయోటెక్నాలజీ పాఠ్యప్రణాళికలో కనీస స్థాయిలో గణితం ఉండేలా చూడాలి. ఆ అంశాలను బోధించేందుకు అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుత నిర్ణయం వల్ల బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుకు కొంత డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. త్వరలో విడుదలయ్యే ఎంసెట్ నోటిఫికేషన్‌లో జేఎన్‌టీయూహెచ్ దీన్ని చేరుస్తుందా, లేదా అనేది చూడాలి.

రాయచోటి మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరెడ్డి మృతి



రాయచోటి, న్యూస్‌టుడే: కడప జిల్లా రాయచోటి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరెడ్డి గురువారం మృతి చెందారు. ఆయన నెలరోజులుగా మధుమేహంతో చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణరెడ్డి 1955 జులై 1న నియోజకవర్గంలోని చిన్నమండెం మండలం పడమటికోన బోరెడ్డిగారిపల్లెలో జన్మించారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన 1993లో రాయచోటిలో జరిగిన ఉప ఎన్నికల్లో, తర్వాత సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాయచోటి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా వ్యవహరించారు. ఇప్పటికీ కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన కీలక భూమిక పోషించారు. ఆయన మృతికి స్థానికులు, వివిధ పార్టీల జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. నారాయణరెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విజయవాడ న్యాయస్థానానికి జగన్‌పై దాడి కేసు రికార్డు

విజయవాడ, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌పై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన దాడి కేసుకు సంబంధించి రికార్డు విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్, ఎన్ఐఏ న్యాయస్థానానికి గురువారం చేరుకుంది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో విశాఖపట్నం న్యాయస్థానంలో ఉన్న రికార్డు అంతా విజయవాడ ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేయాలని ఆ కోర్టు కోరింది. ఇక నుంచి విచారణ విజయవాడ ఎన్ఐఏ న్యాయస్థానంలో కొనసాగనుంది.

హంపి సిగలో అరుదైన గౌరవం

తప్పనిసరి వీక్షణ జాబితాలో రెండో స్థానం దక్కించుకున్న పర్యాటక ప్రాంతం

ఎలక్ట్రానిక్ సిటీ(బెంగళూరు), న్యూస్‌టుడే: అలనాటి విజయనగర సామ్రాజ్యం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆరుబయలు పర్యాటక ప్రదేశంగా సందర్శకుల్ని అమితంగా ఆకట్టుకునే కర్ణాటకలోని హంపీ నగరానికి అరుదైన గౌరవం లభించింది. తప్పనిసరిగా చూడాల్సిన స్థలాల్లో ప్రపంచంలోనే రెండో స్థానాన్ని పొందింది. జీవిత కాలంలో తప్పనిసరిగా చూడాల్సిన స్థలాల జాబితాను 'ద న్యూయార్క్ టైమ్స్' పత్రిక తన తాజా సంచికలో ప్రకటించింది. ఇందులో వివిధ దేశాలకు చెందిన 52 పర్యాటక ప్రాంతాలు ఉండగా.. హంపీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. మన దేశం నుంచి హంపీ ఒక్కటే ఎంపిక కావడం మరో విశేషం. తుంగభద్ర తీరంలో దాదాపు 26 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన ఈ చారిత్రక ప్రదేశం నేటికీ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తోందని విశ్లేషకులు సైతం ప్రశంసలు కురిపించారు. 2016-17 సంవత్సరంలో సుమారు 5.35 లక్షల మంది హంపీని సందర్శించారు. వీరిలో 38 వేల మంది విదేశీ పర్యాటకులే ఉన్నారు.



హంపీలోని చారిత్రక విరూపాక్షేశ్వర ఆలయ వీధి

'క్రమబద్ధీకరణ' ఓటు బ్యాంక్ విధానమా!

- ఉల్లంఘనులకు అది సర్కారిచ్చే కానుకలా ఉంది
- అమలులో పేద, ధనిక వర్గాలకు తేడా కనిపించటం లేదు
- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణపై హైకోర్టు తీవ్ర ఆక్షేపణ
- అది చట్ట విరుద్ధమంటూ వ్యాఖ్య



ఈనాడు - అమరావతి

ప్రభుత్వ భూములను ఆక్రమించి అందులో జరిపిన నిర్మాణాల్ని క్రమబద్ధీకరించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. దాన్ని 'ఓటు బ్యాంక్ విధానం'గా అభివర్ణించింది. చట్ట ఉల్లంఘనులకు ఇలాంటి పథకాలతో సర్కారు బహుమానం ఇస్తోందని ఆక్షేపించింది. క్రమబద్ధీకరణ విషయంలో ఇదే చివరి పథకం అని ప్రభుత్వం చెబుతున్నా దాన్ని అంగీకరించలేమని తెలిపింది. ఈ విధానం చట్టవిరుద్ధమని అభిప్రాయపడింది. మొదట్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలు, గూడులేని వారి కోసమని చెబుతూ ప్రారంభించిన క్రమబద్ధీకరణ పథకానికి తర్వాత ధనిక, పేదల మధ్య వ్యత్యాసం లేకుండా పోయిందని తప్పుబట్టింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా రాజకీయ యంత్రాంగం నిర్ణయాలు తీసుకుంటుంటే శాశ్వత అధికార యంత్రాంగం తదనుగుణంగా వ్యవహరించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారికి నామమాత్రపు ధరతో క్రమబద్ధీకరించే అంశం హానికరమని మండిపడింది. హైదరాబాద్, విశాఖపట్నంలో 100 చ.గ. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారికి పేద, ధనిక తేడా లేకుండా క్రమబద్ధీకరిస్తున్నారని ప్రస్తావించింది. అక్రమార్కులకు రాజకీయ కారణాలతో రాయితీలు ఇచ్చి, చట్టాలను గౌరవిస్తూ బతికే ప్రజలను దోపిడీకి గురిచేయడం సరికాదని హితవు పలికింది. క్రమబద్ధీకరణ పథకాన్ని సవాలు చేస్తూ తమ ముందు ఈ వ్యాజ్యం దాఖలు కానందున ఆ పథకాన్ని చట్టవిరుద్ధమైనదిగా పేర్కొనడం లేదని తెలిపింది. తమ పరిశీలనను దృష్టిలో ఉంచుకొని క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నట్లు పేర్కొంది. ఓ మహిళకు చెందిన ఇంటిని క్రమబద్ధీకరించే విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు.

ఇదీ నేపథ్యం

విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం తగరపువలస గ్రామం బంగ్లామెట్ట వద్ద ఉన్న 193 చ.గ. ప్రభుత్వ భూమిలోని చిన్నా అనే మహిళకు చెందిన అక్రమ నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రామ్ సూరప్పడు 2016లో హైకోర్టును ఆశ్రయించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను అప్పట్లో హైకోర్టు ఆదేశించింది. విచారణ జరిపిన తహసీల్దార్ క్రమబద్ధీకరణ ఆలోచన ఆ మహిళకు లేకపోయినా.. అందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆమెకు సూచించారు. దీంతో ఆమె 2016 ఆగస్టు 9న మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అది పెండింగ్‌లో ఉండగా జీవీఎంసీ అధికారులు కూల్చివేతకు నోటీసులు జారీచేయడంతో విజయనగరం జిల్లా భోగాపురం మండలం చెరుకుపల్లి సర్పంచ్‌గా పనిచేస్తున్న చిన్నా హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు అక్రమ నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోలేదని రామ్ సూరప్పడు హైకోర్టులో కోర్టుధిక్కరణ వ్యాజ్యం వేశారు. 2018లో చిన్నా మరో వ్యాజ్యం దాఖలు చేస్తూ క్రమబద్ధీకరణ అభ్యర్థనపై నిర్ణయం తీసుకునేంత వరకు తనకు చెందిన నిర్మాణంలో అధికారుల జోక్యాన్ని నిలువరించాలని కోరారు. చిన్నా అభ్యర్థన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండగానే 2017, 2018లో ప్రభుత్వం క్రమబద్ధీకరణ విషయంలో జీవోలను జారీచేసింది. ఈ అంశాలన్నింటిపై న్యాయమూర్తి విచారణ జరిపారు.

వైద్య సేవల కొనసాగింపుపై సంప్రదింపులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిలిచిన వైద్య సేవలు కొనసాగించే విషయమై ఆషా ప్రతినిధులతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. వందల కోట్ల రూపాయల బకాయిలను సకాలంలో చెల్లించడంలేదని, 80వేలకుపైగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో పేర్కొన్న మొత్తంలో 70% వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా)కు చెందిన కొన్ని ఆస్పత్రుల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి నగదు రహిత వైద్య సేవలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో విడతల వారీగా నిధుల విడుదల మొదలైంది. ఇకపై ఆస్పత్రుల నుంచి వచ్చిన బిల్లుల్లో 50% వరకు అడ్వాన్సు రూపంలో చెల్లించేందుకు వీలుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఆస్పత్రుల నుంచి బిల్లులు అందిన 15రోజుల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవంక...గురువారం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఇంఛార్జి సీఈఓ డాక్టర్ సుబ్బారావు ఆషా ప్రతినిధులతో గుంటూరులో చర్చించారు. నిధుల విడుదలపై ప్రభుత్వ చర్యలను వివరిస్తూ.. సేవలను కొనసాగించాలని కోరారు. వైద్య శాఖ మంత్రి ఫరూక్‌తో సంప్రదించాక వైద్య సేవల కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని ఆషా ముఖ్య ప్రతినిధి ఒకరు తెలిపారు.

30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జనవరి 30 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశంలో ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అయిదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహిస్తారు.

డీఎస్సీ నమూనా పరీక్ష 13న: ఎస్టీయూ

ఈనాడు, అమరావతి: డీఎస్సీ ఎస్జీటీ నమూనా పరీక్షను ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, గాజుల నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ప్రతి డీఎస్సీ సమయంలోనూ నమూనా పరీక్షను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు.

ఆరు నెలల పసిపాపకు కాలేయ మార్పిడి

- తన లివర్‌లో భాగమిచ్చి పునర్జన్మ ప్రసాదించిన తల్లి
- విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన గ్లోబల్ ఆస్పత్రి వైద్యులు



చిన్నారి మైథిలిని ముద్దాడుతున్న తల్లి మమత

ఈనాడు, హైదరాబాద్: ఆడపిల్ల పుట్టగానే మహాలక్ష్మి అని మురిసిపోయారు ఆ దంపతులు. కానీ కొన్ని రోజులకే కాలేయ వ్యాధి ఆ చిన్నారిని కబళించింది. రెండో సంతానంగానూ ఆడపిల్ల పుట్టింది. తమను విడిచి వెళ్లిపోయిన పాపే మళ్లీ పుట్టిందని తల్లిదండ్రులు సంబరపడ్డారు. ఆ సంతోషం అంతలోనే ఆవిరైంది. మొదటి బిడ్డను కబళించిన అరుదైన కాలేయ వ్యాధే రెండో పాపకు కూడా ఉందని తెలియడంతో ఆ తల్లిదండ్రులు హతాశులయ్యారు. సనత్‌నగర్‌కు చెందిన మమత, నర్సింగరావు దంపతుల దీనగాథ ఇది. మేనరికపు వివాహమే వీరికి శాపంగా మారింది. తొలి బిడ్డను కాలేయ సంబంధిత వ్యాధి కబళించగా, రెండో పాప మైథిలికి కూడా అరుదైన 'మ్యాపిల్ సిరప్ యూరిన్ డిసీజ్' ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి వల్ల కాలేయంలో 'బీసీకేడీహెచ్‌బీ' అనే ఎంజైమ్ ఉత్పత్తి ఆగిపోతుంది. అమైనో ఆమ్లాలు జీర్ణం చేసే శక్తి క్రమేపీ కోల్పోవడంతో శరీరంలో విషతుల్యాలు పెరిగిపోతాయి. ఈ ప్రభావం మెదడు, కండరాలపై పడి ఫిట్స్ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయి. క్రమేపీ అన్ని అవయవాలు పనిచేయడం మానేసి మృత్యువు అంచుకు చేరుకుంటారు. పాపను బతికించుకోవాలంటే కాలేయ మార్పిడి ఒక్కటే శరణ్యం.

ఎంత కష్టం: కాలేయ మార్పిడికి రూ.లక్షలు ఖర్చవుతాయి. చిరువ్యాపారి నర్సింగరావు పొదుపు చేసిన మొత్తం చిన్నారి వైద్య పరీక్షలకే అయిపోయాయి. ఎలాగైనా పాపను బతికించుకోవాలని ఎంతోమంది దాతలను కలిసి కొంత మొత్తం సమకూర్చుకున్నారు. తల్లి కాలేయంలో కొంత భాగాన్ని సేకరించి, లక్డీకాపూల్‌లోని గ్లెనికల్స్ గ్లోబల్ ఆసుపత్రిలో గత నెల 14న విజయవంతంగా మైథిలికి కాలేయ మార్పిడి చేశారు. ఈ వివరాలను ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.రవీంద్రనాథ్, సీనియర్ లివర్ సర్జన్ డాక్టర్ బల్బీర్‌సింగ్, డాక్టర్ వేణుగోపాల్, పిడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం

భవానీపురం, న్యూస్‌టుడే: దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో సందర్శనీయ ప్రదేశాలు ఏపీలో ఉన్నాయని, ఆయా రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లుగా ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ సీఈవో హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. గురువారం విజయవాడలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. పెట్టుబడి పెట్టేందుకు వచ్చే వారికి తమ వంతు సహకారం అందిస్తామని, అవసరమైన భూమిని నిబంధనల ప్రకారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా ప్రకటించారు. కొన్నిసార్లు అతిథి గృహాల కొరత ఏర్పడుతోందని, ఔత్సాహికులు ముందుకు రావాలని కోరారు. అతిథ్య రంగంలో అందిస్తున్న సేవలను వివరించారు.

ఎ.వి. రాజమౌళికి కార్యదర్శి హోదా

ఈనాడు డిజిటల్, అమరావతి: ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ అధికారి ఎ. వి.రాజమౌళికి కార్యదర్శి హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ క్యాడర్‌కి చెందిన ఆయన గత మూడున్నరేళ్లుగా డిప్యుటేషన్‌పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు.

లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా ఎరిక్‌సన్ బాబు

రాష్ట్ర తోళ్ల పరిశ్రమ అభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్) ఛైర్మన్, డైరెక్టర్‌గా ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన ఎరిక్‌సన్ బాబును రెండేళ్ల పాటు నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీలో 39 సంకేతంతోనే వాహనాల రిజిస్ట్రేషన్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇక అన్ని జిల్లాల్లోనూ ఒకే సంకేతంతో వాహనాల రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇంతవరకు జిల్లాల వారీగా వేర్వేరు సంకేతాలు ఉండేవి. ఇకపై అన్ని జిల్లాల్లోను ఏపీ 39 సంకేతంతోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు కల్పిస్తూ రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తుది నోటిఫికేషన్ జారీ చేశారు.

- ఆర్టీసీ వాహనాలకు ఏపీ 39 జడ్, పోలీసు వాహనాలకు ఏపీ 39 పి తో సంకేతాలు ప్రారంభమవుతాయి.
- ఇతర రవాణా వాహనాలన్నీ టీ, యు, వి, డబ్ల్యు, ఎక్స్, వై అక్షరాలతో ప్రారంభం కానున్నాయి.

అసెంబ్లీ మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా అసెంబ్లీ మహిళా ఉద్యోగులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 30మంది ఉద్యోగినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శమంతకమణి ముగ్గులను పరిశీలించి మహిళలను అభినందించారు.

కడప ఉక్కుకు ఓబుళాపురం ఖనిజం

- ఇనుము నిల్వలను తేల్చనున్న జీఎస్ఐ
- మూడు బ్లాక్‌లలో అన్వేషణ
- అనుమతులకు అటవీశాఖ కసరత్తు



ఈనాడు, అనంతపురం: కడప జిల్లాలోని మైలవరం మండలంలో ఏర్పాటవుతున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుప ఖనిజాన్ని అనంతపురం జిల్లా సరిహద్దులోని కర్ణాటకకు ఆనుకొని ఉన్న ఓబుళాపురం ప్రాంతం నుంచి అందజేసేందుకు చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఓబుళాపురంలోని అటవీ ప్రాంతంలో అసలు ఎంత మేరకు ఇనుప ఖనిజ నిల్వలున్నాయనేది జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) అధికారులు తేల్చనున్నారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో అన్వేషణకు అనుమతులు తీసుకుంటున్నారు. ఉక్కు కర్మాగారానికి ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటకలోని బళ్లారి జిల్లా సరిహద్దులోని బళ్లారి రక్షిత అటవీ ప్రాంతం, ఓబుళాపురం, సిద్ధాపురం, మలపనగుడి, తుమటి, విఠలాపురం తదితర గ్రామాల పరిధిలో నాణ్యమైన ఇనుప ఖనిజ నిల్వలున్నాయి. గతంలో ఇక్కడినుంచే కొందరు లీజు తీసుకొని ఇనుప ఖనిజాన్ని తవ్వి తరలించారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలోని ఇనుప ఖనిజాన్ని కడప ఉక్కు కర్మాగారానికి ఉపయోగించాలని భావిస్తున్నారు. అనంతపురం జిల్లా పరిధిలోని డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామ పరిధిలోని రక్షిత అటవీ ప్రాంతంలోని ఇనుప ఖనిజ నిల్వలపై తొలుత అధ్యయనం చేయనున్నారు. ఇందుకోసం మూడు బ్లాకులను ఎంపిక చేసుకున్నారు. ఈ మూడూ కలిపి 350 హెక్టార్ల వరకున్నాయి. వీటిలో తొలి బ్లాక్ 42 హెక్టార్లు ఉండగా.. అందులో గతంలోనే లీజులు పొందిన మూడు ఇనుప ఖనిజ లీజులున్నాయి. వివాదాస్పదమైన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ)తోపాటు, బీఐఓపీ, వైఎంఆర్ అండ్ సన్స్ పేరిట లీజులున్న ప్రాంతం ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ లీజులన్నీ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాయి. వచ్చే ఏడాదితో వీటిలోని రెండు లీజుల గడువు ముగిసిపోనుంది. మొత్తం మూడు బ్లాకుల్లో ఇనుప ఖనిజ నిల్వలపై జీఎస్ఐ అధ్యయనం చేసేందుకు అటవీశాఖ అనుమతులివ్వాల్సి ఉంది. ఓ బ్లాకులో ఇప్పటికే పాత లీజులున్నందున అక్కడ అధ్యయనానికి అటవీశాఖతో పాటు, గనులశాఖ కూడా అనుమతించాల్సి ఉంది.

రంధ్రాలు వేసి అన్వేషణ..

మూడు బ్లాకుల్లో అనుమతులు వచ్చాక జీఎస్ఐ అధికారులు అధ్యయనం చేయనున్నారు. జీఎస్ఐ అధికారుల బృందం కొంతకాలం కిందటే డి.హీరేహాళ్ కేంద్రంగా శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వారు మూడు బ్లాకుల్లో 45 వరకు రంధ్రాలు చేసి ఎంత లోతు వరకు ఇనుప ఖనిజ నిల్వలున్నాయనేది అంచనా వేస్తారు.

డీపీఆర్ బాధ్యత సమర్థ ఏజెన్సీకి

ఈనాడు, అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీ బాధ్యతను సమర్థ ఏజెన్సీకి అప్పగించాలని పాలకమండలి(బోర్డు ఆఫ్ డైరెక్టర్స్) నిర్ణయించింది. పరిశ్రమ పాలకమండలి తొలి సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పెట్టుబడులను ఆహ్వానించేందుకు ప్రాజెక్టు నివేదిక అవసరమని ఈ సందర్భంగా బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు ఆహ్వానించి, డీపీఆర్ తయారీకి ఏజెన్సీలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే చైనాకు చెందిన తంగ్సాన్ గౌఫెంగ్ ఇనుము-ఉక్కు సంస్థ ఏపీలో ఉక్కు పరిశ్రమ పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ సంస్థకు చైనాలో ఉక్కు పరిశ్రమ ఉంది. ఇప్పటికే దీని ప్రతినిధులు డిసెంబరు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీఎండీసీ ఎండీలతో సమావేశమయ్యారు. చైనాలోని తమ పరిశ్రమను పరిశీలించేందుకు రావాలని ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో అధికారుల బృందం ఒకటి జనవరి చివరి వారంలో చైనాకు వెళ్లాలని నిర్ణయించింది. గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, శాఖ ముఖ్యకార్యదర్శి బి.శ్రీధర్, రాయలసీమ ఉక్కు సంస్థ సీఎండీ మధుసూదన్, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ వెంకయ్యచౌదరి ఈ బృందంలో ఉంటారు.

బ్రాహ్మణ యువతులకు కల్యాణమస్తు

- అర్చకులను పెళ్లి చేసుకుంటే

రూ.75 వేలు కానుక: ఆనంద్‌సూర్య

కృష్ణలంక, న్యూస్‌టుడే: బ్రాహ్మణుల్లో పౌరోహిత్యం, అర్చక వృత్తి చేస్తున్న యువకులకు వివాహంలో నెలకొంటున్న జాప్యాన్ని నివారించడం, బ్రాహ్మణ యువతులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి కానుకగా కల్యాణమస్తు పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ ఆనంద్ సూర్య తెలిపారు. గురువారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. పథకంలో భాగంగా పురోహితులను, అర్చకులను, వేదపండితులను బ్రాహ్మణ యువతులు వివాహం చేసుకుంటే వారికి ప్రభుత్వం రూ.75వేలు కానుకగా ఇస్తుందన్నారు. ఏప్రిల్ 1, 2018 అనంతరం వివాహం చేసుకున్న వారు ఈ పథకానికి అర్హులని, దీని కోసం ఈ నెల 15వ తేదీ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.


జగన్ సీఎం అయితే రాక్షస రాజ్యమే

ఏపీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి విమర్శ

విజయవాడ, న్యూస్‌టుడే: జగన్ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో రాక్షసరాజ్యం వస్తుందని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. గురువారం విజయవాడలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే టికెట్లను రూ.30కోట్లకు పైన, ఎంపీ సీట్లను రూ.100 కోట్లకు పైగా వేలంలో పెట్టి విక్రయిస్తున్నారని ఆరోపించారు. పొరపాటున సీఎం అయితే జగన్ అవినీతి అంగారక గ్రహంపైనా విస్తరిస్తుందని ఎద్దేవాచేశారు.

తెదేపాకు మద్దతు ఓ ప్రయోగం

- అందువల్లే జనసేన దూసుకుపోయింది
- కడప, గుంటూరు జిల్లాల కార్యకర్తల సమావేశంలో పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: "2014 ఎన్నికల్లో తెదేపాకు మద్దతిచ్చి ఒక సామాజిక ప్రయోగం చేశా. ఆ ప్రయోగం విజయవంతం కావడం వల్లే జనసేన బలంగా దూసుకుపోయింది. ఎదుటివారిని బలంగా ప్రశ్నించాలంటే నైతిక బలం కావాలి. అందుకే అప్పుడు తెదేపా, భాజపాలకు మద్దతు ఇచ్చి విజయం చేకూరేలా చేశా. అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి కావాలంటే కనీసం 30 ఏళ్లు పడుతుంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్నా, అమరావతి ముందుకు వెళ్లాలన్నా జనసేన పార్టీ అవసరం ఉంది" అని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. 2019 ఎన్నికల్లో అద్భుతాలు సాధిస్తామో లేదో తెలియదు కానీ, జనసేన బలంగా అయితే నిలబడుతుందని చెప్పారు. విజయవాడలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం కడప, గుంటూరు జిల్లాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై మాట్లాడారు.

తెదేపా నేతలను వ్యక్తిగతంగా విమర్శించలేదు

'తెదేపా నాయకులను నేనెప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించలేదు. జనసేన సిద్ధాంతాలకు అనుగుణంగా ఒక పరిధిలో మాత్రమే విమర్శలు చేశా. ప్రతిపక్ష నాయకుడిలా చంపేయండి, చింపేయండి అనలేదు. 2014లో జగన్ ముఖ్యమంత్రి అయిపోతున్నాడు.. ఏం చేయగలవంటూ అంతా నన్ను ప్రశ్నించారు. తాను ముఖ్యమంత్రి కావడానికి రాజకీయాల్లోకి రాలేదు. సగటు మనిషి ఏం కోరుకుంటున్నాడో అది ఇవ్వడానికే వచ్చానని వారితో చెప్పా. 2014లో పరిమిత స్థానాల్లో పోటీ చేయాలని తొలుత భావించా. అయితే, అలా చేస్తే పార్టీ బలపడదన్న ఉద్దేశంతోనే పోటీకి దూరంగా ఉండి ఆ పార్టీలకు మద్దతు పలికి విజయం చేకూరేలా చేశా. మోదీ ప్రధాని అయితే ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేస్తారనే గట్టి నమ్మకంతోనే మద్దతిచ్చా. చంద్రబాబు మరో పదేళ్లు అధికారంలో ఉండాలంటారు.. ప్రతిపక్ష నేత జగన్ 30 ఏళ్లు అధికారం కావాలంటారు. పదవి కాదు.. మూడు తరాలు బాగుండాలనే ఆకాంక్ష ముఖ్యమని' పవన్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా కమిటీల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోందన్నారు.

పవన్‌కల్యాణ్ ఈ నెల 13న భోగి రోజున సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారని పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని పెదరావూరులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో ఈ సంబరాలు జరగనున్నాయి.

అమరావతిలో సాంకేతిక వర్సిటీ

- దీని పరిధిలోకి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు
- నివేదిక రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: అమరావతిలో కొత్తగా ప్రభుత్వ సాంకేతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయబోతున్నారు. వర్సిటీ ఏర్పాటుకు సంబంధించి నివేదికను రూపొందించేందుకు ఉన్నత విద్యామండలి ఇటీవల ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆర్జీయూకేటీ ఉపకులపతి రామచంద్రరాజు, డైరెక్టర్ సుదర్శన్‌రావు, జేఎన్‌టీయూ కాకినాడ మాజీ రిజిస్ట్రార్ ప్రసాద్‌రాజు, నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్లు రంగయ్య, ఎం.వీ.ఎన్ శర్మ ఇందులో సభ్యులుగా ఉన్నారు. నూతన వర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన నివేదికపై ఈ కమిటీ కసరత్తు చేస్తోంది. శుక్ర లేదా శనివారం ఈ నివేదిక కొలిక్కిరానున్నట్లు సమాచారం. జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలను విడదీసి ఈ నూతన వర్సిటీ కిందకు తీసుకురానున్నారు. ఈ మూడు జిల్లాల్లోని ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎం.ఫార్మసీ కళాశాలలు కొత్త వర్సిటీకి అనుబంధంగా ఉండనున్నాయి. ప్రస్తుతం నెల్లూరు జిల్లా శ్రీవేంకటేశ్వర వర్సిటీ పరిధిలో ఉన్నందున రిజర్వేషన్ సమస్య వస్తుందనే ఉద్దేశంతో దీన్ని కొత్త వర్సిటీ పరిధిలోకి తీసుకురావాలా? వద్దా? అనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు.

భారం తగ్గించేందుకు..

జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 275 వరకు కళాశాలలున్నాయి. వీటిలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు 178 ఉండగా.. వీటిల్లో 88,177 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాకినాడ, నర్సరావుపేట, విజయనగరంలలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా.. వీటిల్లో 1,010 సీట్లు ఉన్నాయి. వర్సిటీకి అనుబంధ కళాశాలలు అధికంగా ఉండడంతో వీటి తనిఖీలు, పరిశీలనలు సమస్యగా మారుతున్నాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ కాకినాడపై భారం తగ్గించేందుకు కొత్తగా అమరావతిలో వర్సిటీని ప్రతిపాదించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో దాదాపు 140వరకు కళాశాలలు ఉన్నాయి.

ఏం పేరు పెట్టాలి?

కొత్త విశ్వవిద్యాలయానికి ఏ పేరు పెట్టాలనే దానిపైనా కమిటీ కసరత్తు చేస్తోంది. జేఎన్‌టీయూ అమరావతి, అమరావతి సాంకేతిక విశ్వవిద్యాలయం, గౌతమ బుద్ధ సాంకేతిక విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ సాంకేతిక విశ్వవిద్యాలయం తదితర పేర్లను పరిశీలిస్తోంది.

ఆర్టీసీకి కొత్తగా 84 ఏసీ బస్సులు

- వేసవి సీజన్ నేపథ్యంలో కొనుగోలు చేయనున్న సంస్థ

ఈనాడు డిజిటల్, అమరావతి: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్‌ఆర్టీసీ) కొత్తగా 84 ఏసీ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వీటిల్లో ఏసీ సీటర్ విభాగంలో 48 ఇంద్ర బస్సులు, 4 అమరావతి బస్సులు.. ఏసీ సీటర్+స్లీపర్ విభాగంలో నైట్ రైడర్ పేరుతో తిప్పేందుకు వీలుగా 12 బస్సులు, ఏసీ స్లీపర్ విభాగంలో 20 వెన్నెల బస్సులు ఉంటాయి. వెన్నెల బస్సుల్లో ఇప్పటికే 10 సంస్థ గూటికి చేరాయి. ఈ పది బస్సుల్లో విజయవాడ రీజియన్ పరిధిలోని విజయవాడ-హైదరాబాద్, విజయవాడ-చెన్నై, విజయవాడ-బెంగళూరు మార్గంలో రెండు చొప్పున ఆరింటిని నడపనున్నారు. విశాఖ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం-హైదరాబాద్ మార్గంలో రెండింటిని, తిరుపతి రీజియన్ పరిధిలోని తిరుపతి-హైదరాబాద్ మార్గంలో మరో రెండింటిని ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయనున్న ఏసీ స్లీపర్ బస్సులు 30 బెర్తులను కలిగి ఉంటాయి. 2+1 తరహాలో రూపొందించారు. వీటిల్లో ప్రయాణికుడి బెర్త్ పక్కనే లగేజీ క్యారియర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

అవినీతి చక్రవర్తి జగనే


- వైకాపా నుంచి తెదేపాలో చేరిన ఎమ్మెల్యేల బహిరంగ లేఖ

ఈనాడు, అమరావతి: 'మీరు అవినీతి చక్రవర్తి అనేది బహిరంగ రహస్యం. అభివృద్ధి చక్రవర్తి చంద్రబాబు నాయుడుపై బురదజల్లాలని ప్రయత్నిస్తే అది తిరిగి మీ ముఖంపైనే పడుతుంది' అని జగన్‌పై వైకాపా నుంచి తెదేపాలో చేరిన ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. కేసుల మాఫీ కోసం ప్రధాని మోదీకి జగన్ అమ్ముడుపోయారని, ఇప్పుడు కాంట్రాక్టుల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అమ్ముడుపోయారని, అమ్ముడుపోయే అలవాటు ఆయనకుందిగానీ, తమకు లేదని స్పష్టం చేశారు. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా-2018 నివేదిక ప్రకారం... అవినీతి తక్కువగా ఉన్న 3 రాష్ట్రాల్లో ఏపీ ఒకటిగా నిలిచింది. అలాంటి ప్రభుత్వాన్ని కూలదోస్తానన్న మీ దుర్మార్గ, దుష్ట రాజకీయాలను భరించలేక రాష్ట్రం, నియోజకవర్గాల అభివృద్ధి కోసం 23 మంది ఎమ్మెల్యేలం బయటికొచ్చాం. ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్లు కొన్నారని మీరంటున్నారు. కానీ మీవద్ద నుంచి బయటపడ్డ మేం.. ఆయన నుంచి విముక్తి పొందామని అనుకుంటున్నాం' అని జగన్‌పై ధ్వజమెత్తారు. వీరంతా (ఎమ్మెల్యేలు, మంత్రులు) గురువారం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. పలు ప్రశ్నలను సంధించారు.

- భూ ఆక్రమణ, రౌడీలతో వైకాపా కార్యాలయం నిండిపోయిందని మీ చిన్నాన్న వివేకానంద పేర్కొనడం నిజం కాదా?
- మీ సోదరి షర్మిలను ఇంటర్వ్యూ చేశారని సాక్షి ప్రతినిధిని ఉద్యోగం నుంచి మీరు తొలగించలేదా?
- వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం ఉందన్న బొత్స సత్యనారాయణను, ఓ బహిరంగ సభలో మీ అక్రమాస్తుల చిట్టాను విప్పిన ధర్మాన ప్రసాదరావును ఇప్పుడు అక్కున చేర్చుకున్న మీకు విలువలున్నాయా?
- నలుగురు కుటుంబ సభ్యులుండే మీకు బెంగళూరులో 30 ఎకరాల్లో భారీ కోట, పులివెందులలో ప్యాలెస్, హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో రాజమహల్ ఎక్కడ నుంచి వచ్చాయి? ఇప్పుడు అమరావతిలో ఐదెకరాల్లో భారీ నివాస భవనం నిర్మిస్తున్న మాట నిజం కాదా?
- వాహనాల్లేవంటూ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న మీకు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యంత ఖరీదైన బీఎండబ్ల్యు ఎక్స్ 5 కారు (09బీఎన్2345) లేదా?
- డబ్బుపై వ్యామోహం లేదంటున్నారు. మరి మీ అక్రమ సంపాదన రూ.43వేల కోట్లను ప్రజలకు పంచగలరా?
- పరిటాల రవీంద్ర హత్యకు కుట్ర చేసిన పులివెందుల కృష్ణ మీ ప్రధాన అనుచరుడు కాదా? ఈ కేసు నుంచి జగన్‌ను కాపాడటానికి 60 రోజులు కష్టపడ్డానని మీ కుటుంబానికి సన్నిహితుడు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొనడం నిజం కాదా?

ఆటో డ్రైవర్లందరూ యజమానులుగా ఎదగాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష



ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని ఆటో డ్రైవర్లందరూ ఆటో యజమానులుగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. విజయవాడ అర్బన్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రఘురామరాజు ఆధ్వర్యంలో 60 మంది ఆటో డ్రైవర్లు ఉండవల్లిలోని ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం కలిశారు. ఆటో రిక్షాలకు రహదారి పన్ను (రోడ్ ట్యాక్స్) రద్దు చేయాలని వినతిపత్రం అందించారు. గతంలో త్రైమాసిక పన్ను విధానాన్ని రద్దు చేసి ఎంతో మంది ఆటో రిక్షాల వారికి అండగా నిలిచిన విషయాన్ని ముఖ్యమంత్రికి గుర్తు చేశారు. నూతనంగా కొన్న ప్రయాణికుల ఆటోలకు పన్ను 2 శాతంగా ఉందన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు ఆటోలకు 1.5 శాతంగా, ఆరు నుంచి తొమ్మిదేళ్లలోపు ఆటోలకు 1.4 శాతంగా పన్ను విధిస్తున్న విషయాన్ని సీఎం దృష్టికి తెచ్చారు. ఈ కారణంగా ఒక్కో ఆటోకు సంవత్సరానికి రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు భారం పడుతోందని చెప్పారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. సమస్యను పరిశీలించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



విజయవాడలోని క్యాపిటల్ సినిమాస్‌లో.. యన్.టి.ఆర్–'కథానాయకుడు' సినిమాను వీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన బుద్ధా వెంకన్న, కొల్లు రవీంద్ర, క్రిష్, బాలకృష్ణ

బాలయ్యా.. మామయ్యను మరిపించావ్

పటమట (విజయవాడ), న్యూస్‌టుడే: రాజకీయాలు, సినిమాల్లో ఎన్టీఆర్‌కు ఎవరూ సాటి లేరు.. రాబోరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆ యుగపురుషుడి జీవితాన్ని సినిమాగా తీయడం నిజంగా సాహసమని తెలిపారు. విజయవాడలోని ట్రెండ్‌సెట్ మాల్‌లో 'ఎన్టీఆర్ కథానాయకుడు' సినిమాను సినీ హీరో బాలకృష్ణ, దర్శకుడు క్రిష్‌తో కలిసి గురువారం రాత్రి ముఖ్యమంత్రి వీక్షించారు. తొలుత సినిమా హాలు బయట ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సినిమా చూసిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కథానాయకుడు చిత్రంలో ఎన్టీఆర్ పాత్రను బాలకృష్ణ చేయగలరా? అని భయపడ్డానుగానీ, ఎన్టీఆర్ మళ్లీ వచ్చి చేశారా అనే విధంగా ఆయన నటించారని ప్రశంసించారు. తమ కుటుంబమే కాకుండా, తెలుగుజాతి గర్వించదగిన సినిమా అని కొనియాడారు. చిత్రంలో తన పాత్రనూ బాగా చూపించారని, వాస్తవికతకు దగ్గరగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

నారీ శక్తికి ప్రోత్సాహం

- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక సంస్థ
- నిధి సమకూరుస్తాం.. శిక్షణ, మార్కెటింగ్, రాయితీలందిస్తాం
- జన్మభూమి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- విశాఖలో ఎంఎస్‌ఎంఈ తొలిదశ, వీసీఐసీ కారిడార్‌కు రిమోట్ ద్వారా శంకుస్థాపన



'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా డిక్కీ ఉపాధ్యక్షురాలు రాజమణి. వేదికపై ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, సీఎం చంద్రబాబు, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి ఆరోఖ్యరాజ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే మహిళల కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దీనికి ప్రత్యేక నిధిని సమకూరుస్తామని హామీ ఇచ్చారు. సంస్థ ద్వారా వారికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్, రాయితీలు అందిస్తామన్నారు. జన్మభూమి- మా ఊరు 9వ రోజులో భాగంగా అమరావతి ప్రజా వేదికలో 'పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్నం జిల్లా యలమంచిలిలో జన్మభూమికి హాజరైన వారినుద్దేశించి ప్రసంగించారు. అక్కడ 40వేల మందికి ఉపాధి కల్పించే ఎంఎస్‌ఎంఈ తొలి దశ పార్కు, వీసీఐసీ కారిడార్ 7 నోడ్స్ పనుల శంకుస్థాపన శిలాఫలకాలను రిమోట్‌తో ఆవిష్కరించారు.

'నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న పరిశ్రమల పార్కుల్లో (ఎంఎస్‌ఎంఈ) ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్నీ సిద్ధంగా ఉంటాయి. మీరు చేయాల్సిందల్లా అవసరమైన యంత్రాలు తెచ్చి బిగించుకుని ఉత్పత్తి చేసుకోవడమే. అందరికీ ఉమ్మడిగా కలుషిత నీటి శుద్ధి ప్లాంట్లు, పర్యావరణం, పరీక్షా కేంద్రాలు మేమే అందుబాటులోకి తెస్తాం' అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. 'నన్ను సీఈవో అంటారు. అయితే నేను అందరి గురించి ఆలోచించే ముఖ్యమంత్రిని' అని స్పష్టం చేశారు. యువ పారిశ్రామికవేత్తల ప్రీనర్స్, ఎంఎస్‌ఎంఈ ఫెసిలిటేషన్ కేంద్రాల బ్రోచర్లను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో ప్లాట్లు పొందినవారికి భూ కేటాయింపు పత్రాలను అందజేశారు. పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి మాట్లాడారు.

ముఖ్యమంత్రే మాకు స్ఫూర్తి..
– మన్నం మాధవి, గుంటూరు



నేను కథలు, కవితలు రాసుకునే మహిళను. విభజన తర్వాత హైదరాబాద్ నుంచి గుంటూరుకొచ్చాం. మీరు తలచుకుంటే 10 బాలానగర్లు, 10 నోయిడాలు తయారు చేస్తారు. మీ స్ఫూర్తితోనే ఆర్గానిక్ పద్ధతిలో సబ్బుల తయారీ కిలో నుంచి ప్రారంభించి నెలకు రూ.5 లక్షల వ్యాపారం చేసే స్థాయికి ఎదిగా. వీటిని అమెజాన్‌లో అమ్ముదామంటే డ్రగ్ లైసెన్స్ అడుగుతున్నారు. లైసెన్సు ఇప్పిస్తే వ్యాపారం పెంచుకుంటా..

సీఎం: మీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు చెప్పా.

దళితులకు ఎన్నో రాయితీలు
– రాజమణి, డిక్కీ (దళిత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ), ఉపాధ్యక్షురాలు, కృష్ణా జిల్లా

దళితుల్లో వ్యాపారమంటే భయం. ముఖ్యమంత్రి విస్తట్లో అన్నీ వడ్డిస్తున్నా అందుకోలేకపోతున్నాం. వీటిపై గ్రామస్థాయి దాకా అవగాహన కల్పించాలి. అధికారుల సహకారంతోనే నేను పరిశ్రమ ప్రారంభించా. సొంతంగా బ్యాంకులకు వెళ్లి ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చి హామీలేని రుణం తీసుకుని పరిశ్రమ ప్రారంభించా. రాయితీలు వచ్చాయి. ఎంతో విజయవంతంగా నిర్వహిస్తున్నా.

పంచాయతీల ఆర్డర్లు రావడం లేదు..
– వీరలక్ష్మి, రంపచోడవరం

నేను సాంకేతికంగా ముందుకెళ్లి ఎల్ఈడీ దీపాల అసెంబ్లింగ్ పరిశ్రమ ఏర్పాటు చేశా. పెట్టుబడి సమస్యను మీ దృష్టికి తెచ్చిన వెంటనే స్టాండప్ ఇండియా కింద 10 రోజుల్లో రూ.50 లక్షలు మంజూరయ్యాయి. మూడేళ్లలో రూ.3 కోట్ల అమ్మకాలు చేసే స్థాయికి చేరా. అయితే ఈపీడీసీఎల్, పంచాయతీల ఆర్డర్లు రావడం లేదు.

సీఎం: మీరు తయారుచేసే వాటిని ప్రభుత్వ సరఫరాదారులు కొనుగోలు చేసేలా అధికారులు చూస్తారు. నాణ్యతలో ఏమైనా సందేహాలుంటే నైపుణ్య శిక్షణ ఇప్పిస్తారు.

మనం చెబితే దిల్లీ వినే రోజొస్తుంది

'విభజన హామీలను అమలు చేయాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరడమే తప్పయింది. నన్ను ఎక్కడ దొరికితే అక్కడ తొక్కేయాలని మోదీ చూస్తున్నారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. త్వరలోనే మనం చెబితే దిల్లీ వినే రోజులొస్తాయని స్పష్టం చేశారు. 'ఎన్నికలంటే తెదేపా కార్యకర్తల పనే అనే అభిప్రాయం సరికాదు. మాకు పనులు జరిగితే చాలు అనుకుంటే నష్టపోయేది మీరే. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల గురించి మీరంతా రహదారులపైకి వచ్చి మాట్లాడాలి' అని పారిశ్రామికవేత్తలకు సూచించారు. 'ఎక్కడకు వెళ్లినా మళ్లీ మీరే రావాలి అని నినాదాలు చేస్తున్నారు. దీన్నొక ఉద్యమంగా తయారు చేయాలి' అని యలమంచిలిలో కార్డులు ప్రదర్శిస్తున్న యువకులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

వైకాపాకు ఇవే ఆఖరి ఎన్నికలు

- దోచుకొనే ప్రణాళికతోనే పాదయాత్ర
- జగన్‌పై మంత్రులు, తెదేపా నేతల ధ్వజం

ఈనాడు, న్యూస్‌టుడే యంత్రాంగం: ప్రజాసంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా వైకాపా అధినేత జగన్ చేసిన ప్రసంగంపై రాష్ట్ర మంత్రులు, తెదేపా నేతలు మండిపడ్డారు. సభలో జగన్ మాట్లాడినవన్నీ అసత్యాలేనని విమర్శించారు. రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలో తెలుసుకునేందుకే పాదయాత్ర నిర్వహించారని ఆరోపించారు. అవినీతి కేసుల్లో ప్రధాన ముద్దాయిగా ఉన్న వైకాపా అధినేత రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయటం విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు.

గౌతు లచ్చన్న పేరు ప్రస్తావించకపోవడం విచారకరం

'జగన్ ఏడాది పాటు చేపట్టిన పాదయాత్ర ఉదయం, సాయంత్రం నడకలా సాగింది. యాత్ర ముగింపు సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో నిర్వహించిన సభ పేలవంగా సాగింది. ఈ సభలో సర్దార్ గౌతు లచ్చన్న పేరును ప్రస్తావించకపోవడం విచారకరం. సభలో జగన్ మాట్లాడినవన్నీ అసత్యాలే. రానున్న ఎన్నికల్లో వైకాపాకు ధరావతులు కూడా దక్కవు. ఇవే ఆ పార్టీకి ఆఖరి ఎన్నికలు. పాదయాత్ర ముగిసిన క్రమంలో కాశీ యాత్ర చేసుకోవడం మేలు'. *- మంత్రి దేవినేని ఉమా (విజయవాడలో)*

అది విహార యాత్ర..

'రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలో తెలుసుకునేందుకే జగన్ పాదయాత్ర నిర్వహించారు. అది పాదయాత్ర కాదు..విహార యాత్ర. సరాసరిన రోజుకు ఆయన నడిచింది కేవలం 8 కిలోమీటర్లే'.

- మంత్రి నక్కా ఆనందబాబు (సచివాలయంలో)

మోదీకి కీలుబొమ్మలా..

'పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న ప్రతిపక్ష నేత జగన్ అవినీతిపై మాట్లాడటం హస్యాస్పదం. ప్రధాని మోదీ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కేసుల మాఫీ కోసం జగన్ ఆయనకు కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష నేతకు సీఎం కుర్చీ మీద ఉన్న ఆరాటం ప్రజా ప్రయోజనాల మీద లేదు'. *- మంత్రి జవహర్ (అమరావతిలో)*

దూరదృష్టి లేదు

'వైకాపా అధినేత జగన్‌కు దూరదృష్టి, పట్టుదల లేవు. దూరదృష్టి ఉంటే పట్టిసీమను వద్దనేవాడు కాదు. చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకొనే రోజులు పోయాయి. సీఎం చంద్రబాబు కరవు జిల్లాకు జలకళ తీసుకొచ్చారు. తాడిపత్రి నియోజకవర్గానికి కూడా నాలుగు టీఎంసీల నీటిని ఇస్తానని మాటిచ్చారు'. *- ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి(అనంతపురం జిల్లా రాయలచెరువులో)*

కేసుల విచారణలో సీబీఐ విఫలం

'జగన్ కేసుల విచారణలో కీలకమైన సమాచారాన్ని సేకరించడంలో సీబీఐ విఫలమైంది. ఈ కేసుల్లో ప్రధానమైన మనీ లాండరింగ్‌ను విచారణ సంస్థ ఎందుకు పట్టించుకోవడం లేదు. విదేశాల్లో దాచిన సొమ్ము తాలూకా వివరాల సేకరణలో సాధించిన పురోగతిని రాష్ట్ర ప్రజలకు, న్యాయస్థానాలకు ఎందుకు తెలియజేయడం లేదు'.

- తెదేపా అధికార ప్రతినిధి వర్ల రామయ్య (విజయవాడలో)

బీసీల మధ్య చీలికకు జగన్ కుట్ర

'తెదేపాకు అండగా ఉంటున్న బీసీల మధ్య చీలిక తీసుకువచ్చేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో బీసీల సంక్షేమానికి రూ.40 వేల కోట్లు వెచ్చించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుది. బీసీలను అన్ని విధాలుగా అణచివేతకు గురిచేసిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బాటలోనే జగన్ పయనిస్తున్నారు'. *-రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ (అమరావతిలో)*


4 టీఎంసీల మళ్లింపు

- రాజోలిబండ పథకానికి ప్రభుత్వం సిద్ధం
- ప్రతిపాదనలను పంపిన జల వనరులశాఖ
- త్వరలో పాలనామోదం

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లాకు తాగు, సాగు నీరు అందించే రాజోలిబండ కాలువ మళ్లింపు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. తుంగభద్ర జలాలను మరింతగా వినియోగించుకునేందుకు వీలుగా కర్నూలు జిల్లా కోస్గి మండలం భాత్రబొమ్మలాపురం నుంచి కుడివైపు కాలువ మళ్లింపు పథకం చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు కర్నూలు జిల్లా జల వనరులశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఈ పథకంవల్ల కర్నూలు పశ్చిమ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు కొత్త ఆయకట్టుకు నీరందించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఖర్చు ఎక్కువ.. ప్రయోజనం తక్కువని గతంలో ఆర్థికశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేయగా ఆ మేరకు కొన్ని సవరణలూ చేయడం పూర్తయింది. త్వరగా పాలనామోదం ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిర్మాణం ఇలా..

- తుంగభద్రవద్ద భాత్రబొమ్మలాపురంవైపు ఉన్న ఆనకట్ట కుడివైపు నుంచి కర్నూలు జిల్లాలో ఒక కాలువను తవ్వుతారు.



తుంగభద్ర ఆర్డీఎస్ ఆనకట్ట (రాజోలిబండ కట్ట)

- ఆ తర్వాత 5 విభాగాలుగా పంపిణీ కాలువలను తవ్వుతారు.
- 4 చోట్ల నీటిని ఎత్తిపోయడంతో పాటు 4 జలాశయాలు నిర్మిస్తారు.

భూసేకరణకు రూ.262 కోట్లు

ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, జలాశయాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకే రూ.262 కోట్లు అవసరమవుతుందని అంచనా.

- ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీల కోసం కావాల్సిన భూమి: 4,030 ఎకరాలు
- జలాశయాలకు అవసరమైన భూమి: 2,290 ఎకరాలు
- ప్రధాన కాలువల మట్టి తవ్వకం వ్యయం: రూ.150 కోట్లు
- ఎత్తిపోతల పథకాల వ్యయం: రూ.425 కోట్లు

పనిచేసేదిలా...

1 తొలి రీచ్‌లో సున్నా నుంచి 5.540 కిలోమీటర్ల వరకు కాలువ తవ్వి 22 క్యూసెక్కుల నీటిని తీసుకెళ్తారు.
- ఒక ఎత్తిపోతల ఏర్పాటు చేసి అక్కడి నుంచి 60 రోజులు నీటిని ఎత్తి పోస్తారు.
- కోస్గివద్ద జలాశయం నిర్మిస్తారు. ఇందులో అర టీఎంసీ నీటిని నిల్వ చేస్తారు.

2 కోస్గి జలాశయం నుంచి 30.429 కిలోమీటర్ల వరకు కాలువ తవ్వుతారు.
- అక్కడ ఎత్తిపోతల నిర్మిస్తారు. 60 రోజుల్లో రోజుకు 1.81 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు.
- ఈ నీటిని పెద్దకడబూరు వద్ద జలాశయం నిర్మించి అందులోకి మళ్లిస్తారు. అర టీఎంసీ నీటిని ఇక్కడ నిల్వ చేస్తారు.

3 30.4వ కిలోమీటరు నుంచి 55.410 కిలోమీటరు వరకు కాలువ తవ్వి నీటిని తీసుకెళ్తారు.
- అక్కడ ఎత్తిపోతల ఏర్పాటు చేసి ఎమ్మిగనూరు మండలం కొటెకలవద్ద 1.50 టీఎంసీల నీటి నిల్వతో జలాశయం నిర్మిస్తారు.

4 55.410వ కిలోమీటరు నుంచి 86.150 కిలోమీటరు వరకు కాలువ తవ్వి అక్కడ మరో ఎత్తిపోతల నిర్మిస్తారు.
- ఆ నీటిని గోనెగండ్ల మండలం చిన్నమర్రివేడువద్ద 0.25 టీఎంసీల నీటి నిల్వతో నిర్మించే జలాశయంలోకి మళ్లిస్తారు.
- 86.150వ కిలోమీటరు నుంచి 160వ కిలోమీటరు వరకు ఈ నీటిని తీసుకువెళ్తారు.

పొత్తులపై 20 లోపు స్పష్టత

- రఘువీరారెడ్డి

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో ఇతర పార్టీలతో పొత్తులపై ఈ నెల 20వ తేదీ లోపు స్పష్టత వస్తుందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. ఎన్నికల సన్నద్ధత లక్ష్యంగా అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, కోశాధికారులు, రాష్ట్ర వ్యవహారాల బాధ్యులతో దిల్లీలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ వార్ రూం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగానే అభ్యర్థుల ఎంపికను చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు జరిగిన వార్‌రూం సమావేశంలో.. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు బరిలో దిగే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వెంటనే చేపట్టాలని, రాష్ట్రంలో పార్టీపరమైన అన్ని కమిటీలు వెంటనే వేయాలని ఏఐసీసీ కోర్ కమిటీ సభ్యులు ఏకే ఆంటోని, అహ్మద్ పటేల్, మల్లికార్జున ఖర్గే, జైరాం రమేశ్‌లు రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సూచించారు. ఏపీలో పొత్తుల అంశం త్వరగానే తేల్చేస్తామని చెప్పారు.

అశోక్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణ

- ఘనంగా వీడ్కోలు పలికిన సంఘ నేతలు

ఈనాడు, అమరావతి: ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు, వాణిజ్య పన్నులశాఖ విజయవాడ సంయుక్త కమిషనర్ కార్యాలయంలో ఏసీటీవోగా ఉన్న పి.అశోక్‌బాబు గురువారం స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం కమిషనర్ కార్యాలయంలో అశోక్‌బాబు డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అశోక్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకోవడంతో.. అన్ని నిబంధనలకు లోబడి ఆమోదించారని విజయవాడ వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ కిరణ్ వెల్లడించారు. గుణదలలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో అశోక్‌బాబుకు ఏపీఎన్జీవో నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు.

★ అశోక్‌బాబుపై శాఖాపరమైన విచారణలు కొనసాగుతుండగా క్లీన్‌చిట్ ఇచ్చి ఏ విధంగా పదవీవిరమణ ఇచ్చారో చెప్పాలంటూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు(ఏపీజీఈఏ) కె.ఆర్.సూర్యనారాయణ ప్రశ్నించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మిగతా ఉద్యోగులందరిపైనా పెండింగ్‌లో ఉన్న విచారణలన్నింటినీ ఇదేవిధంగా ఒకేసారి మూసేయాలని డిమాండ్ చేశారు.



అశోక్‌బాబుకు వీడ్కోలు పలుకుతున్న ఎన్‌జీవో నాయకులు

ఏపీ ఎన్జీవోల కొత్త నేతగా చంద్రశేఖరరెడ్డి!



అమరావతి, ప్రొద్దుటూరు, పుల్లంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఎన్జీవోల సంఘానికి నలమారు చంద్రశేఖరరెడ్డి నూతన అధ్యక్షుడు కాబోతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు అశోక్‌బాబు గురువారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసినందున ఆ స్థానం చంద్రశేఖరరెడ్డితో భర్తీ కానుంది. ఇటీవల జిల్లాల అధ్యక్షుల సమావేశంలో చంద్రశేఖరరెడ్డిని సంఘ అధ్యక్షునిగా చేయాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. వచ్చే ఆదివారం జరిగే కో-ఆప్షన్ సమావేశంలో అధికారికంగా ఆయన పేరును ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం చంద్రశేఖరరెడ్డి సంఘ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కడప జిల్లా పుల్లంపేట మండలం కేతరాజుపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి 1985లో సీనియర్ అసిస్టెంట్‌గా జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో చేరారు. 2000లో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. అనంతరం పరిపాలన అధికారిగా పదోన్నతి లభించినా గెజిటెడ్ హోదాతో ఎన్జీవో సంఘాన్ని వీడే పరిస్థితి వస్తుందని అందుకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం అమరావతిలోని జైళ్లశాఖ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఐదున్నరేళ్లుగా ఏపీ ఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు.

నేటి నుంచి విజయవాడ, కాకినాడలో ఆహారోత్సవాలు

ఈనాడు, అమరావతి: తెలుగువారి ప్రత్యేక వంటకాలను పర్యాటకులకు రుచి చూపించేందుకు శుక్రవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో, కాకినాడలోని మహేంద్రా మిఠాయి వాలాలో ఆంధ్రా వంటకాల ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హిమాన్షు శుక్లా గురువారం ప్రకటించారు. తిరుపతిలోని హోటల్ మానస సరోవర్‌లో శనివారం ఈ ఆహారోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. విజయవాడలో శుక్రవారం నుంచి ఈ నెల 24వరకు కొనసాగనుండగా, తిరుపతి, కాకినాడలో వారం రోజులపాటు మాత్రమే ఉత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు.

సెన్సెక్స్ ▼106　36106

నిఫ్టీ ▼34　10822

డోజోన్స్ 23974 ▲95

నాస్‌డాక్ 6977 ▲20

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 70.41 ▲ 05 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 61.31 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)

నిఫ్టీ	10న	మార్పు%
TATA MOTORS	185.75	1.48
TITAN COMPANY	966.70	1.44
EICHER MOTORS	20556.10	1.31
UPL	773.10	1.09
NTPC	148.10	1.06
BAJAJ AUTO	2725.30	1.05
M&M	733.20	0.95

గ్రహణం (-)

నిఫ్టీ	10న	మార్పు%
HPC	232.90	-2.55
INDUSIND BANK	1565.90	-2.24
BHARTI INFRATEL	285.05	-1.83
GRASIM INDUST	820.20	-1.81
IOCL	129.90	-1.59
KOTAK MAHI BANK	1219.55	-1.51
ONGC	143.25	-1.41


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)




కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.11	74.34	బ్రహ్రెయిన్ దీనార్	173.54	198.55
పౌండ్ స్టెర్లింగ్	81.80	94.88	కువైట్ దీనార్	192.28	239.43
యూరో	73.91	85.72	ఒమన్ రియాల్	169.81	194.52
జపనీస్ యెన్/100	59.19	68.64	సౌదీ రియాల్	17.04	20.20
ఆస్ట్రేలియా డాలరు	46.00	53.23	యూఏఈ దిర్హమ్	17.44	20.39
సింగపూర్ డాలరు	47.35	56.10	మలేషియా రింగిట్	15.26	18.76
థాయ్ బాత్/100	200.62	239.94	చైనీస్ యువాన్	7.31	11.88

గురువారం నిఫ్టీ కదలికలు



ఫలితాల ముందు అప్రమత్తత

- స్వల్ప శ్రేణికి సూచీలు పరిమితం
- డీలాపడిన బ్యాంకింగ్ షేర్లు



సమీక్ష

నాలుగు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి పెద్ద కంపెనీల త్రైమాసిక ఫలితాల వెలువడ నుండటంతో మదుపర్లు అప్రమత్తత పాటించడంతో మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, రూపాయి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి ఇంట్రాడేలో 20 పైసలు తగ్గి 70.66 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 5 పైసలు పెరిగి 70.41 వద్ద ముగిసింది. అమెరికా- చైనా చర్చల అనిశ్చితి, బ్యారెల్ చమురు ధర 60 డాలర్లను దాటడం నష్టాలకు తోడయ్యాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా షేర్లు నీరసంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,258 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. మదుపర్ల అప్రమత్తతతో స్వల్ప శ్రేణిలోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 36,269.31 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 36,070.76 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 106.41 పాయింట్ల నష్టంతో 36,106.50 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 33.55 పాయింట్లు కోల్పోయి 10,821.60 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,801.80- 10,859.35 పాయింట్ల మధ్య కదలాడింది.

- అంతర్జాతీయ ముడిచమురు ధరలు 60 డాలర్ల స్థాయిని అధిగమించడంతో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్, అప్‌స్ట్రీమ్ కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. హెచ్‌పీసీఎల్ 2.38%, బీపీసీఎల్ 1.60%, ఐఓసీ 1.59%, ఓఎన్‌జీసీ 1.37%, ఆయిల్ ఇండియా 1.05% చొప్పున నష్టాలు నమోదు చేశాయి.
- ఆడిటర్ల రాజీనామా వ్యవహారంలో ఎటువంటి అవకతవకలు లేవని కార్పొరేట్ వ్యవహారాల శాఖ ప్రకటించడంతో వక్రంజీ షేర్లు 4.99 శాతం లాభంతో రూ.37.90 దగ్గర స్థిరపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 నష్టాలు చవిచూశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.15%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.42%, ఓఎన్‌జీసీ 1.37%, మారుతీ సుజుకీ 1.07%, యాక్సిస్ బ్యాంక్ 1.05%, సన్‌ఫార్మా 0.79%, హెచ్‌డీఎఫ్‌సీ 0.72% చొప్పున డీలాపడ్డాయి. టాటా మోటార్స్ 1.34%, ఎన్‌టీపీసీ 1.09%, ఎం అండ్ ఎం 0.99%, బజాజ్ ఆటో 0.86%, భారతీ ఎయిర్‌టెల్ 0.63%లు రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకింగ్, చమురు- గ్యాస్, పీఎస్‌యూ షేర్లు 1 శాతం వరకు పడ్డాయి. మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు, వాహన, ఐటీ స్క్రిప్‌లు మాత్రం రాణించాయి. బీఎస్‌ఈలో 1390 షేర్లు ప్రతికూలంగా, 1215 స్క్రిప్‌లు సానుకూలంగాను ముగిశాయి. 149 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

బంధన్ బ్యాంక్ లాభానికి ఐఎల్ & ఎఫ్ఎస్ సెగ

- అక్టోబరు- డిసెంబరులో పెరిగింది 10 శాతమే

ముంబయి

అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి బంధన్ బ్యాంక్ రూ.331.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2017లో ఇదే కాలంలో ఆర్జించిన రూ.300.04 కోట్లతో పోలిస్తే లాభం 10.3 శాతం పెరిగింది. ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ గ్రూపునకు ఇచ్చిన రుణాల నిమిత్తం రూ.385 కోట్ల వరకు కేటాయింపులు చేయాల్సి రావడం లాభంలో వృద్ధిని పరిమితం చేసింది. అయితే ఆ సంస్థకు ఎంత మేర రుణాలిచ్చిందో వెల్లడించనప్పటికీ.. ఈ రుణాన్ని నిరర్థక ఆస్తుల్లో చేర్చినట్లు బంధన్ బ్యాంక్ ఎండీ, సీఈఓ సి.ఎస్.ఘోష్ తెలిపారు. ఈ ప్రభావంతో స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.67 శాతం నుంచి 2.4 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.7 శాతం నుంచి 0.8 శాతానికి చేరిందని అన్నారు. సమీక్ష త్రైమాసికంలో బంధన్ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.1,833.65 కోట్లుగా నమోదైంది. 2017 అక్టోబరు- డిసెంబరులో నమోదైన రూ.1,336.42 కోట్లతో పోలిస్తే పెరిగింది. మరోవైపు నికర వడ్డీ ఆదాయం గణనీయ స్థాయిలో 53.5 శాతం పెరిగి రూ.1,124 కోట్లకు చేరింది. రూ.2 ముఖ విలువ గల గృహ్ ఫైనాన్స్ 1000 షేర్లకు రూ.10 ముఖ విలువ గల 568 బంధన్ బ్యాంక్ షేర్లను ఇచ్చేందుకు ఇరు సంస్థల బోర్డులు అంగీకరించాయి.



బీఎస్‌ఈలో గురువారం బంధన్ బ్యాంక్ షేరు 3.82% పెరిగి రూ.471.70 వద్ద ముగిసింది.

10 గ్రాముల మేలిమి బంగారం రూ. 33,000 పైనే

- రూ.40,000 దాటిన కిలో వెండి



దిల్లీ: బంగారం ధర అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. గత 3 రోజుల్లో 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర రూ.300 మేర పెరగ్గా, బులియన్ విపణిలో వరుసగా నాలుగో రోజూ రూ.270 అధికమై రూ.33,070కి చేరింది. ఇదే విధంగా కిలో వెండి ధర కూడా రూ.410 పెరిగి రూ.40,510కి చేరింది. అమెరికా డాలర్ విలువ రూ.70.41కి పెరగడం, అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 1289 డాలర్లు అధిగమించడం వల్ల దేశీయంగా కూడా ధర పెరిగింది. పండుగలకు తోడు వచ్చే నెలలో వివాహాది శుభకార్యాలుండటం వల్ల దేశీయంగా ఆభరణాల తయారీదార్లు కూడా బంగారాన్ని కొంటున్నందున, గిరాకీ హెచ్చుతోందని చెబుతున్నారు. ఆభరణాల బంగారం సెవరు (8 గ్రాములు) ధర రూ.100 అధికమై రూ.25,300కు చేరింది.

హైదరాబాద్ విపణిలో: హైదరాబాద్ బులియన్ విపణిలో కూడా మేలిమి బంగారం 10 గ్రాముల ధర గురువారం రాత్రి రూ.33,080కి చేరింది. ఇదేవిధంగా కిలో వెండి కూడా రూ.40,200గా ఉంది. రాత్రి 11 గంటల సమయానికి అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 1,289 డాలర్ల వద్దే ఉంది. డిసెంబరు 14న 1,240 డాలర్ల దిగువన ఉన్న బంగారం అప్పటినుంచి క్రమంగా పెరుగుతూ వస్తోంది. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తతలు సర్దుమణిగి, డాలర్‌కు గిరాకీ పెరిగితేనే పసిడి ధర మళ్లీ దిగి వస్తుందని చెబుతున్నారు.

రాంఇన్ఫోకు టెలీమెడిసిన్ ప్రాజెక్టు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో టెలీమెడిసిన్ సేవల కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రాజెక్టు పనులు రాంఇన్ఫోతోపాటు మరో రెండు ఇతర సంస్థలకు దక్కాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తక్షణ వైద్య సహాయం కోసం ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఏపీలోని పలు జిల్లాల్లో ఉప కేంద్రాలను ప్రామాణీకరణ చేసేందుకు ప్రభుత్వం రూ.400 కోట్లను ఖర్చు చేయనుంది. ఇందులో భాగంగా ఈ కేంద్రాలను సాంకేతికంగా బలోపేతం చేసే పనులను రాంఇన్ఫోతో పాటు మరో రెండు సంస్థలకు అప్పగించింది. ఈ ఒప్పందం వ్యవధి ఐదేళ్లు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దేశంలో వేగంగా విస్తరిస్తున్న టెలీమెడిసిన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి వీడియో కాన్ఫరెన్స్, టెలీకమ్యూనికేషన్ సహాయంతో అవసరమైన వైద్య సూచనలు అందించేందుకు వీలవుతుంది. ఆరోగ్య సంరక్షణ రంగంలో విస్తరించేందుకు కంపెనీ అడుగులు వేస్తోందని, ఈ ప్రాజెక్టు పనులు రావడం సంస్థకు సానుకూల పరిణామమని రాంఇన్ఫో మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.శ్రీనాథ్ రెడ్డి అన్నారు.

10న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	453	వరంగల్	455
చిల్లరగా (ఒక గుడ్డు)	5.15	విశాఖపట్నం	458
బెంగళూరు	455	చెన్నై	460
11వ తేదీకి		చిత్తూరు	453
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	445

డిసెంబరులో నియామకాలు పెరిగాయ్

- నౌకరీజాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక



ముంబయి: గతేడాది డిసెంబరులో నియామకాలు పెరిగాయని నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ వెల్లడించింది. 2017 డిసెంబరుతో పోలిస్తే గతేడాది డిసెంబరులో ఇవి 8 శాతం మేర రాణించాయని చెబుతోంది. ముఖ్యంగా వాహన, వాహన విడిభాగాల పరిశ్రమ 24%; మానవ వనరుల విభాగం 17% చొప్పున నియమాకాల్లో వృద్ధిని నమోదు చేశాయని వివరించింది. ఐటీ-సాఫ్ట్‌వేర్ రంగంలో నియామకాలు 14% పెరిగినట్లు తెలిపింది. బెంగళూరు, దిల్లీలలో వరుసగా 13%, 10% మేర నియామకాలు మెరుగయ్యాయని వెల్లడించింది.

'గతేడాది చాలా వరకు ప్రధాన నగరాల్లో, అగ్రగామి రంగాల్లో నియామాకాల వృద్ధి బాగుంది. గత కొద్ది నెలలుగా ఐటీ, వాహన, వాహన విడిభాగాల రంగాల్లో నియమాకాలు మెరుగ్గా ఉంటున్నాయి. బీపీఓ, ఎఫ్ఎమ్‌సీజీలకు ఇది మంచి ఏడాది. ఈ నియామకాల ధోరణి కొనసాగుతుందనే భావిస్తున్నామ'ని నివేదిక విడుదల సందర్భంగా ఇన్ఫోఎడ్జ్ ఇండియా సీఎమ్ఓ సుమీత్ సింగ్ పేర్కొన్నారు. ఈ నివేదికలోని ముఖ్యాంశాలు..

- పారిశ్రామిక వృద్ధి 22% నమోదు కావడంతో చెన్నైలో నియామకాలు 9% పెరిగాయి.
- ముంబయిలోనూ 9% మేర వృద్ధి కనిపించింది. ముఖ్యంగా ఇక్కడి ఎఫ్ఎమ్‌సీజీ రంగ నియామకాలు 12% పెరిగాయి.
- బెంగళూరులో నియామకాలు 13% హెచ్చాయి. ఇక్కడి ఐటీ-హార్డ్‌వేర్(18%), ఐటీ సాఫ్ట్‌వేర్(22%)లు ఈ విషయంలో ముందున్నాయి.
- పుణె నియామకాల్లో వృద్ధి 15 శాతంగా కనిపించగా.. అక్కడి ఐటీ పరిశ్రమ 20% మేర ఉద్యోగులను పెంచుకుంది.
- మూడేళ్ల వరకు అనుభవం ఉన్న ఉద్యోగుల నియామకాలు 9% పెరగ్గా.. మధ్య స్థాయి యాజమాన్య బాధ్యతల (8-12 ఏళ్లు) కోసం 7%, సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయి(13-16 ఏళ్ల అనుభవం)లో 2% చొప్పున వృద్ధి నమోదైంది.

జేఎల్ఆర్‌లో 4,500 ఉద్యోగాల కోత!

దిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) ప్రపంచవ్యాప్తంగా 4,500 ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. చైనాలో అమ్మకాలు తగ్గడం, ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ వైదొలగడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో కంపెనీ ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. 'దీర్ఘకాలిక వృద్ధి నమోదు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నాం. పలు దేశాల్లో రాజకీయ, నియంత్రణ అవరోధాలతో పాటు వాహన పరిశ్రమ ఎదుర్కొంటున్న సాంకేతిక సవాళ్లు ఎదురయ్యాయి.' అని జేఎల్ఆర్ సీఈఓ రాల్ఫ్ స్పెత్ పేర్కొన్నారు.

అంతర్జాతీయ అమ్మకాలు తగ్గాయ్: గతేడాదిలో జేఎల్ఆర్ అంతర్జాతీయ అమ్మకాలు 4.6 శాతం తగ్గి 5,92,708 యూనిట్లుగా నమోదయ్యాయి. 2017తో పోలిస్తే జాగ్వార్ బ్రాండ్ అమ్మకాలు 1.2 శాతం పెరిగి 1,80,833కు చేరాయి. ఇక ల్యాండ్ రోవర్ అమ్మకాలు మాత్రం 6.9 శాతం తగ్గి 4,11,875 కార్లుగా నమోదయ్యాయని కంపెనీ వెల్లడించింది.

మరింత సులువుగా వ్యాపార నిర్వహణకు అనువుగా మళ్లీ ఆర్డినెన్స్

దిల్లీ: వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం, ఆదేశాలకు అనుగుణంగా నడవని సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేలా జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు ఎక్కువ అధికారాలు సమకూర్చేలా మళ్లీ ఆర్డినెన్స్ జారీ చేయాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. గతంలో ఆర్డినెన్స్ జారీ చేయగా, దాని స్థానంలో ప్రవేశపెట్టిన బిల్లును శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదించింది. అయితే రాజ్యసభలో మాత్రం ఆమోదం పొందలేదు. ఇప్పుడు అందుకు అవకాశం లేనందున, మళ్లీ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించారు.

వచ్చే నెల 25 - 27 మధ్య హైదరాబాద్‌లో బయోఏషియా

- ఈసారి అంకుర సంస్థలకు పెద్దపీట

ఈనాడు, హైదరాబాద్: జీవశాస్త్రాల రంగంలోని సంస్థలకు వేదికగా నిలిచే 'బయోఏషియా' వచ్చే నెల 25 నుంచి 27వ తేదీ వరకూ హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సదస్సులో ఫార్మా, బయోటెక్, లైఫ్‌సైన్సెస్, వైద్య రంగంలోని స్టార్టప్ సంస్థలకు పెద్దపీట వేయనున్నారు. తమ ఆవిష్కరణలను, వినూత్నమైన సేవలను స్టార్టప్ సంస్థలు ప్రదర్శించవచ్చని బయోఏషియా నిర్వాహకులు తెలిపారు. వైద్యసేవల రంగంలో పెట్టుబడులు పెడుతున్న క్రిస్ గోపాలకృష్ణన్ (ఆగ్జిలార్), సంజీవ్ కౌల్ (క్రిస్ కేపిటల్), అతిన్ శర్మ (రౌండ్ గ్లాస్ పార్టనర్స్), సందీప్ రూపెర్ల (అబ్రాజ్) వంటి ప్రముఖులు సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉంది. వోమ్నివోర్, 3వన్4 కేపిటల్, కే కేపిటల్, కాలారి, పట్ని ఫ్యామిలీ ఆఫీస్, ఐవీ క్యాప్ వెంచర్స్‌ల ప్రతినిధులు విచ్చేస్తున్నట్లు వివరించారు. స్టార్టప్ సంస్థలతో కేంద్ర ప్రభుత్వ బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శి రేణు స్వరూప్ ప్రత్యేకంగా సమావేశమవుతారు. స్టార్టప్ సంస్థలతో పాటు వెంచర్ కేపిటల్ (వీసీ), ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు, ఫార్మా, బయోటెక్ కంపెనీలు పాల్గొంటాయని బయోఏషియా సీఈఓ శక్తి నాగప్పన్ అన్నారు.

ఈస్టోనియాలో 'ఇ-రెసిడెన్సీ' ఉంటే..

- ఐరోపా అంతా వ్యాపార కార్యకలాపాలు



రిహో క్రూవ్

ఈనాడు, హైదరాబాద్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు ఐరోపా మార్కెట్లోకి విస్తరించేందుకు వీలుకల్పించే ఈస్టోనియా 'ఇ-రెసిడెన్సీ' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆ దేశ రాయబారి రిహో క్రూవ్ కోరారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో 'ఇ-రెసిడెన్సీ' ప్రత్యేకతలను వివరించారు. ఐరోపాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్వర్గధామంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఎంపిక చేసిన దేశమైన ఈస్టోనియా నాలుగేళ్ల క్రితం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రపంచ వ్యాప్తంగా దీన్ని ప్రారంభించిన మొదటి దేశం కూడా ఇదే. దీని ప్రకారం మనదేశంతో సహా ఏదేశం నుంచి అయినా ఈస్టోనియాలో డిజిటల్ పద్ధతిలో కంపెనీ ప్రారంభించవచ్చు. ఇందుకు 100 యూరోలు చెల్లిస్తే సరిపోతుంది. ఈస్టోనియాలో కంపెనీ ఉంటే, దాని ద్వారా ఐరోపా యూనియన్ (ఈయూ) దేశాల్లో ఎటువంటి అవరోధాలు లేకుండా వ్యాపార కార్యకలాపాలు సాగించే అవకాశం కలుగుతుంది. మనదేశం నుంచి ఇప్పటికే 2,174 మంది ఇ-రెసిడెంట్లు 275 కంపెనీలు ప్రారంభించారని ఈస్టోనియా రాయబారి రిహో క్రూవ్ వెల్లడించారు. లై-ఫై టెక్నాలజీ మీద పెట్టుబడులు పెట్టిన దీపక్ సోలంకి ఇందులో ఉన్నారు. ఈ పద్ధతిలో దీపక్ సోలంకి ప్రారంభించిన ఈస్టోనియా కంపెనీ లై-ఫై సేవలు విస్తరించేందుకు బోయింగ్, ఎయిర్‌బస్ వంటి అగ్రశ్రేణి కంపెనీలతో కలిసి పనిచేస్తోంది. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, తన ఇ-రెసిడెన్సీ హోదాతో ఈస్టోనియాలో గత ఏడాదిలో రిలయన్స్ జియో అనుబంధ సంస్థను ప్రారంభించారు.

భారత్- ఈస్టోనియా- ఐరోపా యూనియన్ మధ్య బలమైన సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఈయూ దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు విస్తరించటానికి మనదేశానికి చెందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు భవిష్యత్తులో 'ఇ-రెసిడెన్సీ' సదుపాయాన్ని ఇంకా పెద్ద సంఖ్యలో వినియోగించుకుంటారని ఆశిస్తున్నట్లు ఈస్టోనియా రాయబారి ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం మన దేశం నుంచే కాకుండా ఈ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా 157 దేశాల నుంచి 50,000 మంది ఇ-రెసిడెంట్లు చేరారు. ఇటువంటి వారి సారథ్యంలోని 6,000 స్టార్టప్ సంస్థలు ఈయూ దేశాలకు తమ కార్యకలాపాలను విస్తరించాయి. వినూత్నమైన వ్యాపారాలోచనలు ఉంటే.... ఐరోపా దేశాల్లో పెట్టుబడి సమకూర్చటానికి ఎంతో మంది సిద్ధంగా ఉన్నట్లు, దీన్ని భారతదేశంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా స్టార్టప్ సంస్థలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ఇ-రెసిడెన్సీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రిహో క్రూవ్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌పై అర్వింద్ స్మార్ట్‌స్పేసెస్ దృష్టి

ముంబయి: దేశ వ్యాప్తంగా ప్రాజెక్టుల విస్తరణ కోసం అర్వింద్ స్మార్ట్‌స్పేసెస్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ మార్కెట్లో ఉన్న అవకాశాలనూ పరిశీలిస్తోంది. ఈ ఏడాదిలో సంస్థ మొత్తం రూ.250 కోట్లతో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. 'వృద్ధి ప్రణాళికల్లో భాగంగా రానున్న రోజుల్లో పలు కొత్త ప్రాజెక్టులను ప్రారంభించబోతున్నాం. వచ్చే నెలలో పుణెలో నివాస ప్రాజెక్టు ప్రారంభం కానుంది. మూడు నెలల్లో బెంగళూరులో కమర్షియల్ ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న సానుకూలతలను కూడా విశ్లేషిస్తున్నాం' అని సంస్థ ఎండీ, సీఈఓ కమల్ సింఘాల్ తెలిపారు. సెప్టెంబరు 30, 2018 నాటికి సంస్థ 30లక్షల చదరపు అడుగుల నివాస, వాణిజ్య స్థలాన్ని నిర్మించింది.

ఎన్‌ఎస్‌ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 380.25 (377.30) 1286641
ASIAN PAINTS 1396.35 (1402.00) 1004783
AXIS BANK LT 663.25 (670.10) 12751327
BAJAJ AUTO L 2725.30 (2696.90) 277585
BAJAJ FINANC 2514.65 (2524.35) 910839
BAJAJ FINSER 6371.95 (6399.10) 164715
BHARTI AIRTE 337.30 (334.50) 5180570
BHARTI INFRA 285.05 (290.35) 3672383
BPCL 335.60 (340.05) 4886802
CIPLA 513.25 (510.10) 1252439
COAL INDIA L 233.00 (232.65) 2292058
DR. REDDYS 2600.40 (2603.10) 390414
EICHER MOTOR 20556.10 (20291.05) 102143
GAIL 343.90 (341.35) 2754189
GRASIM IND 820.20 (835.30) 819813
HCL TECH 935.85 (938.40) 916048
HDFC 1980.10 (1994.95) 2138302
HDFC BANK 2108.50 (2116.80) 1922885
HERO MOTOCOR 2919.50 (2937.45) 452293
HINDALCO IND 204.00 (205.70) 9291967
HINDUSTAN UN 1786.20 (1785.00) 1313981
HPCL 232.90 (239.00) 7617369
ICICI BANK 379.50 (382.25) 14497154
INDIABULLS H 814.25 (821.75) 2883533
INDIAN OIL 129.90 (132.00) 10687270
INDUSINDBANK 1565.90 (1601.75) 4377060
INFOSYS LTD 679.70 (676.10) 9572493
ITC 289.60 (290.40) 10288580
JSW STEEL LT 289.30 (290.75) 4352095
KOTAK MAHIND 1219.55 (1238.25) 1651443
LARSEN & TOU 1392.60 (1386.05) 1063647
M&M 733.20 (726.30) 2550750
MARUTI SUZIK 7391.60 (7492.90) 452699
NTPC LTD 148.10 (146.55) 12784001
ONGC 143.25 (145.30) 7131028
POWER GRID C 195.65 (197.60) 2019221
RELIANCE IND 1107.50 (1110.75) 4080283
SBI 305.55 (305.30) 16295468
SUN PHARMA 444.60 (448.75) 3672333
TATA CONSULT 1888.55 (1886.95) 3053461
TATA MOTORS 185.75 (183.05) 16961888
TATA STEEL L 480.40 (479.20) 7081000
TECH MAHINDR 694.55 (693.70) 1454656
TITAN IND 966.70 (952.95) 2450895
ULTRATECH 3818.20 (3817.25) 138524
UPL LIMITED 773.10 (764.80) 2401210
VEDANTA LIMI 195.45 (194.75) 8256271
WIPRO 325.75 (329.00) 3099392
YES BANK LTD 186.90 (186.45) 36296992
ZEE ENTERTAI 451.35 (451.25) 3412584

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1300.60 (1299.60) 22787
ACC 1447.80 (1454.15) 277837
ADITYA BIRLA 96.95 (96.40) 905645
AMBUJA CEMEN 213.15 (212.85) 2033769
ASHOK LEYLAN 95.00 (94.45) 32312717
AUROBIND PHA 776.95 (757.25) 4276190
AVENUE SUPER 1587.80 (1595.75) 349037
BANDHAN BANK 471.55 (455.40) 8091914
BANK OFBAROD 123.45 (122.95) 8763655
BEL 92.40 (92.35) 5849807
BHEL 68.85 (70.25) 7810193
BIOCON LTD 630.45 (631.85) 1476768
BOSCH LTD 19704.00 (19476.35) 8856
BRITANNIA 3088.95 (3092.65) 229690
CADILA HEALT 350.00 (347.70) 497887
COLGATE PALM 1325.90 (1303.55) 515428
CONTAINER 689.05 (684.45) 472688
DABUR INDIA 421.15 (421.50) 1089796
DLF LIMITED 183.55 (182.10) 9198151
GENERAL INS 262.65 (262.90) 59144
GODREJ CONSU 779.50 (773.90) 793139
HAVELLS INDI 688.05 (681.75) 985376
HDFC STAND L 406.70 (396.00) 1539299
HINDUSTAN ZI 275.95 (275.45) 449963
ICICI LOMBAR 890.40 (864.20) 635230
ICICI PRU LI 348.50 (336.75) 3816361
IDEA CELLULR 37.10 (36.95) 10158441
INTERGLOBE A 1097.00 (1104.85) 767815
L&TFIN.HOLD 144.30 (144.65) 2483786
LIC HOUS.FIN 483.45 (476.15) 961932
LUPIN 838.00 (838.15) 737445
MARICO LIMIT 387.10 (383.75) 1236628
MCDOWELL 586.55 (594.15) 1375874
MOTHERSON 161.95 (161.95) 3423750
MRF 66700.70 (66070.35) 4018
NHPC LTD 25.55 (25.95) 2782061
NMDC LTD 91.10 (91.25) 6126238
OIL INDIA 173.75 (175.80) 510036
ORACLE FIN S 3635.60 (3599.10) 22784
P&G HYG&HEAL 9995.65 (9982.45) 3926
PETRONET LNG 214.05 (214.40) 3435172
PIDILITE IND 1115.15 (1098.10) 847082
PIRAMAL ENTE 2305.05 (2341.90) 266252
SAIL 52.45 (52.25) 7453857
SBI LIFE INS 634.75 (642.95) 165683
SHREE CEMENT 16496.15 (16345.40) 9641
SHRIRAM TRAN 1186.35 (1209.95) 876768
SIEMENS 1071.05 (1053.55) 355342
SUN TV LTD 590.05 (588.90) 727989
THE NEW INDI 179.05 (177.80) 22003

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.72 (6.72) 374
AISHWARYA TE 2.86 (2.85) 40
ALPHAGEO 456.80 (453.25) 722
AMAR RAJA BA 757.70 (738.65) 84136
ANDHRA BANK 29.55 (30.10) 28937
ANDHRA CEMEN 5.90 (5.85) 3490
ANDHRA PAPER 457 (462.40) 2689
ANDHRA PETRO 68.75 (68.65) 54179
ANDHRA SUGAR 332.90 (333.95) 1028
ANJANI PORTL 124.10 (126.55) 2
ASTRA MICROW 80.80 (80.15) 5659
AUROBINDO PH 775.70 (756.25) 164559
AVANTEL SOFT 232.30 (232.55) 1334
AVANTI FEEDS 378.45 (379.35) 14083
AVON ORG 6.78 (6.46) 153
BALAJI AMIN 447.30 (449.50) 597
BARTRONICS 7.37 (7.25) 15961
BHAGIRA CHEM 435 (423.50) 612
BHAGYA NAG 33.80 (34.35) 230
BN RATHI SEC 25.65 (27) 470
BRILLIANT SE 1.04 (1.09) 170246
CAMBRIDGE TE 44.85 (46.25) 1298
COMBAT DRUGS 20.25 (20.25) 10
CONT COFFEE 268.65 (267.85) 719
COROMAN FERT 460.85 (456.50) 6050
CUBEX TUB 14.80 (15.14) 1900
CYBERMATE 2.14 (2.23) 48203
CYIENT LIMIT 605.35 (604.35) 2317
DECCAN CEMEN 385.50 (397) 2
DIVI'S LAB 1516.25 (1474.25) 102651
DIVYA GRANIT 82.05 (86) 400
DR REDDY 2599.55 (2603.90) 12871
FOUR SOFT 42.10 (42.95) 1708
GATI CORPN 82.60 (82.95) 45884
GAYATRI PROJ 173.30 (175.25) 1207
GMR INFRASTR 16.75 (16.85) 1333961
GOLDST INFRA 227.35 (235.75) 8932
GOLDSTONE EN 15.95 (15.90) 1700
GRANULES (I) 90.15 (90.45) 30352
GSS AMERICA 127.85 (130.70) 29166
GVK POWER 7.74 (7.80) 252420
HBL NIFE POW 28.80 (28.40) 19633
HERITAGE FOO 521.95 (525.95) 625
HIL LTD 2016.80 (1991.05) 242
HIND FLUROCA 16.35 (16.40) 4319
IDL INDUSTRS 280.05 (279.35) 71
ILFS ENGINEE 14.65 (14.65) 16961
INCAP 39 (39) 712
IVRCL INFRAS 1.02 (1.02) 57621
JEEVAN SCIEN 37.25 (38) 127
KAKATIYA CEM 198.85 (196.25) 10509
KALLAM SPG 18.70 (18.45) 7945
KAVERI SEED 556.40 (548.40) 27895
KCP LTD 91.05 (90) 2600
KERNEX MICRO 23.25 (23.35) 4965
KNR CONSTRUC 216.15 (214.95) 1540
KREBS BIO 108.05 (112) 1
LANCO INDUS 179.95 (181.80) 590
LAURUS LABS 375.10 (376.40) 1252
LOKESH MACH 45.65 (45.85) 730
MADHUCON PRO 6.92 (7) 6602
MEDINOVA DIA 18.90 (18) 500
MEGA SOFT 7.43 (7.30) 3590
MIC ELECTRON 1.16 (1.22) 199208
MOLD-TEK.TEC 45 (45.05) 2522
MOLDTK PLA 264.20 (260.05) 4244
MSR INDIA LT 11.21 (11.78) 4273
NAGARJAGRICH 27.90 (27.90) 1100
NATCO PHARMA 685.55 (685.80) 6070
NAVA BH VENT 115.10 (116.30) 10659
NCC 92.75 (90.55) 1281405
NCL IND 132.75 (136) 529
NEHA INTER 4.15 (4.15) 551
NETTLINX 51.80 (51.95) 11409
NEULAND LAB 503.75 (503.55) 5171
NIHAR INFO 14.20 (13.54) 885
NILE 372.65 (381.40) 2326
NORTHGATE TE 0.83 (0.87) 14246
OIL COUNTRY 15.65 (15.60) 7657
PANYAM CEMEN 13.58 (13.75) 4918
PENNER IND 40.90 (42.30) 111877
PHYTOCHEM I 44.70 (47.75) 690
PIONEER DIST 164.30 (166.25) 1621
PITTI LAMIN 66.65 (65) 14798
POKARNA 155.40 (156.50) 1918
PRAJAY ENGS 8.70 (8.71) 10907
PREMIER EXPL 234.50 (238.40) 1504
PRISM CEMENT 88 (86.10) 13232
PRUDENTL PHA 3.65 (3.69) 28397
RAASI REFRAC 12.67 (12.07) 414
RAGSAN PETRO 56 (58.90) 22
RAIN INDUSTR 117 (115.85) 102482
RAJ PACKAGIN 26.65 (26.50) 1134
RAM INFORMAT 38.15 (39.35) 1327
REG.CERAMIC 4.09 (3.90) 150
SAGAR CEM 663.25 (673.20) 433
SAMKRG PIST 189.25 (190.85) 766
SATVAH. ISPA 9.36 (9.63) 10102
SMS PHARMA 70.55 (71.85) 550
SOUTH BIO TE 2.04 (2) 6793
SPHERE GLOBA 19 (19.85) 997
SREE RAYAL A 35.45 (35.70) 52891
SRI KPR INDU 17.85 (17.55) 291
SRINIVASA SH 43.10 (47) 149
STARCHIK SP 24.80 (23.65) 100
STEEL EXCHAN 14.65 (14.20) 274
SUJANA METAL 0.40 (0.39) 2801
SUJANA TOWER 1.15 (1.15) 603
SUJANA UNIVE 0.33 (0.34) 7771
SURANA TELE 4.75 (4.75) 1388
SURYALAKSH.C 42 (42.05) 3174
SUVEN PHARMA 227.10 (226.15) 17053
TAJ GVK HOTE 180.75 (181.25) 3713
TANLA 30.30 (30.40) 11310
TERA SOFTWAR 49.15 (50.30) 70743
TRANS BIOTEK 4.07 (3.88) 23926
TRENDY KNIT 0.20 (0.19) 80
VAMSHI RUBB 32.90 (32.90) 1572
VBC FERRO 40.95 (39) 5215
VICEROY HOTE 4.81 (4.69) 9416
VIJAY TEXTIL 43 (42.90) 190
VIMTA LABS 274 (285.35) 7604
VISAKA IND 434.75 (428.45) 806
VISTA PHARMA 27.20 (27.40) 3560
VIVIMED LABS 34.55 (34.45) 24210
VJIL CONSULT 42.65 (42.55) 4283
VST INDUS 3170.85 (3206.25) 4
YBRANT DIGIT 3.28 (2.74) 166630
ZENOTECH LAB 35.50 (36) 5876
ZENTECH 74.05 (74) 3952

టీసీఎస్.. రాణించెన్



● 14 త్రైమాసికాల గరిష్ఠానికి ఆదాయ వృద్ధి

● రూ.8,105 కోట్లకు నికర లాభం ● మధ్యంతర డివిడెండు రూ.4

ముంబయి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సాఫ్ట్‌వేర్ దిగ్గజం టీసీఎస్ రాణించింది. నికర లాభం, ఆదాయాల్లో మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. ఆదాయ వృద్ధిలో అయితే రికార్డు సృష్టించింది. 2018ని సంతృప్తికరంగా ముగించినట్లు కంపెనీ ఉన్నతాధికార్లు చెబుతున్నాయి.

నికర లాభం: నికర లాభం 24.1 శాతం వృద్ధితో రూ.8,105 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఇది రూ.6,531 కోట్లుగా నమోదైంది. టాటా గ్రూప్ మొత్తం నికర లాభంలో ఈ కంపెనీదే అత్యధిక భాగం అన్న సంగతి తెలిసిందే. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే లాభంలో వృద్ధి 2.6 శాతం మాత్రమే.

ఆదాయం: ఉత్తర అమెరికా మార్కెట్ రాణించడంతో కంపెనీ ఆదాయం 20.8 శాతం వృద్ధితో రూ.30,904 కోట్ల నుంచి రూ.37,338 కోట్లకు చేరింది. స్థిర కరెన్సీ పద్ధతిన ఆదాయ వృద్ధి 12.1 శాతంగా నమోదైంది. ఈ ఆదాయ వృద్ధి 14 త్రైమాసికాల్లోనే అత్యధికం కావడం గమనార్హం. అంతక్రితం త్రైమాసికం (జులై-సెప్టెంబరు 2018)తో పోలిస్తే ఈ వృద్ధి 1.3 శాతంగా ఉంది. మొత్తం ఆదాయాల్లో 30.1 శాతం వాటా ఉన్న డిజిటల్ సేవల విభాగం 52.7 శాతం వృద్ధిని సాధించింది.

ఇక డాలర్లలో ఆదాయం చెప్పాలంటే అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే 0.67% పెరిగి 5250 మిలియన్ డాలర్లుగా నమోదైంది. స్థిర కరెన్సీ పద్ధతిన వృద్ధి 1.8 శాతంగా ఉంది. అంతక్రితం త్రైమాసికం ఈ వృద్ధి 3.7 శాతంగా ఉంది.

ఎబిట్: వడ్డీ, పన్నులకు ముందు ఆదాయం(ఎబిట్) 2.12 శాతం తగ్గి(అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే) రూ.9564 కోట్లకు తగ్గింది. మార్జిన్ సైతం 26.5 శాతం నుంచి 25.6 శాతానికి పరిమితమైంది.

వివిధ వ్యాపార విభాగాలు

✦ బీఎఫ్ఎస్ఐ విభాగంలో 8.6% వృద్ధి
✦ డిజిటల్ ఆదాయం: 52.7% వృద్ధి
✦ బ్రిటన్, ఐరోపాల్లో వృద్ధి 25.1%

ఉద్యోగులు: అక్టోబరు-డిసెంబరు 2018 త్రైమాసికంలో టీసీఎస్ నికరంగా 6827 మంది ఉద్యోగులను జత చేసుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 4,17,929కి చేరింది. వలసల రేటు 11.2 శాతంగా నమోదైంది. 2018లో అమెరికాలో అత్యధిక స్థాయిలో నియామకాలు చేపట్టినట్లు కంపెనీ మానవ వనరుల అంతర్జాతీయ అధిపతి అజయ్ ముఖర్జీ పేర్కొన్నారు. ఎంత మందిని నియమించుకున్నదీ వెల్లడించనప్పటికీ ఈ నియామకాల కోసం 70 విశ్వవిద్యాలయాలకు వెళ్లినట్లు తెలిపారు.

నగదు నిల్వలు: డిసెంబరు చివరి నాటికి కంపెనీ వద్ద రూ.43,000 కోట్ల విలువైన నగదు, నగదు సమాన నిల్వలున్నాయి.

భవిష్యత్‌పై అంచనాలు: 'ఈ త్రైమాసికంలో మంచి ఆర్డర్లు ఉన్నాయి. వచ్చే ఏడాదికి ఇవి మాకు దన్నుగా నిలుస్తాయ'ని కంపెనీ ఎండీ, సీఈఓ రాజేశ్ గోపీనాథ్ గురువారమిక్కడ ఫలితాల విడుదల సందర్భంగా పేర్కొన్నారు. ఐటీ వ్యయాల్లో ఏ మాత్రం కోతలు ఉండవని మా క్లయింట్లు అన్నారని ఆయన వివరించారు. మార్చి త్రైమాసికం మధ్యకల్లా మా ఫలితాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. కాగా, పూర్తి సంవత్సరానికి రెండంకెల ఆదాయ వృద్ధిని నమోదు చేయడానికి కంపెనీ సంసిద్ధంగా ఉందని గోపీనాథ్ అన్నారు.

కాంట్రాక్టులు

డిసెంబరు త్రైమాసికంలో కాంట్రాక్టుల విలువ 5.9 బిలియన్ డాలర్లుగా నిలిచింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఇది 4.9 బి. డాలర్లుగా ఉంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో 100 మిలియన్ డాలర్ల విలువైన ఒక క్లయింటును జత చేసుకుంది.

వివిధ కరెన్సీలతో పోలిస్తే రూపాయి హెచ్చుతగ్గులకు గురి అయినప్పటికీ, కొన్ని ప్రధాన మార్కెట్లలో వ్యాపార వ్యయాలు పెరిగినప్పటికీ.. టీసీఎస్ ఆపరేటింగ్ మార్జిన్లు మెరుగ్గా రాణించాయని కంపెనీ సీఎఫ్ఓ వి రామకృష్ణన్ పేర్కొన్నారు. 'మా కార్యకలాపాలపై దృష్టి కొనసాగిస్తాం. మేం అనుకున్నశ్రేణికి లాభదాయకతను తీసుకువచ్చాం. భవిష్యత్ వృద్ధి కోసం పెట్టుబడులనూ కొనసాగిస్తామ'ని ఆయన అన్నారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో లండన్‌కు చెందిన డబ్ల్యూ12 స్టూడియోస్‌ను రూ.66 కోట్లతో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. కాగా, కంపెనీ ఆదాయాల విషయంలో అంచనాలను మించి రాణించిందని.. కానీ మార్జిన్ల విషయంలో అంచనాలను తప్పిందని విశ్లేషకులు అంటున్నారు.

బీఎస్ఈలో టీసీఎస్ షేరు 0.35 శాతం లాభంతో రూ.1,888.15 వద్ద ముగిసింది.

డివిడెండు

ఒక్కో షేరుకు రూ.4 మధ్యంతర డివిడెండును కంపెనీ ప్రకటించింది. రికార్డు తేదీ జనవరి 18గా తెలిపింది. ఇది మూడో మధ్యంతర డివిడెండు కావడం గమనార్హం.

> 2018ని బలమైన ఆదాయ వృద్ధితో ముగించాం. డిసెంబరు త్రైమాసికంలో ఆదాయం 12.1 శాతం వృద్ధిని కనబరచింది. ఇది 14 త్రైమాసికాల్లోనే గరిష్ఠ స్థాయి. అన్ని ప్రాంతాల్లోని కీలక విభాగాలు వృద్ధిని కొనసాగించడంతో ఇది సాధ్యమైంది. క్లయింట్ల నుంచి వచ్చిన ఆర్డర్లు బలంగా ఉండడం, డిజిటల్ సేవల్లో పరిశ్రమ కంటే మిన్నగా రాణించడం చూస్తే టీసీఎస్ సామర్థ్యాలకు క్లయింట్లు ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నాం.
>
> – రాజేశ్ గోపీనాథ్, సీఈఓ, ఎండీ, టీసీఎస్



మారుతీ కార్లు ప్రియం

దిల్లీ: అగ్రగామి కార్ల సంస్థ మారుతీ సుజుకీ ఎంపిక చేసిన మోడళ్లపై రూ.10,000 వరకు ధరలు పెంచింది. ముడి వస్తువుల ధరలు పెరగడం, విదేశీ మారక రేట్లు ప్రతికూల ప్రభావం చూపడమే ఇందుకు కారణమని మారుతీ సుజుకీ తెలిపింది. కంపెనీ పలు మోడళ్ల ధరలు పెంచినప్పటికీ.. ఇటీవల విడుదల చేసిన ఎర్టిగా కొత్త మోడల్ ధరను మాత్రం యథాతథంగా కొనసాగించనుంది. ప్రస్తుతం మారుతీ సుజుకీ చిన్న కారు ఆల్టో 800 నుంచి ప్రీమియం క్రాస్ఓవర్ ఎస్-క్రాస్ శ్రేణిలో కార్లను విక్రయిస్తోంది. పెంచక ముందు వీటి ధరలు రూ.2.53- 11.45 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ) శ్రేణిలో ఉన్నాయి. కంపెనీ ధరలు పెంచనున్నట్లు గత నెలలోనే ప్రకటించింది. అయితే ఎంత స్థాయిలో పెంచనుందో మాత్రం వెల్లడించలేదు. ఈ నెల ప్రారంభం నుంచి టయోటా, ఇసుజు సహా వివిధ కంపెనీలు మోడళ్ల ధరలు పెంచాయి.

సైబర్ నేరగాళ్లు పొంచే ఉంటున్నారు

● నెట్ వినియోగదార్ల వార్షిక వృద్ధి 44% ● సైబర్ నేరాల పెరుగుదల 457%

● ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్ట ప్రకారమే ఇవి

● నమోదు కానివి మరెన్నో ● 2011-16పై అసోచామ్ నివేదిక

దేశీయంగా ఇంటర్నెట్ వినియోగించే వారి సంఖ్య ఎంత వేగంగా పెరుగుతుందో.. ఆన్‌లైన్ మోసాలు కూడా అంతేస్థాయిలో అధికమవుతున్నాయి. కంప్యూటర్, మొబైల్ ద్వారా ఇంటర్నెట్ వినియోగించడం ప్రారంభించిన వారికి, సైబర్ భద్రతా చర్యలపై అవగాహన లేకపోవడం వల్ల నేరాలు ఎక్కువవుతున్నాయి. భౌతికంగా సొత్తు కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో అత్యధికులు సన్నద్ధంగానే ఉంటారు. అదే ఆన్‌లైన్‌కు వచ్చేసరికి ప్రపంచంలో ఏ మారుమూల ప్రాంతం నుంచి అయినా నేరం చేసే వీలుండటం, వీరి నుంచి కాపాడుకునే భద్రతా చర్యలపై అవగాహన కొరవడటం నేరస్తులకు కలిసివస్తోంది.

✦ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలోని వ్యక్తిగత-సంస్థాగత సమాచారాన్ని అపహరించడం, దానితో వేధింపులకు గురిచేయడం, బ్యాంక్ ఖాతాల వంటి సున్నిత సమాచారాన్ని సంగ్రహించి, ఆర్థికంగా నష్టపరచడం, ఆన్‌లైన్‌లో వేధించడం, దుర్భాషలు-అసత్యప్రచారం.. వంటి అధిక నేరాలు జరుగుతున్నాయి.



సైబర్ నేరాల నియంత్రణ చట్టం (2000) ప్రకారమే చూసినా.. 2011-2016 మధ్య ఇంటర్నెట్ వాడకందార్ల సంఖ్యలో 44 శాతం వార్షిక వృద్ధి లభిస్తే, సైబర్ నేరాల సంఖ్య 457 శాతం అధికమైందని అసోచామ్ (ది అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా), ఎన్ఈసీ సంయుక్త అధ్యయనం వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం..

✦ **3వ స్థానం:** అమెరికా, చైనా తరవాత ఇంటర్నెట్ వాడకందార్లు అధికంగా ఉన్న దేశం మనదే.

✦ సైబర్ నేరాలు అధికంగా జరిగేందుకు ఆస్కారమున్న దేశాల్లో తొలి 5 స్థానాల్లో భారత్ ఉంటుందని, సైబర్‌భద్రతా సంస్థ సిమాంటిక్ పేర్కొంది.

ఆధునిక పోలీసింగ్ విధానాల వల్ల..

ఆధునిక పోలీసింగ్ విధానాలు, సాంకేతికతల వల్ల వ్యక్తిగత సమాచారాన్ని చేరడం సులభమే. ఇందువల్ల వ్యక్తిగతంగా, సామాజికంగా సేవలు మెరుగ్గా అందించగలరు. నేరాల నియంత్రణ, పౌరుల భద్రతతో పాటు వ్యాపారసంస్థలకు భారం తగ్గించవచ్చు.

✦ సైబర్ నేరాలను అరికట్టే సమగ్ర వ్యవస్థలను రాష్ట్రాల్లో ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన సంస్థలు కూడా సహకరించేలా చూడాలి.

✦ సైబర్ నేరగాళ్లు ప్రాంతాలకతీతంగా ఎక్కడినుంచైనా తమ ప్రతాపం చూపిస్తుంటారు కనుక, వీరిపై పోరాడే జాతీయ-అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలతో అనుబంధం నెరపుతుండాలి.

✦ కేంద్రప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థల సహకారంతో, రాష్ట్ర స్థాయిల్లో పోలీసులు కూడా సైబర్ నేరాల నియంత్రణ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి. అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తుండాలి.

నేరాల నిరోధానికి..

సైబర్ నేరాలు నిరోధించేందుకు కేంద్రీకృత సైబర్ సెల్, జిల్లాస్థాయి ప్రత్యేక కేంద్రాలతో పాటు పోలీస్‌స్టేషన్లలోనూ సైబర్‌బృందాలను నియమించాలని అధ్యయనం పేర్కొంది.

ఆధునిక సాంకేతికతతో పట్టేసే వీలు

కృత్రిమ మేధ, బిగ్‌డేటా అనలిటిక్స్, సీసీ కెమేరాలతో ముఖాన్ని గుర్తించే సామర్థ్యం, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక సాంకేతికతలతో సైబర్ నేరగాళ్లను గుర్తించి, పట్టేసుకునే విషయమై చట్ట సంస్థలకు అవగాహన పెరుగుతోంది. అయితే ఇవన్నీ జాతీయస్థాయిలో అమలు కావడం లేదు. రాష్ట్ర స్థాయిల్లో ఈ సాంకేతికతలు వినియోగిస్తున్నారు.

కేంద్రం ఆర్థికసాయం చేయాలి

ఇప్పటికే కేంద్రప్రభుత్వం, సీబీఐ, ఈడీ వంటి సంస్థలు సైబర్ నేరాల నిరోధ చర్యలు తీసుకోవడంలో ముందున్నాయి. రాష్ట్రాలు కూడా సైబర్ భద్రతా వ్యవస్థలు సమకూర్చుకునేందుకు, సాంకేతికతను మెరుగుపరచుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కేంద్రప్రభుత్వం అందించాలి.

✦ సైబర్ పరిశోధనాశాలలు నెలకొల్పడంతో పాటు అధికారులకు శిక్షణ ఇప్పించాలి.

✦ సైబర్ నేరాలు కనిపెట్టడం, పరిష్కరించడం కూడా చట్టబద్ధ సంస్థల విధుల్లో భాగం కావాలి.



బ్రాండ్ల రారాజు కోహ్లి

● 170.9 మి.డాలర్ల విలువతో మళ్లీ అగ్రస్థానం ● అనుష్కతో జంటగానూ 'కింగే'
● రెండో స్థానానికి ఎగబాకిన దీపికా పదుకొణే ● డఫ్ అండ్ ఫెల్ప్స్ నివేదిక


ముంబయి: క్రికెట్ రికార్డులను తిరగరాయడంలోనే కాదు బ్రాండు విలువలోనూ విరాట్ కోహ్లినే రారాజు. 170.9 మి.డాలర్ల బ్రాండు విలువతో వరుసగా రెండో ఏడాది కోహ్లి తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. దేశంలో అత్యధిక బ్రాండు విలువున్న ప్రముఖుడిగా (సెలబ్రిటీలు) అగ్రతాంబూలాన్ని దక్కించుకున్నాడు. 2017తో పోలిస్తే కోహ్లి బ్రాండు విలువ 18 శాతం పెరగడం గమనార్హం. 2018 సంవత్సరానికి గ్లోబల్ వ్యాల్యూయేషన్, కార్పొరేట్ ఫైనాన్స్ అడ్వయిజర్స్ సంస్థ డఫ్ అండ్ ఫెల్ప్స్ రూపొందించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. బ్రాండు విలువపరంగా అత్యుత్తమ 20 మంది సెలబ్రిటీలకు ఈ జాబితాలో ర్యాంకులు ఇచ్చింది. కోహ్లి తర్వాతి స్థానంలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణే నిలిచింది. షారూక్ ఖాన్‌ను వెనక్కినెట్టి ఈ స్థానాన్ని ఆమె చేజిక్కించుకుంది. షారూక్ ఖాన్ ఈ ఏడాది ఐదో స్థానానికి పడిపోయాడు.

✤ ఒంటరిగా 24.. భార్యతో 40

2018 నవంబరు నాటికి విరాట్ కోహ్లి చేతిలో 24 బ్రాండ్లకు సంబంధించి ప్రకటన ఒప్పందాలు (ఎండోర్స్‌మెంట్) ఉన్నాయి. ఒంటరిగానే కాకుండా తన భార్య అనుష్క శర్మతో కలిసి 40 బ్రాండ్లకు కోహ్లి ప్రచారకర్తగా ఉన్నారు.

✤ 100 మి.డాలర్లకు పైన ఇద్దరే

మొదటి రెండు స్థానాల్లో నిలిచిన కోహ్లి, దీపికా పదుకొణేల బ్రాండు విలువ మినహా మిగిలిన వారెవరిది కూడా 100 మి.డాలర్ల మైలురాయిని దాటలేదు.



✤ మూడే తక్కువ

అగ్రస్థానంలో ఉన్న కోహ్లికి.. రెండో స్థానంలో నిలిచిన దీపికాకు ఎండోర్స్‌మెంట్‌ల సంఖ్య విషయంలో స్వల్ప తేడానే ఉంది. కోహ్లి కంటే 3 తక్కువగా 21 బ్రాండ్లకు ఆమె ప్రచారకర్తగా ఉన్నారు.

✤ మూడొంతులు 10 మంది వద్దే

అత్యుత్తమ 20 మంది సెలబ్రిటీల మొత్తం బ్రాండు విలువ 899 మిలియన్ డాలర్లు. ఇందులో మూడొంతులు అంటే 75 శాతం వరకు తొలి 10 స్థానాల్లో ఉన్న వారి చేతిలోనే ఉంది.

✤ బాలీవుడ్ నటులదే పైచేయి

అత్యుత్తమ 20 మంది సెలబ్రిటీల్లో ఎక్కువ మంది బాలీవుడ్ నటులు కాగా.. ఆ తర్వాత ఎక్కువగా ఉంది క్రీడాకారులే.

✤ క్రీడాకారులకు 27%

జాబితాలో చోటు దక్కించుకున్న క్రీడాకారుల్లో కోహ్లి, సచిన్, ధోని, పి.వి.సింధు ఉన్నారు. వీరి మొత్తం బ్రాండు విలువ 241 మి.డాలర్లు. అత్యుత్తమ 20 మంది బ్రాండు విలువలో క్రీడాకారుల మొత్తం బ్రాండు విలువ 27 శాతానికి పైగానే.

✤ 'జంట'కు జేజేలు

జంటగా బ్రాండ్లకు ఎండోర్స్ చేసే ధోరణి బాగానే పెరిగింది. ఈ విషయంలో విరుష్క జంట ముందు వరుసలో ఉంది. 2018లో విరాట్, అనుష్క కలిసి 40 బ్రాండ్లకు ఎండోర్స్ చేశారు. వీటిల్లో హెడ్ అండ్ షోల్డర్స్, మాన్యవార్, పెప్సీ, సెల్‌కాన్, బూస్ట్, ఆడి, ఫాస్ట్‌ట్రాక్ లాంటి బ్రాండ్లు ఉన్నాయి. 'జంట ప్రచార' ఒరవడికి కంపెనీలు కూడా జేకొడుతుండటం గమనార్హం.

బ్రాండు విలువలో అత్యుత్తమ ఐదుగురు

ర్యాంకు	సెలబ్రిటీ	బ్రాండు విలువ
1	విరాట్ కోహ్లి	170.9 మి.డాలర్లు
2	దీపికా పదుకొణే	102.5 మి.డాలర్లు
3	అక్షయ్ కుమార్	67.3 మి.డాలర్లు
4	రణ్‌వీర్ సింగ్	63 మి.డాలర్లు
5	షారూక్ ఖాన్	60.7 మి.డాలర్లు

హోండా కొత్త సిటీ

ధర రూ.12.75 లక్షలు



దిల్లీ: హోండా కార్స్ ఇండియా తమ మధ్య స్థాయి సెడాన్ మోడల్ సిటీలో కొత్త వేరియంట్‌ను విపణిలోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ.12.75 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. కొత్త వేరియంట్ 'జడ్ఎక్స్ ఎంటీ'లో 1.5 లీటర్ పెట్రోల్ పవర్‌ట్రైన్ ఇంజిన్‌ను అమర్చారు. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ సదుపాయం ఉంది. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రిక్ సన్ రూఫ్, ఆటోమేటిక్ హెడ్‌లైట్లు, రెయిన్ సెన్సింగ్ వైపర్లు, వెనక పార్కింగ్ సెన్సార్లు వంటి అత్యాధునిక సదుపాయాలు ఇందులో ఉన్నాయి. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కలిగిన పెట్రోల్ వేరియంట్ కోసం వినియోగదారుల నుంచి అధిక డిమాండ్ రావడంతో కొత్త మోడల్‌ను తీసుకొచ్చామని కంపెనీ వెల్లడించింది. కొత్త రంగుల్లో మోడల్‌ను తీసుకురావడం, కొత్త ఫీచర్లతో సిటీ మోడల్ మరింత బలోపేతం కానుందని హోండా కార్స్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (అమ్మకాలు, మార్కెటింగ్) రాజేశ్ గోయల్ అన్నారు. 1998 జనవరిలో హోండా తొలిసారిగా సిటీ మోడల్‌ను విక్రయించింది. ఇప్పటి వరకు కంపెనీ 7.5 లక్షలకు పైగా సిటీ కార్లను అమ్మింది.

ప్రభుత్వానికి ఆర్‌బీఐ జవాబుదారీయే

పూర్వ గవర్నర్ బిమల్ జలాన్

దిల్లీ: 'ప్రభుత్వానికి జవాబుదారీగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఉండాలి. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలైనా కూడా ప్రభుత్వం ఆమోదించిన సేవలను, తమ నిబంధనావళికి అనుగుణంగా అందించాలి. ప్రభుత్వ నిబంధనావళి ప్రకారమే ఈ సంస్థలు కూడా తమ విధానాలు రూపొందించుకోవాలి.' అని ఆర్‌బీఐ పూర్వ గవర్నర్ బిమల్ జలాన్ (77) తెలిపారు. ఆర్‌బీఐ మిగుల నిధులు ఏ విధంగా వినియోగించాలనే విషయమై మార్గదర్శకాలు రూపొందించేందుకు నియమించిన కమిటీకి జలాన్ నేతృత్వం వహిస్తున్న సంగతి విదితమే. 1997-2003 మధ్య ఆర్‌బీఐ గవర్నరుగా జలాన్ వ్యవహరించారు.



విభేదాలకు ఇవీ ప్రధాన కారణాలు

ఆర్‌బీఐ, నరేంద్రమోదీ ప్రభుత్వం మధ్య విభేదాలకు ప్రధాన కారణమైన వాటిల్లో కేంద్ర బ్యాంక్ బాండ్లు, కరెన్సీల ట్రేడింగ్ ద్వారా ఆర్జించే లాభంలో ఎంత మొత్తాన్ని ప్రభుత్వానికి బదిలీ చేయాలి, మరెంత మొత్తాన్ని నిల్వగా ఉంచాలి అనేది కీలకాశంగా మారింది.

✦ మే నెలలోపు లోక్‌సభ ఎన్నికలను మోదీ ఎదుర్కోవాల్సి ఉంది. అందువల్ల రైతులకు ఆర్థిక సాయం, మధ్యతరగతి ప్రజలు, చిన్న-మధ్యస్థాయి వాణిజ్య సంస్థలకు పన్నుకోతల వంటి ప్రజాకర్షక పథకాలు అమలు చేయడానికి మరిన్ని నిధులను మోదీ ప్రభుత్వం కోరుకుంటోంది.

✦ ఇలాంటి పలు అంశాలపై కొన్ని నెలల పాటు ప్రభుత్వంతో విభేదాలు కొనసాగిన పరిస్థితుల్లో ఆర్‌బీఐ గవర్నర్ పదవికి ఉర్జిత్ పటేల్ గత డిసెంబరు 10న రాజీనామా చేయగా, శక్తికాంతదాస్‌ను ఆ పదవిలో ప్రభుత్వం నియమించింది.

✦ మధ్యంతర డివిడెండ్‌గా రూ.30,000-40,000 కోట్లు ఇచ్చేందుకు దాస్ నేతృత్వంలోని ఆర్‌బీఐ సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

✦ ఇదేవిధంగా ద్రవ్యోల్బణంపై దూకుడుగా వెళ్లకుండా, ప్రభుత్వం కోరుకుంటున్న విధంగా, వృద్ధికి తోడ్పడే ద్రవ్య, పరపతి విధానాలకే మొగ్గుచూపుతోందని చెబుతున్నారు.

✦ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు నగదు లభ్యత చేకూర్చడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు మరిన్ని రుణాలు, వాటి పునర్వ్యవస్థీకరణ చేసేందుకూ ఆర్‌బీఐ సుముఖత చూపుతోంది కూడా. అవసరాన్ని బట్టి నగదును వ్యవస్థలోకి విడుదల చేస్తామని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ ప్రకటించడం గమనార్హం.

విభేదాలు బహిర్గతం చేయొద్దు.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలి

తమ కమిటీ నివేదిక ఎలా ఉండబోతోందీ వెల్లడించేందుకు జలాన్ నిరాకరించినట్లు వార్తాసంస్థ రాయిటర్స్ పేర్కొంది. అయితే ప్రభుత్వం, ఆర్‌బీఐ మధ్య సంబంధాలు ఎలా ఉండాలో మాత్రం ఆయన తెలిపారు. 'ద్రవ్య, పరపతి విధాన సమీక్షను ప్రకటించి, అమలు చేసే బాధ్యత వహించే ఆర్‌బీఐ, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి. వివిధ అంశాలపై ప్రభుత్వంతో భేదాభిప్రాయాలుండొచ్చు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడినపుడు, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయి, వాస్తవంగా ఏం జరుగుతోంది అన్ని అంశాలపై ప్రభుత్వం విశాల దృక్పథంతో పరిశీలించాలి. ఆర్‌బీఐ కూడా నిబంధనావళికి అనుగుణంగా, ప్రభుత్వం ఆమోదించిన సేలు అందించాలి' అని వివరించారు. 'ఆర్థికశాఖ నుంచి వ్యక్తే ప్రస్తుతం ఆర్‌బీఐ గవర్నరుగా ఉన్నారు. ఆయన నేతృత్వంలో ఆర్‌బీఐ బాగా పనిచేస్తుందనే ఆశిస్తున్నా. అంశాలపై భేదాభిప్రాయాలు ఉండటం మంచిదే. అయితే దేశ ప్రయోజనాల దృష్ట్యా వీటిని బహిర్గతం చేయకుండా పరిష్కరించుకోవాలి' అని జలాన్ పేర్కొన్నారు.



ఈ తరంగాలు

గ్రహాంతర జీవులవేనా?

- ఒకే చోట నుంచి పదే పదే వస్తున్న ఎఫ్‌ఆర్‌బీలు
- గుర్తించిన కెనడా శాస్త్రవేత్తలు
- ఈ బృందంలో భారత సంతతి పరిశోధకులు

సుదూర విశ్వం నుంచి వెలువడుతున్న ఒక 'శీఘ్ర రేడియో తరంగ విస్ఫోటాన్ని' (ఎఫ్‌ఆర్‌బీ) కెనడా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇందులో విశేషమేమిటంటే సదరు వనరు నుంచి ఈ తరంగాలు పదేపదే పునరావృతమవుతున్నాయి. ఇలా తరచూ ఎఫ్‌ఆర్‌బీలను వెలువరించే మూలాలు ఇప్పటివరకూ రెండు మాత్రమే వెలుగు చూశాయి. దీంతో మానవుడి కన్నా అత్యంత అధునాతన పరిజ్ఞానాన్ని కలిగి ఉన్న గ్రహాంతర జీవుల ఉనికికి ఇది నిదర్శనమన్న సిద్ధాంతాలకు బలం చేకూరింది. తాజా పరిశోధన బృందంలో అరుణ్ నాయుడు సహా భారత మూలాలున్న పలువురు పరిశోధకులు ఉన్నారు.

ఏమిటీ ఎఫ్‌ఆర్‌బీలు?

మన పాలపుంత గెలాక్సీకి వెలుపల వందల కోట్ల కాంతి సంవత్సరాల దూరం నుంచి ఎఫ్‌ఆర్‌బీలు వెలువడుతున్నాయి. ఇవి 1-5 మిల్లీ సెకన్లు మాత్రమే మనుగడలో ఉండే రేడియో తరంగ విస్ఫోటాలు. అలా రెప్పపాటు కాలం మేరే అవి ఉనికిలో ఉన్నప్పటికీ వాటిలో శక్తి అపారం. సూర్యుడు 10వేల సంవత్సరాల్లో వెలువరించే శక్తిని ఇవి ఒక మిల్లీ సెకనులోనే ఉత్పత్తి చేస్తాయి. 2007లో తొలిసారిగా వాటిని కనుగొన్నారు. ఇప్పటివరకూ 60కిపైగా ఎఫ్‌ఆర్‌బీలు వెలుగు చూశాయి.

- 2015లో ప్యూర్టో రికోలోని ఆరెసిబో రేడియో టెలిస్కోపు ఒక వింత ఎఫ్‌ఆర్‌బీని కనుగొంది. దాని నుంచి పదేపదే ఈ తరంగాలు వెలువడుతున్నాయి.
- తాజాగా 'కెనడియన్ హైడ్రోజన్ ఇంటెన్సిటీ మ్యాపింగ్ ఎక్స్‌పెరిమెంట్' (ఛైమ్) అనే రేడియో టెలిస్కోపు ఇలాంటి మరో ఎఫ్‌ఆర్‌బీ మూలాన్ని కొనుగొంది. 150 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని ఈ ప్రదేశం నుంచి అనేక దఫాలుగా ఎఫ్‌ఆర్‌బీలు వచ్చాయి. గత ఏడాది మూడు వారాల వ్యవధిలోనే 13 విస్ఫోటాలను ఈ టెలిస్కోపు కనుగొంది. అందులో ఇదొక్కటే పదేపదే ఎఫ్‌ఆర్‌బీలను వెలువరించింది. దానికి 'ఎఫ్‌ఆర్‌బీ 180814' అని పేరు పెట్టారు.



అరుణ్ నాయుడు

తక్కువ పౌనఃపున్యాల్లోనూ..

చాలా అధిక పౌనఃపున్యాల్లోనే ఈ ఎఫ్‌ఆర్‌బీలు ఉత్పత్తవుతాయని గతంలో కొన్ని సిద్ధాంతాలు సూత్రీకరించాయి. ఛైమ్ టెలిస్కోపు గుర్తించిన రేడియో తరంగాల్లో అనేక రకాల పౌనఃపున్యాలు ఉండటం విస్మయాన్ని కలిగిస్తోందని పరిశోధనలో పాలుపంచుకున్న కెనడాలోని మెక్ గిల్ విశ్వవిద్యాలయ పరిశోధకుడు అరుణ్ నాయుడు చెప్పారు.

- లోగడ సూత్రీకరించిన దాని కన్నా తక్కువ పౌనఃపున్యాల్లోనూ తరంగాలు వచ్చాయి.
- అంత తక్కువ పౌనఃపున్యంలోని తరంగాలు వాటి మూలాల్లోని వాతావరణ అవరోధాలను ఎలా అధిగమిస్తున్నాయన్నది శాస్త్రవేత్తలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. అక్కడి వాతావరణం కారణంగా ఎక్కువగా చెల్లాచెదురుకాకుండా భూమి మీద గుర్తించగలిగే స్థాయిని కలిగి ఉండటం విస్మయాన్ని రేకెత్తిస్తోంది.



ఛైమ్ యాంటెన్నాలు


అద్భుత టెలిస్కోపు

బ్రిటిష్ కొలంబియాలోని ఒకానగాన్ లోయలో ఛైమ్ టెలిస్కోపును ఏర్పాటు చేశారు. దీన్ని కెనడా ఖగోళశాస్త్రవేత్తలు రూపొందించారు. విశ్వం నుంచి వచ్చే రేడియో సంకేతాలను ఇందులోని వేలాది యాంటెన్నాలు నమోదు చేస్తాయి. ప్రపంచంలో మరే ఇతర టెలిస్కోపులో లేని భారీ సంకేత ప్రాసెసింగ్ వ్యవస్థ దీనికి ఉంది. ఫలితంగా ఆకాశంలో ఏకకాలంలో విస్తృత ప్రాంతాలను శోధించగలదు.

సుదూర అంతరిక్ష యాత్రల కోసమేనా?

ఎఫ్‌ఆర్‌బీల మూలాలపై భిన్న సిద్ధాంతాలు వ్యాప్తిలోకి వచ్చాయి. భారీ కృష్ణబిలాల నుంచి, నక్షత్రాలు అంతమయ్యే సమయంలో చోటుచేసుకునే సూపర్ నోవా విస్ఫోటాల వంటి శక్తిమంతమైన ఖగోళభౌతిక ప్రక్రియల్లో ఇవి జనిస్తాయని పలువురు శాస్త్రవేత్తలు సూత్రీకరించారు.

- కొన్ని ఎఫ్‌ఆర్‌బీల తీరుతెన్నులను విశ్లేషిస్తే అవి ఎవరో అభివృద్ధి చేసిన కృత్రిమ వనరుల నుంచి కూడా రావొచ్చని 2017లో హార్వర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు మనస్వి లింగం, అబ్రహం లోబ్‌లు విప్లవాత్మక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. మానవుల కన్నా సాంకేతికంగా చాలా పురోగతి సాధించిన గ్రహాంతర జీవులు వీటిని ఉత్పత్తి చేస్తుండొచ్చని తెలిపారు.



ఎఫ్‌ఆర్‌బీలతో నడిచే తెరచాప (ఊహా చిత్రం)

- వందల కోట్ల కాంతి సంవత్సరాల దూరం ప్రయాణించి వచ్చేంత శక్తిమంతమైన ఎఫ్‌ఆర్‌బీలను కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా అన్న ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది. భూమికి రెట్టింపు పరిమాణంలో ఒక భారీ కర్మాగారాన్ని నిర్మించి, దాని ద్వారా సౌరశక్తిని ఒడిసిపట్టి, ఈ స్థాయి రేడియో తరంగాలను సృష్టించొచ్చని వారు గణిత సూత్రాల ఆధారంగా సూత్రీకరించారు. దీని నుంచి వెలువడే శక్తిమంతమైన ఎఫ్‌ఆర్‌బీలను ఆ గ్రహాంతర జీవులు.. సుదూర నక్షత్రాల వద్దకు ప్రయాణమయ్యేందుకు ఉపయోగిస్తుండొచ్చని చెప్పారు. తెరచాపలతో కూడిన వ్యోమనౌకలపైకి వీటిని ప్రసరింపచేసి, వాటిని ముందుకు నడిపిస్తుండొచ్చని చెప్పారు. దాదాపు 10 లక్షల టన్నుల బరువును ముందుకు నెట్టడానికి ఈ శక్తి సరిపోతుందన్నారు.

పదేపదే ఎఫ్‌ఆర్‌బీలను వెలువరించే రెండో వనరును తాజాగా గుర్తించడాన్ని బట్టి ఇలాంటివి మరిన్ని ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటిని విశ్లేషించడం ద్వారా ఈ వింత తరంగాల గుట్టుమట్లను విప్పేందుకు మార్గం సుగమమైందంటున్నారు. అంటే.. అవి గ్రహాంతర జీవుల నుంచి వస్తున్నాయా అన్నది తెలిపోనుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

తల్లీ పిల్లల ఉసురు తీసిన ఆచారం!

- రుతుక్రమం సమయంలో గుడిసెలో జీవనం
- నేపాల్‌లో ఊపిరాడక ముగ్గురి మృతి

కాఠ్‌మండూ: అనాదిగా కొనసాగుతున్న ఓ ఆచారం నేపాల్‌లో ఓ మహిళను, ఆమె ఇద్దరు పిల్లలను బలి తీసుకుంది. రుతుక్రమం సమయంలో ఆమెను వేరుగా ఓ గుడిసెలో ఉంచడంతో గాలీ వెలుతురు లేక ఊపిరాడక ఆమెతో పాటు ఇద్దరు కుమారులు (9, 12 ఏళ్ల పిల్లలు) మృతి చెందారు. బజూరా జిల్లాలో అంబా బోహోరా అనే మహిళ రుతుక్రమం నేపథ్యంలో మంగళవారం రాత్రి భోజనం అనంతరం తన ఇద్దరు పిల్లలతో నిద్రపోయేందుకు ఓ చిన్న గుడిసెలోకి వెళ్లారు. దానికి సమీపంలో చలిమంట వేయగా అక్కడ ఉంచిన ఓ దుప్పటికి నిప్పంటుకుని పొగ వ్యాపించింది. గుడిసెకు కిటికీలు లేకపోవడంతో గుడిసె అంతా పొగతో నిండిపోయింది. మరుసటి రోజు ఆమె అత్త గుడిసెలోకి వెళ్లి చూడగా ముగ్గురూ మృతి చెందారు. పొగ కారణంగా ఊపిరాడక తల్లీ పిల్లలు చనిపోయినట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. ఈ ఘటనపై ఓ బృందం దర్యాప్తు జరుపుతున్నట్లు జిల్లా అధికారి ఒకరు తెలిపారు.

మొసలి కాదది.. మా దైవం!

మూగజీవి మరణంతో పల్లె కన్నీరు



మొసలిని అంతిమ యాత్రగా తీసుకెళ్తున్న గ్రామస్థులు

రాయ్‌పుర్: ఓ మొసలి మరణం ఆ గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది. ఊరంతా కదిలొచ్చి దానికి అంత్యక్రియలు జరిపింది. రోజంతా ఆ గ్రామస్థులు భోజనం చేయలేదు. ఆ మొసలికి గుడి కట్టాలని కూడా యోచిస్తున్నారు. ఆ మొసలితో ఆ పల్లెకు ఎందుకంత బంధం పెనవేసుకుందనేది ఆసక్తికరం. ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతారా జిల్లాలో బవా మొహ్‌తారా గ్రామంలోని చెరువులో వందేళ్లకు పైగా ఓ మొసలి నివాసం ఉంటోంది. దేవుడి తర్వాత తమను ఆ మొసలి రక్షిస్తోందన్నది గ్రామస్థుల విశ్వాసం. దానికి గంగారామ్ అని పేరుపెట్టుకుని దశాబ్దాల తరబడి పూజలు చేస్తూ వస్తున్నారు. 3.4 మీటర్ల పొడవు, 250 కిలోల బరువుండే ఆ మొసలి చనిపోయి ఉండటాన్ని మంగళవారం గ్రామస్థులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. దాదాపు 500 మంది చెరువు వద్దకు చేరుకుని చనిపోయిన మొసలిని భక్తితో తాకి, అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. చెరువు ఒడ్డున స్మారక ప్రాంతం ఏర్పాటు చేయడానికి నిర్ణయించినట్లు సర్పంచి సాహు తెలిపారు.

కాన్పులో నిర్లక్ష్యం బిడ్డ రెండు ముక్కలు

జైపుర్: కాన్పు సమయంలో ఓ నర్సు నిర్లక్ష్యం కారణంగా బిడ్డ రెండు ముక్కలైంది. ఈ ఘోరం రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. జైసల్మేర్‌లోని రాంగఢ్ ప్రభుత్వ ఆస్పత్రికి దీక్షా కన్వర్ అనే మహిళ ప్రసవం కోసం వెళ్లగా, కాన్పు సమయంలో నర్సు శిశువును బలవంతంగా బయటికి లాగడంతో బిడ్డ రెండు ముక్కలైంది. ఓ ముక్కను బయటికి తీయగా, రెండో భాగం గర్భంలోనే ఉండిపోయింది. తమ బిడ్డ రెండు ముక్కలైన సంగతిని తమకు తెలపలేదని దీక్ష భర్త తిలోక్ భాటి ఆరోపించారు. లోపల మాయ (ప్లెసెంటా) మాత్రమే ఉందని చెప్పిన వైద్యులు మహిళను జోధ్‌పూర్ ఆస్పత్రికి పంపించారు. జోధ్‌పూర్‌లోని ఉమేద్ ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి శిశువు ముక్కలైన సంగతి గుర్తించి, కుటుంబ సభ్యులకు తెలిపారు. రాంగఢ్ ఆస్పత్రి సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాహుల్ గాంధీకి మహిళా కమిషన్ నోటీసులు

- నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం

దిల్లీ: రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌పై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) మండిపడింది. గురువారం ఆయనకు నోటీసులు పంపింది. సదరు వ్యాఖ్యలపై సంజాయిషీ కోరింది. ఇటీవల జైపుర్‌లో ఓ సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. "ప్రధాని తనను తాను రక్షించుకోలేక, పారిపోయి ఓ మహిళ (నిర్మలా సీతారామన్)ను ఆశ్రయించారు" అని అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు మహిళలకు అగౌరవం కలిగించేలా ఉన్నాయని ఎన్‌సీడబ్ల్యూ మండిపడింది. "మహిళలు బలహీనులన్నది రాహుల్ ఉద్దేశమా? అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రక్షణ మంత్రిగా ఉన్న వ్యక్తిని బలహీనురాలని అనడం విడ్డూరం" అంటూ ఎన్‌సీడబ్ల్యూ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ ట్విటర్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌సీడబ్ల్యూ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని.. రాహుల్‌కు నోటీసుల జారీ వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. "సోనియా గాంధీ గురించి మోదీ అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు ఎన్‌సీడబ్ల్యూ ఆయన్ను సంజాయిషీ ఎందుకు కోరలేదు?" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్‌శర్మ ప్రశ్నించారు.

భాజపా ఉపాధ్యక్షులుగా.. వసుంధర, చౌహాన్, రమణ్‌సింగ్

దిల్లీ: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఓటమిపాలైన రాష్ట్రాల మాజీ సీఎంలను ఆ పార్టీ జాతీయ రాజకీయాల్లోకి తీసుకొచ్చింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎంలుగా పనిచేసిన వసుంధర రాజె, శివరాజ్‌సింగ్ చౌహాన్, రమణ్‌సింగ్‌లను పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అమిత్ షా ఈ నియామకాలు చేపట్టినట్టు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి అరుణ్‌సింగ్ తెలిపారు.

ముడుపులు లేకపోతే కొననిచ్చేదే కాదు

- రఫేల్‌ను తొక్కిపెట్టడానికి అదే కారణం
- రక్షణ బలగాలను కాంగ్రెస్ నిర్వీర్యం చేసింది: ప్రధాని నరేంద్ర మోదీ



చెన్నై: అందాల్సిన ముడుపుల కోసం రక్షణరంగ కొనుగోళ్లకు అడ్డం పడడం కాంగ్రెస్‌కి అలవాటేనని ప్రధాని మోదీ ఆరోపించారు. హెలికాప్టర్ల కుంభకోణం దళారీ మిషెల్‌కు కాంగ్రెస్ అధినాయకత్వ కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. యూపీఏ పాలనలో రఫేల్ విమానాల కొనుగోలు వ్యవహారం పదేళ్లపాటు ఎందుకు ఆగిందో, దాని వెనుక మిషెల్ పాత్ర ఏమిటో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. గురువారం తమిళనాడులోని ఐదు జిల్లాల బూత్ కమిటీ సభ్యులతో ఆయన దూరదృశ్య సమీక్ష ద్వారా మాట్లాడారు. 'ముడుపుల సంస్కృతితో కాంగ్రెస్ వారు మన సైనిక దళాలకు దశాబ్దాలుగా నష్టం కలిగించారు. లోపాయికారీ ఒప్పందం కుదిరితేనే ఆ సర్కారులో కొనుగోళ్లు జరిగేవి. మన పొరుగు దేశాలు నాలుగోతరం, అయిదోతరం యుద్ధ విమానాలను కొంటుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం కొనుగోళ్లనే స్తంభింపజేసింది' అని విరుచుకుపడ్డారు. 'ప్రాంతీయ పార్టీలను, ప్రాంతీయ ఆకాంక్షలను ఆ పార్టీ ఎన్నడూ పట్టించుకోలేదు' అని మోదీ అన్నారు.

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల నిమిత్తం గతంలో జట్టుకట్టిన అన్నాడీఎంకే, డీఎంకే లాంటి పాత మిత్రులకు ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయని చెప్పారు. ఈ రెండు పార్టీలతో పాటు రజనీకాంత్ గురించి సభ్యుల ముందుంచి ఎవరితో పొత్తు మంచిదో అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల కసరత్తు ఆరంభం

- నేడూ, రేపూ రాష్ట్రాల ఎన్నికల ముఖ్య అధికారుల సమావేశం

ఈనాడు, దిల్లీ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా శుక్ర, శనివారాల్లో రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారుల సదస్సు నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన అన్ని ముఖ్య అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం సమీక్షించనుంది. ఓటర్ల జాబితా, మానవ వనరుల అందుబాటుతోపాటు, ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఇతరత్రా వనరుల గురించి అధికారులను అడిగి తెలుసుకోనుంది. ఈ సందర్భంగా ప్రతి రాష్ట్ర సీఈఓ ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లకు ఇప్పటివరకూ తీసుకున్న చర్యలపై దృశ్యరూపకంలో వివరణ ఇవ్వనున్నారు.

1950 నెంబర్‌తో హెల్ప్ లైన్


ఓటర్ల జాబితాల్లో పేర్లు లేని వారు వెంటనే నమోదు చేసుకొనేలా ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని రాష్ట్రాల సీఈఓలను నిర్దేశించింది. జాబితాలో తమ పేర్లు ఉన్నాయా? లేదా? అన్న విషయాన్ని ఎస్ఎంఎస్‌లు, వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకొనే అవకాశం ఓటర్లకు కల్పించింది. 1950 నెంబర్ ద్వారా ఓటర్ల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించనుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా కల్పించిన సౌకర్యాలు ఓటర్లకు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని సమీక్షించనుంది.



కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లకు నివేదిక సమర్పిస్తున్న సీనియర్ డిప్యూటీ కమిషనర్ సిన్హా

పోలింగ్‌కు 48 గంటల ముందు సామాజిక మాధ్యమాల్లో ఎన్నికలకు సంబంధించి విషయాల ప్రసారాన్ని నియంత్రించడంపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన కమిటీ గురువారం తన నివేదికను ఎన్నికల సంఘానికి సమర్పించింది. అధ్యయన కమిటీకి నేతృత్వం వహించిన సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ఉమేశ్ సిన్హా నివేదిక ప్రతిని ఎన్నికల ప్రధాన కమిషనర్ సునీల్ అరోడా, మరో కమిషనర్ అశోక్ లవాసాలకు అందించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు విస్తృతమైన నేపథ్యంలో ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని 126వ సెక్షన్‌పై అధ్యయనం కోసం ఎన్నికల సంఘం 2018 ఏప్రిల్ 24వ తేదీన 14 మంది సభ్యులతో కమిటీ వేసింది. సెక్షన్ 126 ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు టీవీలు, ఇతర ప్రసార సాధనాల్లో ఎన్నికల విషయాలు చూపడం నిషేధం. ఈ సెక్షన్ పరిధిలోకి కొత్తగా ఉద్భవించిన సామాజిక, ఇతర మీడియాలను చేర్చలేదు. ఇప్పుడు వాటిని చేర్చడం గురించి ఈ కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించింది. బహుళ దశల్లో ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో 48 గంటల నిషేధాన్ని అమలు చేసేలా ప్రసార మాధ్యమాలను నియంత్రించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కోవడంపై కూడా సిఫార్సులు చేసినట్లు సమాచారం.

అద్భుత కళాఖండం ముద్రించిన వస్త్రాన్ని ఒంటెపై కప్పినట్లు కనిపిస్తోంది కదా..! అయితే పప్పులో కాలేసినట్టే. బీకానేర్‌లో ఒంటె శరీరంపై రోమాలను జపాన్‌కు చెందిన కేశాలంకరణ నిపుణురాలు మేగుమి తకియాచి ఇలా కత్తిరించారు. రాజస్థాన్‌లో జరుగబోయే ఒంటెల పండుగ కోసం దీన్ని ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు.



ప్రపంచంలోనే ఖరీదైన విడాకులు

- విడిపోతున్న 'అమెజాన్' బెజోస్ దంపతులు
- భరణంగా రూ.4.2 లక్షల కోట్లు!

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత ధనికుడు, అమెజాన్ సంస్థ అధిపతి జెఫ్ బెజోస్, ఆయన సతీమణి మెక్‌కెంజీలు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. విడాకుల అనంతరం మెక్‌కెంజీకి భరణం కింద ఏకంగా రూ.4.2 లక్షల కోట్లు దక్కే వీలుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన విడాకులుగా చెబుతున్నారు. పాతికేళ్ల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు దంపతులిద్దరూ ఉమ్మడిగా ట్విటర్‌లో ఒక ప్రకటన చేశారు. విడాకుల తర్వాత స్నేహితులుగా కొనసాగుతామన్నారు.

సాహితీవేత్తపై దేశద్రోహ అభియోగం!

- సీనియర్ పాత్రికేయుడు, ఆర్టీఐ ఉద్యమకర్తపైనా కేసులు
- పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడినందుకే

గువాహటి: పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకు అసోంకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత హిరెన్ గొహైన్‌పై దేశద్రోహం కింద కేసు నమోదయింది. ఆయనతో పాటు సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త అఖిల్ గొగొయి, సీనియర్ పాత్రికేయుడు మంజిత్ మహంతలపైనా గువాహటి పోలీసులు తమంతట తాముగా ఈ కేసులు నమోదు చేశారు. ఈ పరిణామం అసోంలో కలకలం రేకెత్తించింది. మూడు రోజుల క్రితం జరిగిన ఒక కార్యక్రమంలో బిల్లుకు వ్యతిరేకంగా వీరు మాట్లాడారు. దీనిపై దేశద్రోహం సంబంధిత సెక్షన్ల కింద కేసు పెట్టినట్లు గువాహటి పోలీసు కమిషనర్ దీపక్‌కుమార్ విలేకరులకు తెలిపారు. రాజద్రోహానికి పాల్పడే రీతిలో బిల్లుకు వ్యతిరేకంగా వీరు వ్యాఖ్యలు చేసి, ప్రజల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.



గొహైన్ మహంత గొగొయి

ఏ ప్రాతిపదికన పెట్టారో: గొహైన్

ఈ ముగ్గురూ 'నాగరిక్ సమాజ్' అనే పౌర సంస్థలో ఉన్నారు. వీరిలో గొహైన్ గౌహతి విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా సేవలందించి పదవీ విరమణ చేశారు. తనపై రాజద్రోహం కింద కేసు పెట్టినట్లు తెలుస్తున్నా దానికి ప్రాతిపదిక ఏమిటో తెలియడం లేదని ఆయన విలేకర్లతో అన్నారు. అసోం ప్రజల అస్తిత్వాన్ని పరిరక్షించడానికి ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న పోరాటం విఫలమైతే స్వతంత్ర అసోం కోసం డిమాండ్ చేయడం మినహా ప్రజలకు మరో అవకాశమేదీ ఉండదనేదే తన ప్రసంగాల సారాంశమని వివరించారు. పౌరసత్వ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించడంపై రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తమవుతున్న నిరసనల్ని అణచివేసేందుకే పోలీసులు ఈ విధంగా చేస్తున్నారని ఆ ముగ్గురి తరపు న్యాయవాది అరూప్ బార్బొరా అన్నారు. ఆ ముగ్గురి ప్రసంగాల్లో రాజద్రోహమేదీ లేదని, వారు ప్రసంగించిన సమావేశానికి తానూ హాజరయ్యానని చెప్పారు. వీరిపై ఏమైనా చర్యలు చేపడితే ఉద్యమం మరింత రాజుకునే అవకాశం ఉందన్నారు.

బంగ్లా నుంచి చొరబాట్లు లేవు: భాజపా

గత పదేళ్లలో బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి ఎలాంటి చొరబాట్లు జరగలేదని భాజపా అధికార ప్రతినిధి స్వప్నానిల్ బారువా చెప్పారు. విదేశీయుల చొరబాట్లకు ఇకపై ఎలాంటి ఆస్కారం ఉండదని విలేకరుల సమావేశంలో తెలిపారు.

నేటి నుంచి భాజపా కార్యవర్గ సమావేశాలు

ఈనాడు, దిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో... అత్యంత కీలకంగా భావిస్తున్న భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. దిల్లీలోని రాంలీలా మైదానంలో ఈనెల 11, 12 తేదీల్లో వీటిని నిర్వహించనున్నారు. దేశ నలుమూలల నుంచి సుమారు 12 వేల మంది ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కానున్నారు. సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోవడంపై పార్టీ అధిష్ఠానం ఈ వేదిక నుంచే శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. చివరి రోజు ప్రధాని మోదీ ఉపన్యసిస్తారు. పార్టీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, తెలంగాణ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌లతో పాటు ఉభయ రాష్ట్రాల పార్టీ వ్యవహారాల బాధ్యులు వి.మురళీధర్, పీకే కృష్ణదాస్, ఎంపీ దత్తాత్రేయ, మాజీ శాసనసభ్యుడు జి.కిషన్‌రెడ్డి పాల్గొంటారు.

పేదల 10 శాతం కోటాపై సుప్రీంకోర్టులో పిటిషన్

దిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు జనరల్ కేటగిరిలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్ దాఖలైంది. రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా ఉన్న ఈ బిల్లును నిలుపుదలచేసి, కొట్టివేయాలని 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' సంస్థ అధ్యక్షుడు కౌశల్ కాంత్ మిశ్ర తమ పిటిషన్‌లో కోరారు. ఆర్థిక పరిస్థితుల ఆధారంగా కల్పించే రిజర్వేషన్లు జనరల్ కేటగిరీకే పరిమితం కాకూడదన్న రాజ్యాంగ మౌలిక లక్షణాన్ని ప్రస్తుత బిల్లు ఉల్లంఘిస్తోందని తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లోనూ సీబీఐకి 'నో ఎంట్రీ'

దిల్లీ/ రాయ్‌పుర్: ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ బాటలో నడుస్తూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా తమ రాష్ట్రంలో సీబీఐకి 'ప్రవేశాన్ని' నిరాకరించింది. రాష్ట్రంలో కేసుల దర్యాప్తునకు సీబీఐకి ఇచ్చిన ఆమోదాన్ని వెనక్కి తీసుకుంది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖకు ఒక లేఖ రాసింది. సీబీఐ అధిపతి ఆలోక్ వర్మను బదిలీ చేయాలని ప్రధాని మోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయం తీసుకున్న రోజునే ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్య చేపట్టడం గమనార్హం.

జుట్టుకు తెల్లరంగుతో శబరిమలలోకి ప్రవేశించిన మహిళ!



దేవాలయంలోకి ప్రవేశించిన మంజు

తిరువనంతపురం: జుట్టుకు తెల్లరంగు వేసుకుని ఓ మహిళ (36) తాజాగా శబరిమల ఆలయంలోకి ప్రవేశించినట్లు ప్రచారం సాగుతోంది. కేరళకు చెందిన మంజు అనే మహిళ శబరిమలకు వెళ్లినట్లుగా చూపిస్తున్న కొన్ని వీడియోలు, ఫొటోలను ఓ గ్రూపు ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. ఒక వీడియోలో ఆమె తాను త్రిసూర్ నుంచి బస్సులో వచ్చి ఈనెల 8న శబరిమలలోకి ప్రవేశించినట్లు పేర్కొంది. తనను యువ మహిళగా ఎవరూ అనుకోలేదని, పోలీసుల సహాయం కూడా తీసుకోకుండా ప్రవేశించిన తాను దాదాపు 2 గంటల పాటు ఆలయంలో ఉన్నట్లు ఆ వీడియోలో ఆమె తెలిపింది. ఇప్పటిదాకా ఆలయంలోకి ఎంత మంది 10-50 ఏళ్ల మధ్య వయసు మహిళలు ప్రవేశించారన్నది కచ్చితంగా తెలియదని సీఎం పినరయి విజయన్ విలేకరులకు తెలిపారు.

'ఆయుష్మాన్ భారత్' నుంచి వైదొలుగుతున్నాం

పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ వెల్లడి

కృష్ణానగర్ (పశ్చిమ బెంగాల్): 'ఆయుష్మాన్ భారత్' పథకం నుంచి పశ్చిమ బెంగాల్ వైదొలుగుతున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ ప్రకటించారు. ఈ పథకంపై మోదీ సర్కారు రాజకీయం చేస్తోందని.. 'గొప్పలు' చెప్పుకొనేందుకు ఉపయోగించుకుంటోందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర నిర్ణయాన్ని తెలియజేస్తూ కేంద్రానికి మమత ప్రభుత్వం లేఖ కూడా పంపినట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. లబ్ధిదారులకు మోదీ చిత్రం, కమలం గుర్తు ఉన్న లేఖలను పంపుతూ.. ప్రభుత్వ నిధులతో భాజపా కోసం ప్రచారం చేసుకుంటున్నారని మమత మండిపడ్డారు.

దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షీలా దీక్షిత్

దిల్లీ: మాజీ సీఎం షీలా దీక్షిత్ దిల్లీ పీసీసీ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అనారోగ్యం కారణంగా అజయ్ మాకెన్ ఆ పదవి నుంచి తప్పుకోవడంతో పార్టీ అధిష్ఠానం షీలాకు ఆ బాధ్యతలను అప్పగించింది. ఆప్‌తో తాము ఎలాంటి చర్చలూ జరపలేదనీ, ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నామని పార్టీ దిల్లీశాఖ బాధ్యుడు పీసీ చాకో చెప్పారు.




ఛాంపియన్స్

ప్రపంచకప్ బెర్తులు ఫుల్

సిడ్నీ

ఈ ఏడాది మే నెలాఖర్లో మొదలయ్యే ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టులో బెర్తులన్నీ దాదాపుగా భర్తీ అయిపోయాయని.. అలాగని జట్టులో ఎవరి స్థానానికీ గ్యారెంటీ లేదని, ఫామ్ కోల్పోతే ఎవరి మీదైనా వేటు పడొచ్చని టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ చెప్పాడు. "ప్రపంచకప్ లోపు భారత్ ఆడాల్సిన వన్డేలు 13. ఈ మ్యాచ్‌ల్లో దాదాపుగా ఒకే జట్టు ఆడుతుంది. వచ్చే కొన్ని నెలల్లో ఆటగాళ్ల ఫామ్, గాయాలను బట్టి ఒకట్రెండు మార్పులు జరిగితే జరగొచ్చేమో. మేం విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడుతుండటం వల్ల గాయాలు కావడానికీ ఆస్కారముంది. జట్టులోని అన్ని బెర్తులకూ ఆటగాళ్లు భర్తీ అయిపోయారు. కానీ ఎవరి స్థానానికీ గ్యారెంటీ లేదు. టోర్నీకి ఎవరు వెళ్తారన్నది ఫామ్‌ను బట్టి ఆధారపడి ఉంటుంది. రాబోయే సిరీస్‌ల్లో అందరికీ అవకాశాలుంటాయి. ఎవరికి వాళ్లు సత్తా చాటాలి" అని అతనన్నాడు. జట్టు సమష్టిగా ప్రదర్శన చేయడం, ఆటగాళ్లు అవసరమైనపుడు బాధ్యత తీసుకుని ఆడటం ప్రపంచకప్ ముంగిట కీలకమైన విషయాలని రోహిత్ అభిప్రాయపడ్డాడు. "టాప్ ఆర్డర్ విఫలమైతే మిడిలార్డర్ బాధ్యత తీసుకుని ఆడాలి. స్వదేశంలో జరిగిన గత సిరీస్‌లో అంబటి రాయుడు సత్తా చాటాడు. కార్తీక్ కూడా రాణించాడు. ధోని ఎప్పుడూ కీలక ఆటగాడే. జాదవ్ బ్యాటుతో పాటు బంతితోనూ ఉపయోగపడే ఆటగాడు" అన్నాడు.

ధోని.. దారి చూపే దీపం: మహేంద్ర సింగ్ ధోని ఫామ్ గురించి ఎవరెన్ని సందేహాలు వ్యక్తం చేసినా.. భారత జట్టు మాత్రం అతడిపై పూర్తి నమ్మకంతో కనిపిస్తోంది. కెప్టెన్ కోహ్లి సహా అందరూ మహికి అండగా నిలుస్తున్నారు. తాజాగా ధోనికి మద్దతుగా వైస్ కెప్టెన్ రోహిత్ బ్యాటింగ్ చేశాడు. "డ్రెస్సింగ్ రూంలో, మైదానంలో ధోని ఉనికి ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఎన్నో ఏళ్లుగా చూస్తూనే ఉన్నాం. అతనుంటే చుట్టూ ఒక ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుంది. అది చాలా కీలకమైంది. అలాగే ధోని వికెట్ల వెనుక ఉంటే కెప్టెన్‌కూ ఎంతో సాయంగా ఉంటుంది. అలాంటి ఆటగాడు జట్టులో ఉంటే ఎప్పుడూ మంచిదే. అతను జట్టు సభ్యులకు దారి చూపే దీపం. గతంలో ధోని ఎన్నో మ్యాచ్‌ల్లో జట్టుకు మంచి ముగింపునిచ్చాడు. అతడి ప్రశాంతత, సలహాలు, ఆట విషయంలో అతడి ఆలోచనలు ప్రస్తుత తరుణంలో జట్టుకు చాలా అవసరం. కుల్‌దీప్, చాహల్ లాంటి స్పిన్నర్లు ధోని వికెట్ కీపర్‌గా ఉంటే అతడి సలహాలతో చాలా ప్రయోజనం పొందుతారు" అని రోహిత్ అన్నాడు.



హార్దిక్, రాహుల్‌పై 2 వన్డేల నిషేధం!



దిల్లీ: ఓ టీవీ షోలో మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన టీమ్‌ఇండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌పై రెండు వన్డేల నిషేధం పడేలా కనిపిస్తోంది. దీనిపై బీసీసీఐ పాలకుల కమిటీ (సీఓఏ) ఇంకా ఏకాభిప్రాయానికి రాకపోయినా.. వీరిపై ఏదో రూపంలో చర్యలు మాత్రం తప్పవని బోర్డు వర్గాలు అంటున్నాయి. సీఓఏ అధ్యక్షుడు వినోద్‌రాయ్ రెండు వన్డేల నిషేధం విధించాలని అంటున్నాడు. కమిటీలోని సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం వేటు వేసే ముందు న్యాయపరమైన సలహా తీసుకుందామని అంటోంది. "హార్దిక్ వివరణ పట్ల సంతృప్తిగా లేను. మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన హార్దిక్, రాహుల్‌పై రెండు వన్డేల నిషేధం విధించాలని సూచించా. అయితే డయానా అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకుంటాం. వాళ్లిద్దరిపై నిషేధం విధించవచ్చా లేదా అనే అంశంపై డయానా బీసీసీఐ న్యాయ విభాగం సలహా కోరింది. ఆమె తుది నిర్ణయాన్ని చెప్పిన తర్వాత ఈ విషయంపై ముందుకెళ్తాం. నాకైతే హార్దిక్, రాహుల్ చేసిన వ్యాఖ్యలు సమ్మతమనిపించడం లేదు. వాళ్లు పరిధి దాటి మాట్లాడారు" అని వినోద్ తెలిపాడు. ఒకవేళ బీసీసీఐ నిషేధించాలని భావిస్తే.. పాండ్య, రాహుల్ శనివారం నుంచి ఆస్ట్రేలియాతో ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు వన్డేలకు దూరమయ్యే అవకాశముంది.



ఇలా మాట్లాడితే ఫిక్సర్లకు పండగే

దిల్లీ: తమకు అమ్మాయిలతో ఉన్న సంబంధాలపై ఒక టీవీ ఛానెల్ టాక్ షోలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతోంది. వీళ్లిద్దరిపై కొన్ని మ్యాచ్‌లు నిషేధం విధించడానికి బీసీసీఐ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. వీరిపై చర్యలు చేపట్టే విషయంలో బీసీసీఐ కోశాధికారి అనిరుధ్ చౌదరిని బోర్డు పాలకుల కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ సలహా కోరగా.. అతను పాండ్య, రాహుల్‌ల వ్యాఖ్యల్ని తీవ్రంగా తప్పుబడుతూ ఈమెయిల్ లేఖ రాశాడు. పాండ్య, రాహుల్ చేసిన వ్యాఖ్యల్ని బట్టి చూస్తే వీరి లాంటి వాళ్లను బుకీలు లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని అనిరుధ్ అన్నాడు. "ఈ వ్యాఖ్యల్ని విశాల దృష్టితో చూడాలి. ఆటగాళ్లను ఫిక్సింగ్ ఉచ్చులోకి దించే సిండికేట్‌లకు ఇలాంటి వాళ్లే లక్ష్యంగా మారతారు. ఫిక్సర్లు ఆటగాళ్లకు అమ్మాయిల ద్వారా ఎలా వల వేస్తారో ఐసీసీ అవినీతి నిరోధక విభాగం ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. టాక్ షోలో ఈ ఆటగాళ్ల వ్యాఖ్యలు చూస్తే వాళ్లు ఉచ్చులో పడేలాగే కనిపించారు. వీరిని వెంటనే సస్పెండ్ చేసి.. ఆ తర్వాత విచారణ చేపట్టాలి. నిషేధం విధించడంతో పాటు వారికి ఇలాంటి సున్నితమైన వ్యవహారాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంది. మొత్తంగా జట్టుకు, సహాయ సిబ్బందికి కూడా కౌన్సెలింగ్ అవసరం" అని అనిరుధ్ చెప్పాడు. ఓవైపు ఆటగాళ్లను కలిసే విషయంలో క్రీడా పాత్రికేయులకు ఆంక్షలు విధిస్తూ.. ఇలాంటి టాక్ షోలకు మాత్రం క్రికెటర్లను ఎలా అనుమతిస్తున్నారని అనిరుధ్ ప్రశ్నించాడు. పాండ్య, రాహుల్ అసలు అనుమతి తీసుకున్నారా? ఐతే ఆ అనుమతి ఇచ్చిందెవరు తేలాల్సి ఉందని అతనన్నాడు.

విశాఖలో టీ20, హైదరాబాద్‌లో వన్డే మ్యాచ్

దిల్లీ: భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన తేదీలు ఖరారయ్యాయి. పర్యటనలో కంగారూలు రెండు టీ20లు, ఐదు వన్డేలు ఆడనున్నారు. ఫిబ్రవరి 24న బెంగళూరులో తొలి టీ20 మ్యాచ్ జరుగుతుంది. 27న రెండో టీ20కి విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ మార్చి 2న హైదరాబాద్‌లో, 5న రెండో వన్డే నాగ్‌పుర్‌లో, 8న రాంచిలో మూడో వన్డే, 10న మొహాలీలో నాలుగో వన్డే, 13న దిల్లీలో ఐదో వన్డే జరుగుతాయి.



మన మేరీ.. నం.1

దిల్లీ: బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ మరో ఘనతను సొంతం చేసుకుంది. గతేడాది రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన మేరీ ప్రపంచ మహిళల బాక్సింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకింది. అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఏఐబీఏ) గురువారం ప్రకటించిన 48 కేజీల విభాగం ర్యాంకింగ్స్‌లో మేరీ 1700 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో అత్యంత విజయవంతమైన బాక్సర్‌గా కొనసాగుతున్న మేరీ 2020 ఒలింపిక్స్ కోసం పోటీపడే విభాగం (48 కేజీల నుంచి 51 కేజీలకు) మారనుంది. రాబోయే ఒలింపిక్స్‌లో 48 కేజీల విభాగం లేకపోవడమే దానికి కారణం. గతేడాది మేరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో పసిడి సాధించింది.

బెంగళూరుదే... చివరి సెమీస్ బెర్త్

మెరిసిన ప్రణీత్, శ్రీకాంత్ • చెన్నైపై విజయం



బెంగళూరు: చివరి వరకూ ఆసక్తిరేకెత్తించిన ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్ సెమీస్ రేసు ముగిసింది. బెంగళూరు రాప్టర్స్ చివరి బెర్త్ ఖరారు చేసుకుంది. గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు 3-2 తేడాతో చెన్నై స్మాషర్స్‌పై విజయం సాధించింది. ట్రంప్ మ్యాచ్‌ల్లో ప్రణీత్, శ్రీకాంత్ నెగ్గి జట్టుకు గెలుపునందించారు. పురుషుల డబుల్స్‌లో క్రిస్- చిన్ జోడీ 14-15, 15-9, 15-11తో మహమ్మద్- హెంద్రా జంటను ఓడించి చెన్నైకు శుభారంభాన్ని అందించింది. తర్వాత చెన్నై ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న పురుషుల సింగిల్స్‌లో బెంగళూరు ఆటగాడు ప్రణీత్ 15-11, 15-12తో కశ్యప్‌కు షాకిచ్చాడు. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 15-10, 15-10తో వీ ఫెంగ్‌పై నెగ్గడంతో ఆ జట్టు విజయం ఖరారైంది. సెమీస్‌లో అవధ్ వారియర్స్‌తో బెంగళూరు, హైదరాబాద్ హంటర్స్‌తో ముంబయి రాకెట్స్ తలపడనున్నాయి.

పీబీఎల్‌లో ఈనాడు (సెమీస్)

అవధే వారియర్స్ × బెంగళూరు రాప్టర్స్ (రాత్రి 7 నుంచి)

రంజీ క్వార్టర్స్‌లో యూపీ

కాన్పూర్: రంజీ ట్రోఫీలో ఉత్తర్‌ప్రదేశ్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. గ్రూప్-సిలో అసోంతో డ్రా చేసుకున్న యూపీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా 3 కీలక పాయింట్లు సాధించి ముందంజ వేసింది. తొలి ఇన్నింగ్స్‌లో అసోంను 175 పరుగులకే ఆలౌట్ చేసిన యూపీ.. తొలి ఇన్నింగ్స్‌లో 619 పరుగుల భారీ స్కోరు చేసింది. మ్యాచ్ నిలిచే సమయానికి అసోం రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 317 పరుగులు చేసింది. ఇదే గ్రూప్ నుంచి రాజస్థాన్ కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. 15న ప్రారంభమయ్యే క్వార్టర్స్‌లో సౌరాష్ట్రతో ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటకతో రాజస్థాన్, కేరళతో గుజరాత్, విదర్భతో ఉత్తరాఖండ్ పోటీపడనున్నాయి.

పరీక్ష వీరికే..!

వన్డే ప్రపంచకప్‌కు ఇంకెంతో సమయం లేదు. ఇంకో నాలుగున్నర నెలల్లో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ మొదలైపోతుంది. మధ్యలో టీమ్‌ఇండియా ఆడబోయేది 13 వన్డేలే. ఈ మ్యాచ్‌లు ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. భారత జట్టు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నట్లుగా ఇప్పటికే దాదాపుగా ప్రపంచకప్ బెర్తులు ఫుల్ అయిపోయాయి! ఈ మెగా టోర్నీకి ఎంపికయ్యే అవకాశమున్న ఆటగాళ్లే రాబోయే సిరీస్‌ల్లో బరిలోకి దిగబోతున్నారు. అన్ని బెర్తులూ భర్తీ అయినప్పటికీ.. ఎవరికీ గ్యారెంటీ లేదని, ఫామ్ బాగాలేకుంటే ఎవరిపైనైనా వేటు పడొచ్చన్న రోహిత్ వ్యాఖ్యల్ని తేలిగ్గా ఏమీ తీసుకోవడానికి లేదు.

ఈనాడు క్రీడావిభాగం

ప్రస్తుతం జట్టులో ఉన్న కొందరు ఆటగాళ్లు ప్రపంచకప్‌కు ఎంపిక కావాలన్నా.. తుది జట్టులో ఆడాలన్నా.. రాబోయే మ్యాచ్‌ల్లో ప్రదర్శన కీలకం. ఎవరి స్థానానికి గ్యారెంటీ లేదన్న రోహిత్ హెచ్చరిక జట్టులో కొందరికి వర్తించకపోవచ్చు. బ్యాటింగ్‌లో కెప్టెన్ కోహ్లి, ఓపెనర్లు రోహిత్, ధావన్‌ల సత్తా, ఫామ్ గురించి ఎవరికీ సందేహాల్లేవు! బౌలర్ల విషయంలోనూ భరోసా ఉంది. ఎటొచ్చీ మిడిలార్డర్ విషయంలోనే సందేహాలున్నాయి. అందులో వివిధ స్థానాలకు ఆటగాళ్లు ఎవరనే విషయంలో ఇప్పటికీ పూర్తి స్పష్టత లేదు. ప్రపంచకప్ జరగబోయేది ఇంగ్లాండ్‌లో కాబట్టి.. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌ల్లో సత్తా చాటిన ఆటగాళ్లకు ప్రపంచకప్‌లో ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. చివరగా స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అంబటి రాయుడు నాలుగో స్థానంలో నిలకడగా రాణించాడు. చాన్నాళ్లుగా సందిగ్ధతలో ఉన్న 4వ స్థానానికి తనే సరైన వాడినని చాటుకున్నాడు రాయుడు. ఐతే స్వదేశంలో ప్రదర్శనను బట్టి అతడికే ఆ స్థానం ఖరారు చేసే పరిస్థితి లేదు. నిరుడు రాయుడు ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికైనప్పటికీ.. ఫిట్‌నెస్ సమస్యలతో తప్పుకున్నాడు. ఆ సిరీస్ ఆడి ఉంటే రాయుడి సత్తా పూర్తిగా తెలిసేది. ఇప్పుడతను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల్లో సత్తా చాటి నాలుగో స్థానానికి తాను అర్హుడినని నిరూపించుకోవాలి. ఇక 5, 6, 7 స్థానాల విషయంలో అయితే మరింత సందిగ్ధత ఉంది. ఈ స్థానాల్లో ఆడుతున్న ఎవ్వరూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు. ముఖ్యంగా ధోనీ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. అతను వైఫల్యాల బాట వీడకుంటే.. ప్రపంచకప్‌కు ప్రత్యామ్నాయం ఆలోచించాల్సిన పరిస్థితి కూడా తలెత్తవచ్చు. యువ ఆటగాడు రిషబ్ పంత్ నుంచి ధోనికి ముప్పు పొంచి ఉంది. ఆటగాడిగా కంటే వ్యూహకర్తగా ధోనీని ఎక్కువగా కోరుకుంటోంది జట్టు. ఐతే బ్యాటింగ్‌లో ఓ మోస్తరుగా అయినా రాణించకుంటే కఠిన నిర్ణయాలు తప్పకపోవచ్చు. ధోని ఫామ్ అందుకుంటే మిడిలార్డర్‌లో ఎప్పట్లాగే ఒక స్థానం అతడి సొంతమవుతుంది. ఇక మరో స్థానం కోసం దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యల మధ్య పోటీ ఉంది. దినేశ్ కార్తీక్‌కు నిలకడ లేమి సమస్య. ఒక మ్యాచ్‌లో అదరగొడతాడు. తర్వాత తేలిపోతుంటాడు. స్వతహాగా వికెట్ కీపర్ అయినప్పటికీ.. అతను నిలకడగా రాణిస్తే బ్యాట్స్‌మన్‌గానే జట్టులో కొనసాగవచ్చు. ఆల్‌రౌండర్లయిన హార్దిక్ పాండ్య, కేదార్ జాదవ్‌లను కాదని కార్తీక్‌కు అవకాశం ఇవ్వాలంటే అతను ఎలా ఆడాలో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఒక పేసర్ లేదా స్పిన్నర్‌ను తగ్గించుకుని.. బ్యాటుతో, బంతితో ఉపయోగపడే ఆటగాడిని ఎంచుకోవాలనుకున్నపుడు పాండ్య, జాదవ్‌లకు అవకాశం దక్కుతుంది. వీళ్లిద్దరూ రెండు రకాలుగా రాణించి తమ ప్రాధాన్యాన్ని చాటుకోవాలి. ఈ మధ్యే ఫామ్ అందుకున్న రవీంద్ర జడేజా సైతం వీరితో పోటీకి వస్తున్నాడు. ప్రపంచకప్ ముందు అందరికీ అవకాశాలివ్వాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. రాబోయే 13 వన్డేల్లో వీలును బట్టి అందరినీ ఆడిస్తారు. ఎవరికి వాళ్లు అవకాశం వచ్చినపుడు సత్తా చాటుకోవాల్సి ఉంది. మరి చాన్నాళ్లుగా వేధిస్తున్న మిడిలార్డర్ సమస్యకు ఈ మ్యాచ్‌ల్లో పరిష్కారం దొరికి, ఆయా స్థానాలకు ఆటగాళ్లు ఖరారవుతారేమో చూడాలి.

13

ఇంగ్లాండ్‌లో ప్రపంచకప్ ఆరంభానికి ముందు టీమ్ ఇండియా ఆడనున్న వన్డేలు. ఆస్ట్రేలియాతో 8, న్యూజిలాండ్‌తో 5 మ్యాచ్‌లు ఆడనుంది.


ధోని


కార్తీక్


జాదవ్

అలసట మరిచి అవ్వతో...



సిడ్నీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనికి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులు. వారు తన దగ్గరకు వచ్చినప్పుడు నిరాశపరచకుండా పంపడం ధోని ప్రత్యేకత. గురువారం అలాంటి సంఘటనే చోటు చేసుకుంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో 87 ఏళ్ల మహిళాభిమాని మహిని చూడటానికి వచ్చింది. ప్రాక్టీస్ అయిన తర్వాత ఆమెతో ఆప్యాయంగా మాట్లాడుతూ కొంత సమయం గడిపిన ఝార్ఖండ్ స్టార్.. ఆ పెద్దావిడతో కలిసి ఫొటోలు దిగాడు. ప్రాక్టీస్‌లో అలసిపోయినా కూడా ధోని.. అభిమాని కోసం సమయాన్ని వెచ్చించడమే ఇక్కడ విశేషం.

ఇప్పుడు ఎన్ని పాత్రలో




బెంగళూరు: ప్రపంచ మహిళల టెన్నిస్ డబుల్స్‌లో తాను మళ్లీ నంబర్‌వన్ ర్యాంకు సాధించడం అంత తేలికేం కాదని స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా చెప్పింది. ప్రస్తుతం తాను చాలా పాత్రలు పోషిస్తున్నానని తెలిపింది. "చాలా వేగంగా, సమర్థంగా వివిధ పాత్రల్లో ఒదిగిపోతున్నా. భార్యగా, తల్లిగా తీరిక లేకుండా ఉన్నాను. ఆటలో మళ్లీ అత్యుత్తమ స్థాయికి చేరుకునే దిశగా కసరత్తులు కూడా ఆరంభించాను. మళ్లీ నంబర్‌వన్ ర్యాంకుకు చేరుకోవడం తేలికేం కాదని తెలుసు. అయినా పోరాడుతా. ఈ ఏడాది ఆఖరి కల్లా ఆటలో పునరాగమనం చేసే వీలుంది. నిజానికి వచ్చే ఏడాదిలో ప్రధాన టోర్నీల బరిలో దిగాలనుకున్నాను. నాపై ఎక్కువ ఒత్తిడి పెంచుకోకూడదని అప్పుడు ఆ నిర్ణయం తీసుకున్నా. తల్లి అయ్యాక నా జీవితం పూర్తిగా మారిపోయింది. స్పోర్ట్స్‌పర్సన్‌గా అందరిలా నేనూ స్వార్థంతో వ్యవహరించేదాన్ని. ఎప్పుడూ నా ఫిట్‌నెస్, నా పని, విశ్రాంతి.. ఇలా కేవలం నా గురించి మాత్రమే ఆలోచించేదాన్ని. ఇప్పుడు ఇంట్లోకి బుజ్జాయి వచ్చాడు. ఇక నా గురించి ప్రత్యేకంగా ఆలోచించే పరిస్థితి ఉండదు. తల్లిగా ఇకపై జీవితం నిస్వార్థంగా మారుతుంది" అని సానియా వివరించింది.

యూఏఈ చేతిలో భారత్ ఓటమి



అబుదాబి: ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్లో భారత జోరుకు బ్రేక్... తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసి మంచి ఊపు మీదున్న భారత్.. గురువారం ఆతిథ్య యూఏఈతో జరిగిన గ్రూప్-ఎ పోరులో 0-2 గోల్స్‌తో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో భారత్ గట్టిగానే పోరాడినా.. ర్యాంకింగ్స్‌లో తనకన్నా మెరుగైన యూఏఈ జట్టు ముందు నిలువలేకపోయింది. ఆరంభంలో రెండు జట్లకు సమానమైన అవకాశాలు వచ్చిన సద్వినియోగం చేసుకోలేకపోయాయి. అయితే 41వ నిమిషంలో ముబారక్ చేసిన గోల్‌తో యూఏఈ ఆధిక్యంలోకి వెళ్లింది. స్కోరు సమం చేయడానికి భారత్ విఫలయత్నం చేసింది. అయితే 88వ నిమిషంలో అలీ గోల్ చేసి భారత ఆశలపై నీళ్లు చల్లాడు. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్‌కు నాకౌట్ అవకాశాలు సజీవంగానే ఉన్నాయి. సోమవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో బహ్రెయిన్‌తో భారత్ గెలిస్తే ముందంజ వేస్తుంది.





సెమీస్‌లో నాదల్‌తో ఫెదరర్ ఢీ!

ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్లో స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్ (స్పెయిన్)తో తలపడే అవకాశాలున్నాయి. గురువారం విడుదల చేసిన ఈ టోర్నీ డ్రా ప్రకారం సెమీస్ వరకు డిఫెండింగ్ ఛాంపియన్ ఫెదరర్‌కు గట్టిపోటీదారులు లేరు. మూడో సీడ్‌గా బరిలో దిగుతున్న రోజర్.. సింగిల్స్ తొలి రౌండ్లో 99వ ర్యాంకర్ డెన్నిస్ ఇస్టోమిన్ (రష్యా)తో తలపడనున్నాడు. మరోవైపు గాయాల నుంచి కోలుకుని బరిలో దిగుతున్న రెండో సీడ్ నాదల్ తొలి రౌండ్లో డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)తో పోటీపడనున్నాడు. ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా)కు కాస్త క్లిష్టమైన డ్రా పడింది. అతనికి రెండో రౌండ్లోనే ఫ్రాన్స్ స్టార్ సోంగా ఎదురయ్యే అవకాశాలున్నాయి. అన్‌సీడెడ్‌గా పోటీలో ఉన్న ఆండీ ముర్రే.. తొలి రౌండ్లో బటిస్టా అగట్ (స్పెయిన్)తో తలపడనున్నాడు. మరోవైపు 24వ టైటిల్ గెలిచి.. మార్గరెట్ కోర్ట్ రికార్డును సమం చేయాలని ఉవ్విళ్లూరుతున్న అమెరికా తార సెరెనా విలియమ్స్‌కు కఠినమైన డ్రా పడింది. తొలి రౌండ్లో మారియా (జర్మనీ)తో ఆడనున్న సెరెనాకు రెండో రౌండ్లో బౌచర్డ్, మూడో రౌండ్లో అక్క వీనస్ విలియమ్స్, ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హలెప్ ఎదురయ్యే అవకాశాలున్నాయి. టాప్‌సీడ్‌గా పోటీలో ఉన్న హలెప్.. తొలి రౌండ్లో కనెపి (ఇస్తోనియా)తో ఆడనుంది.

మెయిన్‌డ్రాకు చేరువలో ప్రజ్నేశ

భారత యువ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు చేరువయ్యాడు. సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్లో ప్రజ్నేశ్ 6-3, 6-3తో లోపెజ్ పెరిజ్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించి ఆఖరి రౌండ్ చేరాడు. అతను చివరి రౌండ్లో యుసాకె వాటాంస్కి (జపాన్)తో తలపడనున్నాడు.

ఈనాడు



విజయవాడ గాంధీనగర్‌లో చేతులు లేని మిత్రుడు శంకర్‌కి అన్నం తినిపిస్తున్న రమేష్

స్నేహబంధం.. ఎంత మధురం..!

ఈ చిత్రంలో ఉన్న ఇద్దరు మిత్రులు విధివంచితులు.. ఒకరి పేరు శంకర్. విద్యుదాఘాతంతో రెండు చేతులను పూర్తిగా కోల్పోయారు. రెండో వ్యక్తి రమేష్. చిన్ననాటి నుంచి ఆయనకు కళ్లు సరిగా కనిపించవు. వీరిద్దరూ ప్రకాశం జిల్లా వాసులు.. బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం ఒంగోలు నుంచి విజయవాడకు వేర్వేరుగా చేరుకున్నారు. అనంతరం స్థానికంగా ఏర్పడిన పరిచయంతో స్నేహితులుగా మారారు. ప్రస్తుతం విజయవాడ నగరంలో దుకాణాల ముందు కాపలా తదితర చిన్నపాటి పనులు చేస్తూ వచ్చిన సొమ్ముతో కడుపు నింపుకుంటారు. ఎవరైనా దాత భోజనం పెడితే మిత్రులిద్దరూ కలిసే తింటారు. ఈ క్రమంలో.. రెండు చేతులు లేని శంకర్‌కి అమ్మలా అన్నం ముద్దలు కలిపి రమేష్ తినిపిస్తారు. కంటి చూపు సరిగా లేని రమేష్‌ని జాగ్రత్తగా ఇతర ప్రాంతాలకు శంకర్ తీసుకెళ్తుంటారు. ఇలా ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటూ.. తమ స్నేహబంధం ముందు వైకల్యం బలాదూర్ అని నిరూపిస్తున్నారు. –ఈనాడు అమరావతి

శాంతిభద్రతలతోనే అభివృద్ధి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ
- క్లిష్టమైన కేసులు ఛేదించిన వారికి ఏబీసీడీ పురస్కారాల ప్రదానం



సీఎస్ పునేఠ, డీజీపీ ఆర్.పి.ఠాకూర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ అన్నారు. ఈ క్రమంలో డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో "ఏబీసీడీ(అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్)" పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీజీపీ ఆర్.పి.ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనిల్‌చంద్ర పునేఠ మాట్లాడుతూ... విదేశాలకు దీటుగా రాష్ట్ర పోలీసు విభాగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం క్లిష్టమైన కేసుల ఛేదనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సంబంధిత పురస్కారాలను అందించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

ప్రథమ బహుమతి: నెల్లూరు జిల్లా చిన్న బజారు పోలీసుస్టేషన్ పరిధిలో.. రాజ్‌పురోహిత్ మహేంద్రసింగ్ అనే వ్యక్తిని కొందరు తుపాకీతో కాల్చి చంపారు. ఈ కేసును ఛేదించినందుకుగాను నెల్లూరు డీఎస్పీ ఎన్‌బీ.మురళీకృష్ణ, నవాబుపేట సీఐ ఎన్.వెంకటరావు, సంతపేట సీఐ బి.పాపారావు. కావలి రూరల్ సీఐ అశోక్ వర్ధన్ తదితరులకు ఈ పురస్కారం లభించింది.

ద్వితీయ బహుమతి: విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో పేరం నాగమణి అనే మహిళను హత్య చేసి, బంగారు ఆభరణాలను దోచుకున్న కేసును ఛేదించినందుకు విజయవాడ సీసీఎస్ ఏసీపీ ఎస్.ముక్బాల్, ఎస్సై వై.చిట్టిబాబు, ఏఎస్సై వి.రాంబాబు తదితరులు ఈ పురస్కారాన్ని పొందారు

తృతీయ బహుమతి: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన 5.25 కిలోల బంగారం దోపిడీ కేసు ఛేదనకు గాను.. చిత్తూరు స్పెషల్ బ్రాంచి డీఎస్పీ ఎన్‌టీవీ రామ్‌కుమార్, పలమనేరు గ్రామీణ సీఐ పి.శ్రీనివాస్, గుడిపాల ఎస్సై ఎన్.విక్రమ్, బంగారుపాళ్యం ఎస్సై వి.రామకృష్ణయ్య తదితరులు ఈ పురస్కారాన్ని పొందారు.

రూ.274 కోట్లతో గుంటూరు కాలువ విస్తరణ

- 50 వేల ఎకరాలకు ప్రయోజనం

ఈనాడు–అమరావతి: గుంటూరు కాలువను రూ.274.53 కోట్ల అంచనా వ్యయంతో 30 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ ప్రకారం కాలువను 47వ కిలోమీటరు నుంచి 77వ కిలోమీటరు వరకు విస్తరిస్తారు. ఈ మేరకు జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. విస్తరణకు సంబంధించి సర్వే పూర్తయి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)నివేదిక సిద్ధమయింది. కృష్ణా డెల్టా చీఫ్ ఇంజినీరు ప్రతిపాదనల మేరకు ఈ పథకానికి ఇప్పుడు పాలనామోదం వచ్చింది. ఈ కాలువను విస్తరించడానికి నాలుగు చోట్ల నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, యడ్లపాడు, చిలకలూరిపేట, ప్రకాశం జిల్లాలోని పర్చూరు మండలాల్లోని ఆయకట్టుకు దీని వల్ల ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు. దాదాపు 31 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందిస్తామని, 18,191 ఎకరాల స్థిరీకరణకు ఇది ఉపయోగపడుతుందని జలవనరులశాఖ పేర్కొంటోంది.

ఆర్థికశాఖ భవనాల నిర్మాణానికి రూ.121 కోట్లు

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని 9 జిల్లాల్లో ఆర్థికశాఖ భవనాల కాంప్లెక్సు నిర్మాణానికి తాజాగా రూ.121.41 కోట్లతో అంచనాలు సవరిస్తూ ఆర్థికశాఖ కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో తొలిదశలో భాగంగా 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో భవన సముదాయానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేశారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లాలో భవనానికి రూ.12.32 కోట్లకు అంచనా సవరించారు. 2018 అక్టోబరు నెలలో ఆర్థిక శాఖ కార్యదర్శి ఈ భవన నిర్మాణ పురోగతిని సమీక్షించారు. ఈ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని పేర్కొంటూ అదనపు సౌకర్యాలను కల్పించాలని నిర్దేశించారు. దీంతో రూ.121.41 కోట్లతో అంచనాలు సవరిస్తూ తాజా ఉత్తర్వులు ఇచ్చారు.

రాష్ట్రంలో పెరిగిన చలి

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో మళ్లీ చలి పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ మీదుగా ఇప్పుడు ఉత్తర, ఈశాన్య దిక్కుల చల్లని గాలులు వీస్తున్నట్లువాతావరణశాఖ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి సాధారణం కన్నా 1 నుంచి 4 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జంగమహేశ్వరపురం, అనంతపురం, ఆరోగ్యవరంలో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా బాపట్ల, నందిగామ, నంద్యాల, తిరుపతిలో 15 డిగ్రీలుగా ఉంది.

సైబర్ భద్రతకు ప్రత్యేక కార్యాచరణ

ఈనాడు–అమరావతి: ప్రభుత్వశాఖల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ భద్రతకు ఐటీ, ఎలక్ట్రానిక్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రతా విధానం-2013కి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సైబర్ భద్రతా విధానాన్ని తీసుకొచ్చింది. ఇందుకోసం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్వీసెస్ (ఏపీటీఎస్)కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వశాఖల వెబ్‌సైట్లు, వెబ్, మొబైల్ అప్లికేషన్లలోకి సైబర్ నేరగాళ్ల చొరబాట్ల నియంత్రణపై ఉద్యోగులకు అవగాహన కల్పించడం వంటివి ఇక ఏపీటీఎస్ చూడనుంది. కొత్త విధానంలో భాగంగా ప్రతి శాఖ నుంచి ఓ అధికారి, ఉద్యోగిని సైబర్ భద్రత బాధ్యతల్లో భాగస్వాములను చేయనున్నారు.

వైద్యవిద్యలో రిజర్వేషన్ల అమలు పరిశీలనకు కమిటీ

ఈనాడు, అమరావతి: వైద్య విద్య (ఎంబీబీఎస్/బీడీఎస్) కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించిన రిజర్వేషన్ విధానం అమలు తీరుపై పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైద్య విద్య సంచాలకులు (పరిపాలన), వైద్య విద్య సంచాలకులు (అకడమిక్), ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణపై అధ్యయనం చేసి, 3 నెలల్లోగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది.

భారీగా అందుబాటులోకి బీఆర్క్ సీట్లు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం ఎన్‌ఐటీలు, ఐఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) సీట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం స్వల్ప సంఖ్యలో సీట్లున్నాయి. ఒకవైపు పట్టణీకరణ పెరుగుతుండగా.. మరోవైపు ఆ రంగంలో నిపుణులు కొద్ది సంఖ్యలోనే ఉన్నారని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మొత్తం 18 జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విభాగాల(డీపీఏ)ను ప్రారంభించనుంది. ఒక్కో విభాగంలో మొదటి బ్యాచ్ కింద 120 మందికి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొంది. మొత్తం 18 సంస్థల్లో మొత్తం 2,160 సీట్లు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం జేఈఈ మెయిన్ పేపర్-2, జేఈఈ అడ్వాన్సుడ్ ఏఏటీ (ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా దేశంలోని 9 ఎన్‌ఐటీలు, మూడు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా), ఖరగ్‌పూర్.. రూర్కీ ఐఐటీలలో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్, అయిదేళ్ల బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. వాటిల్లో 1500 వరకు మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటికోసం ఏటా సుమారు 2 లక్షల మందికి పైగా పోటీ పడుతున్నారు. సీట్లను పెంచాలని నిర్ణయించిన కేంద్రం 2018-19 బడ్జెట్‌లో కొత్తగా రెండు స్పాలను, 18 ఎన్‌ఐటీలు, ఐఐటీల్లో కొత్త విభాగాలను ప్రారంభిస్తామని ప్రకటించింది. ఈక్రమంలో జనవరి 7లోపు ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర మానవ వనరుల శాఖ ఐఐటీలు, ఎన్‌ఐటీలను కోరింది. దీంతో జనవరి 3న వరంగల్ ఎన్‌ఐటీ ప్రతిపాదనలు సమర్పించింది.

కేంద్రం నియంతలా వ్యవహరిస్తోంది

- తెదేపా ఎంపీలు

ఈనాడు, దిల్లీ: ప్రజాస్వామ్య దేశంలో భాజపా ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని తెదేపా ఎంపీలు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తెదేపాపా నేత సుజనాచౌదరి, ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్ గురువారమిక్కడ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చమన్నందుకు 15 మంది తెదేపా ఎంపీలను లోక్‌సభ నుంచి నిర్దయగా సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. శీతాకాల సమావేశాల్లో మొత్తంగా 49 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని అలాంటప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం ఉందని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కీలకమైన ప్రత్యేకహోదా, విభజన చట్టాలను అమలు చేయకుండా తెదేపా ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే కేంద్రం యోచిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను హుద్‌హుద్, తిత్లీ తుపాన్లు అతలాకుతలం చేసినా కేంద్రం నుంచీ ఒక్క మంత్రీ పర్యటనకు రాలేదని ప్రస్తావించారు. ఆపత్సమయంలో నిధులివ్వని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. రైతుల డిమాండ్లపై కేంద్రం నాలుగేళ్లుగా మౌనం వహిస్తోందని, కాపులకు రిజర్వేషన్లపై ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసి పంపితే ఏడాదిగా దాన్ని కేంద్రం విస్మరించిందని ఎంపీలు తప్పుబట్టారు.

సంక్రాంతి సంబరాలు నిర్వహించండి

- కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం
- రూ.13.55 కోట్ల నిధులు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ సంబరాల నిర్వహణ కోసం జిల్లాకు రూ.కోటి చొప్పున, అలాగే రాష్ట్రస్థాయిలో సంబరాల నిర్వహణ కోసం రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక కమిషన్‌కు రూ.50 లక్షలు, వెలగపూడిలోని సచివాలయ సంఘానికి రూ.5 లక్షలు మొత్తమ్మీద రూ.13.55 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం గురువారం పాలనాపరమైన అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొబ్బరి ఆకులు, మామిడి ఆకుల తోరణాలతో వేదికలు సిద్ధం చేసి అక్కడ సంబరాలతోపాటు సంప్రదాయ గ్రామీణ పోటీలు నిర్వహించాలని స్పష్టంచేసింది. 'జన్మభూమి-మా ఊరు' ముగిశాక ఈ సంబరాలు నిర్వహించేందుకు వీలుగా ప్రజాప్రతినిధులతో చర్చించి తేదీలను ఖరారు చేయాలని సూచించింది. రంగవల్లులు, వంటలు, వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలతోపాటు గంగిరెద్దులు, హరిదాసుల ప్రదర్శనలు, బొమ్మల కొలువు, గొబ్బెమ్మలు ఏర్పాటుచేయించాలని ఆదేశించింది.





విజయవాడలో సహకార సంఘాల ఉద్యోగుల ప్రదర్శన

సమస్యల పరిష్కారంలో ఉదాసీన వైఖరి తగదు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు

విజయవాడ, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శించడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. విజయవాడ ధర్నాచౌక్‌లో రాష్ట్ర సహకార సంఘాల ఆధ్వర్యంలో 25 రోజులుగా నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆందోళనకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం ధర్నాచౌక్‌లో మాట్లాడారు. సహకార సంఘాల ఉద్యోగులందరికీ కనీస వేతనాలు అందించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ..సహకార ఉద్యోగుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.

'పీఏసీఎస్ ఉద్యోగుల వేతనాలు సవరించాలి'

ఈనాడు, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు సంరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. గురువారం ఆయన పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. జిల్లా సహకార బ్యాంకుల్లో ఐదో కేటగిరి పోస్టుల్లో సగం పీఏసీఎస్ ఉద్యోగులతో భర్తీ చేయాలని, సహకార సంఘాన్ని మూసివేయాలన్న సిఫార్సులను తొలగించాలన్నారు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



బిహారీ సంప్రదాయ చిత్రకళ మధుబని స్ఫూర్తితో రూపొందిన మిథిలా కలెక్షన్ సందడి చేస్తోంది. చేపలు.. పక్షుల మోటిఫ్‌లే ప్రధానాకర్షణగా తీర్చిదిద్దిన ఈ వస్త్రశ్రేణి సంప్రదాయ వేడుకలకు చక్కగా నప్పుతుంది. మరెందుకాలస్యం.. చేర్చేయండి మీ వార్డ్‌రోబ్‌లోకి!

ఫ్యాషన్ ఫ్యాషన్

మనసు దోచే మిథిలా కలెక్షన్!

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld









స్క్రీన్ ప్రింటింగ్‌తో వర్ణరంజితంగా డిజైన్ చేసిన కుర్తీకి అంచు ప్రత్యేకం!

పక్షుల మోటిఫ్‌లతో ముచ్చటగా తీర్చిదిద్దిన పొడవాటి కుర్తీ!

ఆధునిక హంగులతో అద్భుతంగా రూపొందిన కుర్తీ!


ఆకట్టుకునే టాప్‌కి.. కుచ్చులు, పక్షుల మోటిఫ్‌లు అదనపు ఆకర్షణ.

ఈ దుస్తులు అన్ని కళాంజలి షోరూంలలో లభిస్తాయి

రంగవల్లిక



- శ్రీరంభట్ల దీప్తి పాటిల్
హ్యూస్టన్, అమెరికా



19 చుక్కలు, 9 వరుసలు, 9 వచ్చేవరకు.

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
email: vasundhara@eenadu.net

ముత్యాల ముగ్గుల పోటీ

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ జనవరి 9, 2019 విజేతలు

1. ఎం.మీనా, నవగాం, పాలకొండ 2. జి.లక్ష్మి, నంద్యాల 3. పి.ఎన్.వి.లక్ష్మి, రాజమహేంద్రవరం 4. పి.సుస్మిత, విజయవాడ 5. జి.భువనహేమశ్రీ, మాధవరాయుడుపల్లి, తూ.గో.జిల్లా 6. జి.బి.మనస్విని, పోతవరం, గుంటూరు 7. వి.మధుబాల, లింగసముద్రం, ప్రకాశం 8. వి.హారిక, ఊళ్ళపల్లి, తూ.గో.జిల్లా 9. వి.కృష్ణవేణి, చిలకలూరిపేట 10. డి.హరిత, ముమ్మిడివరం, తూ.గో.జిల్లా

బొట్టు బిళ్ల పెట్టుకుంటే మచ్చపడింది!

నాకు నలభై ఏళ్లు. చిన్నతనం నుంచి బొట్టు బిళ్లలు పెట్టుకొనే అలవాటు ఉంది. ఆరునెలల క్రితం బొట్టు బిళ్ల పెట్టుకున్న చోట మచ్చలా కనిపించింది. నేను పట్టించుకోలేదు. క్రమంగా మచ్చ పెద్దది కావడమే కాదు... నల్లగా మారిపోయింది. నేను తెల్లగా ఉండటంతో ముఖం మీద అది ఎబ్బెట్టుగా కనిపిస్తోంది. ఇలా ఎందుకైంది. మచ్చను పోగొట్టుకోవాలంటే ఏం చేయాలి.

– ఓ సోదరి

మీ సమస్య పోస్ట్ ఇన్‌ఫ్లమేటరీ హైపర్ పిగ్మెంటేషన్. మీకు ఎప్పట్నుంచో ఈ సమస్య ఉండి ఉంటుంది. దాన్ని పట్టించుకోకపోవడం వల్ల ఇలా నల్లగా పిగ్మెంటేషన్‌గా మారింది. కాబట్టి మీరు వెంటనే బొట్టుబిళ్లలు పెట్టుకోవడం మానేయండి. మచ్చ పడిన చోట మాయిశ్చరైజర్, వైట్ పెట్రోలియం జెల్లీ రాయాలి. ఒకవేళ బొట్టు బిళ్ల పెట్టుకోవడం తప్పనిసరైతే మాత్రం... ముందుగా మాయిశ్చరైజర్ లేదా సన్‌స్క్రీన్ లోషన్ రాసి ఆ పైన పెట్టుకోండి. దాని వల్ల చర్మంపై అంతగా ప్రభావం పడదు. అలర్జీ బాధించదు. అలానే ఇంటికి రాగానే తీసి... ముఖం శుభ్రంగా కడుక్కుని తుడి చేసుకోవాలి. ఆ ప్రాంతంలో తేమ లేకుండా చూసుకోవాలి. దాంతోపాటు ఉదయం, సాయంత్రం బాదం నూనెతో బాగా మర్దన చేసుకోవాలి. కోజిక్ యాసిడ్, విటమిన్ సి ఉన్న క్రీములు రాసుకోవాలి.

ఎండలోకి వెళ్లేటప్పుడు మచ్చ ఉన్న చోట తప్పనిసరిగా సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. లేదంటే ఇంకా నల్లబడే అవకాశం ఉంటుంది. ఇలా కొన్నాళ్లు జాగ్రత్తలు తీసుకుంటే చర్మం చికిత్సకు సిద్ధమవుతుంది. అప్పుడు కెమికల్ పీల్ చేయించుకుంటే మచ్చలు పూర్తిగా తొలగిపోతాయి.

ఇంట్లో ఉన్నప్పుడు తేనెలో ఐదారు చుక్కల నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవాలి. పది నిమిషాల య్యాక చల్లటి నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తుంటే మంచి ఫలితముంటుంది. రెండు చెంచాల బొప్పాయి గుజ్జులో చెంచా చొప్పున పాల పొడి, బాదం పొడి కలిపి పూతలా వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మచ్చ క్రమంగా తగ్గుతుంది.

ఇవి తెలుసుకోవాలి: బొట్టుబిళ్లలు పెట్టుకొనే ప్రతి ఒక్కరూ కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

చాలామందికి బొట్టుబిళ్లల వల్ల అలర్జీ వస్తుంది. అయితే మొదట్లో దాని ప్రభావం తక్కువగా ఉండటంతో గుర్తించలేం. దాంతో క్రమంగా శాశ్వత సమస్యలా మారిపోతుంది. అలాంటప్పుడే ఇలా మచ్చలా పడి.. ఇబ్బంది పెడుతుంది. కొందరికి పుట్టుకతోనే అలర్జీ ఉంటుంది. అలాంటి వారు తరచూ బొట్టుబిళ్లలు వాడటం వల్ల కాంటాక్ట్ డెర్మటైటీస్ రావడానికి ఎక్కువ అవకాశాలుంటాయి.

అలానే బొట్టుబిళ్లలను పీవీసీ మెటీరియల్‌తో తయారు చేస్తారు. అది పీటీబీపీ అనే కెమికల్‌తో తయారవుతుంది. ఈ రసాయనం, బొట్టుబిళ్ల వెనుక ఉన్న జిగురు వల్ల అలర్జీలు వస్తాయి. సమస్య గుర్తించిన వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. లేదంటే దురద ఎక్కువై.. ప్యాచ్‌లా పడుతుంది. కొన్నిసార్లు ఇరిటేషన్, బొబ్బ, ర్యాష్‌లా వచ్చి. . ఎగ్జిమా, ఎటోపిక్ డెర్మటైటీస్‌కు దారితీస్తుంది. అందుకే బొట్టుబిళ్లలు వాడే ప్రతి ఒక్కరూ ముందు మాయిశ్చరైజర్ రాసి ఆ తరువాత దాన్ని పెట్టుకోవాలి.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

- మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

బ్యాక్‌ప్యాక్ కాలేజీకే కాదు...



అవసరం, సౌకర్యం, ఫ్యాషన్.... ఇవన్నీ కలగలిపితేనే హ్యాండ్‌బ్యాగ్. వీటిని ఎంచుకునేటప్పుడు కొన్ని విషయాలు మాత్రం తప్పనిసరిగా గుర్తుపెట్టుకోవాలి. అవేంటంటే...

- బ్యాగుని ఎంచుకునేటప్పుడు కంటికింపుగా కనిపించడమే కాదు నాణ్యతకు, సౌకర్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వేసుకుంటే అది మీకో ప్రత్యేకతను తెచ్చిపెట్టాలి. అందుకే శరీరాకృతికి తగ్గట్లు ఎంచుకోవడం మంచిది.
- ఎత్తు తక్కువగా ఉన్నవారికి మరీ పెద్దగా ఉండే బ్యాగులు అంత బాగోవు. సన్నగా, పొడవుగా ఉండి చక్కని ఆకృతిలో ఉండేవారికి కాస్త పొట్టి బ్యాగులు బాగుంటాయి.
- ఇప్పుడు బ్యాక్‌ప్యాక్‌లు, స్లింగ్ రకాలే ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిల్లో నలుపు, ముదురు, ఎరుపు, గోధుమ వంటి రంగులే కాదు... ముదురాకుపచ్చ, నీలం, లేత గులాబీ వంటి మరెన్నో వర్ణాలు సందడి చేస్తున్నాయి. అంతెందుకు కాస్త డిజైన్లూ కావాలనుకుంటే ఫ్లోరల్, డిజిటల్ రకాలనూ ఎంచుకోవచ్చు. ఇప్పుడు ఆఫీసుకైనా, కాలేజీకైనా స్లింగ్ బ్యాగ్‌ని ఎంచుకోవడమే ఫ్యాషన్. వీటిల్లోనే బ్యాక్‌ప్యాక్‌లా వాడుకునే డిజైన్‌లూ ఉన్నాయి. మీ ఆసక్తి, అభిరుచిని బట్టి ఎంచుకుంటే చాలు.

లెక్కేసుకుని తినకండి...!

సన్నగా మారాలనుకుంటే...కేవలం అతిగా వ్యాయామం చేస్తేనో, అసలు తినడం మానేస్తేనో ఫలితం ఉంటుందనుకుంటే పొరబాటు. అలా చేయడం వల్ల కొన్నిసార్లు మీ అరోగ్యానికే ప్రమాదం.



ఆహారం: బరువు తగ్గాలనే ఆలోచన ఉన్నప్పుడు ఆహారం విషయంలో కచ్చితంగా పరిమితి అవసరం. అలా అని కెలొరీలు, కార్బోహైడ్రేట్‌లు లెక్కేసుకుని తినడం సరికాదు. దీనివల్ల తగినన్ని పోషకాలు శరీరానికి అందవు. అలానే జంక్‌ఫుడ్, మితిమీరిన తీపి, ప్రాసెస్ చేసిన పదార్థాలు తినడానికి మాత్రం నిరభ్యంతరంగా నో చెప్పండి. లేదంటే పోషకాల లేమి మిమ్మల్ని అనారోగ్యాల బారిన పడేటట్లు చేస్తుంది.

వ్యాయామం: తీసుకున్న ఆహారానికి తగినంత శ్రమ లేకపోతే శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గి టెస్టోస్టెరాన్ హార్మోన్ స్థాయిలు శరీరంలో పెరిగిపోతాయి. ఫలితంగా ఒత్తిడి, అధికబరువు, నెలసరి క్రమం తప్పడం వంటి వెన్నో ఇబ్బందులు ఎదురుకావొచ్చు. అలాని మితిమీరి వ్యాయామం చేయడం కూడా మంచిది కాదు. మీరు తిన్న ఆహారానికి, మీ ఆరోగ్యానికి ఎంత మేరకు అవసరమో దానికనుగుణంగా మీ వ్యాయామ ప్రణాళిక ఉండాలి. అంటే...అది ఏ రకమైన వ్యాయామం అయినా సరే! కనీసం అరగంటసేపైనా మీ రోజువారీ జీవితంలో భాగం అయ్యేట్లు చూసుకోండి.

నజరానా

మసాలా కూరలు రుచిగా రావాలంటే పెరుగు, కాస్త వరి పిండి కలిపి వేస్తే సరి!



బంగారం వెండి

10న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	33,340	33,000	32,900	32,500
ఆర్నమెంట్	31,140	30,820	30,500	30,200
వెండి (కిలో)	40,460	40,260	40,800	40,200

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	32,800	32,570	33,190	32,950
ఆర్నమెంట్	30,320	30,140	30,760	30,510
వెండి (కిలో)	40,500	40,100	40,400	40,300

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	33,060	32,740	-------	-------
ఆర్నమెంట్	30,750	30,450	3,076	3,051 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.80	42.50 గ్రా

ఈనాడు సినిమా



పూజా హెగ్డే

భలే నవ్విస్తుంటారు

తెలుగులో దూసుకుపోతున్న పరభాషా కథానాయికల్లో పూజా హెగ్డే ఒకరు. అల్లు అర్జున్, నాగచైతన్య, ఎన్టీఆర్, మహేష్, చరణ్... ఇలా స్టార్ కథా నాయకులతోనే ప్రయాణిస్తోంది. తక్కువ సమయంలోనే తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకున్న పూజా ప్రస్తుతం మహేష్ బాబుతో కలసి 'మహర్షి'లో నటిస్తోంది. 'మీరు కలసి నటించిన కథానాయకుల్లో కనిపించిన ఉమ్మడి లక్షణం ఏమిటి?' అని అడిగితే... "వాళ్లలో హాస్యచతురత బాగుంటుంది. సెట్లో చాలా సరదాగా ఉంటారు. నన్ను నవ్విస్తుంటారు. 'ఈరోజు షూటింగ్‌కి వెళ్లాలా? ఇంత పెద్ద సీన్ చేయాలా' అనే భయాలేవీ రాకుండా ఉన్నానంటే కారణం... నా కథానాయకులే. ఒకొక్కరిదీ ఒక్కో స్టైల్. ఎవరూ తమ ఇమేజ్ గురించో, స్టార్‌డమ్ గురించో ఆలోచించరు. నాతోనే కాదు, సెట్లో ఉన్న వాళ్లందరితోనూ సరదాగా ఉంటారు. తెలుగువాళ్లలో సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువనుకుంటా. సినిమాల్లోనూ అదే కనిపిస్తుంటుంది" అని చెప్పుకొచ్చింది పూజ.



కల్యాణి కోడూరి, నరేంద్ర, కీర్తి సురేష్, కల్యాణ్‌రామ్, మహేష్ కోనేరు

ప్రతి అమ్మాయి జీవితంలోనూ

కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సంస్థ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టింది. నరేంద్ర దర్శకుడు. మహేష్ కోనేరు నిర్మాత. గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రముఖ కథానాయకుడు కల్యాణ్ రామ్ క్లాప్ కొట్టారు. వెంకీ అట్లూరి, బీవీఎస్ఎన్ ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ "మహానటి' తరవాత నేను నటిస్తున్న మహిళా ప్రధానమైన చిత్రమిది. కథ నాకు బాగా నచ్చింది. ప్రతి అమ్మాయి జీవితంలో ఎదురయ్యే సంఘటనలే తెరపై కనిపిస్తాయి. ఎక్కువ భాగం అమెరికాలో తెరకెక్కిస్తార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మూడేళ్ల నుంచీ ఈ కథపై కసరత్తు చేస్తున్నా. అన్నిరకాల భావోద్వేగాలూ ఇందులో ఉంటాయి. కుటుంబ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. వచ్చే నెలలో చిత్రీకరణ మొదలవుతుంది. ఏప్రిల్‌లో అమెరికా వెళ్లబోతున్నాం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ప్రతి అమ్మాయి తన కథని తాను తెరపై చూసుకున్నట్లు ఉంటుంది. కీర్తి సురేష్ సినీ ప్రయాణంలో మంచి పాత్రగా మిగిలిపోతుంది. మిగిలిన నటీనటుల వివరాలు త్వరలో ప్రకటిస్తామ"న్నారు. "ప్రేక్షకుల్ని మెప్పించే పాటల్ని అందిస్తాన"న్నారు కల్యాణి కోడూరి.



దిల్‌రాజు, అనిల్ రావిపూడి, మెహరీన్, వరుణ్ తేజ్, వెంకటేష్, తమన్నా, రాజేంద్ర ప్రసాద్, శిరీష్

మళ్లీ చేయమంటారేమో అని భయపడ్డాను

– వెంకటేష్

"సంక్రాంతికి నా నుంచి వచ్చిన ప్రతి చిత్రాన్నీ ప్రేక్షకులు ఆదరించారు. ఈసారి వస్తున్న 'ఎఫ్ 2' కూడా అలానే విజయవంతమవుతుందన్న నమ్మకం ఉంద"న్నారు వెంకటేష్. ఆయన వరుణ్‌తేజ్‌తో కలసి నటించిన చిత్రమిది. తమన్నా, మెహరీన్ కథానాయికలు. దిల్‌రాజు నిర్మాత. అనిల్ రావిపూడి దర్శకుడు. 12న విడుదల అవుతోంది. గురువారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. వెంకటేష్ మాట్లాడుతూ "ఓ కథ వింటున్నప్పుడు ప్రేక్షకుడిలానే వింటా. దర్శకుడితో స్నేహితుడిలా అభిప్రాయాలు పంచుకుంటా. అనిల్ రావిపూడిలో ఏదో ఓ మాయ ఉంది. తను వినోదాన్ని అత్యున్నత స్థాయిలో చూపించాడు. సాధారణంగా కామెడీ పండించడం చాలా కష్టం. ఒకట్రెండు టేకుల్లో సీన్ ఓకే అయిపోవాలి. లేదంటే మళ్లీ రాదు. ఓ సీన్ చేశాక అనిల్ సహాయ దర్శకులతో చర్చించేవాడు. దాంతో 'మళ్లీ చేయమంటారేమో. అయిపోయాన్రా నేను' అనే భయం వేసేది" అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "తొలిసారి ఓ మాస్ పాత్ర ప్రయత్నించా. ఈ సినిమా షూటింగ్ ఎలా మొదలైందో, ఎలా అయిపోయిందో అర్థం కావడం లేదు. అనిల్ రూపంలో ఓ మంచి స్నేహితుడు దొరికాడు. మా ఇంట్లో రాజేంద్ర ప్రసాద్‌గారు నటించిన సినిమా సీడీలు ఉంటాయి. నవ్వుకోవాలని అనిపిస్తే ఆయన సినిమాలు చూసేవాణ్ని. అలాంటి నటుడితో కలసి పని చేయడం ఆనందంగా ఉంది. వెంకటేష్‌గారి 'ఇంట్లో ఇల్లాలు - వంటింట్లో ప్రియురాలు', 'వాసు' సినిమాల్లో నన్ను నటించమని అడిగారు. కానీ కుదర్లేదు. ముచ్చటగా మూడోసారి వెంకటేష్‌గారితో నటించే అవకాశం వచ్చింద"న్నారు. తమన్నా మాట్లాడుతూ "కొన్ని సినిమాలు మైలురాళ్లుగా మిగిలిపోతాయి. అలాంటి సినిమా ఇది. 'ఊపిరి' తరవాత ఈ సినిమాలో డబ్బింగ్ చెప్పుకున్నాను. చాలా పార్శ్వాలున్న పాత్ర దక్కింది. 'ఎఫ్ 3' తీస్తే బాగుంటుంది. మళ్లీ మేమంతా కలసి పనిచేసే అవకాశం వస్తుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఎఫ్ 2'ని 80 శాతం కామెడీతోనే నింపేశాం. టైమింగ్ ఉన్న గొప్ప నటులు ఈ సినిమాలో పనిచేశారు. వెంకీ - తమన్నా మధ్య ఉండే కెమిస్ట్రీ, కామెడీని ప్రేక్షకులు బాగా ఆస్వాదిస్తారు. వరుణ్ తెలంగాణ యాసతో ఆకట్టుకుంటాడ"న్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "ఓ సినిమా సిద్ధం అవ్వడానికి 24 విభాగాలూ పూర్తిగా కష్టపడాల్సిందే. ఈ సినిమాకీ మేమంతా అలానే కష్టపడ్డాం. 'కలియుగ పాండవులు'తో వెంకటేష్‌గారి అభిమానిని అయ్యా. వారం రోజుల ముందే టికెట్ బుక్ చేసుకుని అభిమానిగా చూశా. ఆయనతో రెండోసారి పనిచేసే అవకాశం దక్కింది. కథ విన్న వెంటనే 'నా పాత్ర ఏంటి' అని అడక్కుండా ఒప్పుకున్నాడు వరుణ్. అనిల్ దగ్గర ఓ మ్యాజిక్ ఉంది. పూర్తి స్క్రిప్టు లేకుండా సినిమా తీయడానికి నేను ఒప్పుకోను. అలాంటి నన్ను కేవలం సన్నివేశాలు చెప్పి ఒప్పించేస్తాడ"న్నారు. ఈ కార్యక్రమంలో మెహరీన్, రాజేంద్ర ప్రసాద్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



బోయపాటి శ్రీను

నా కథలకు కుటుంబమే పునాది

మాస్, యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ బోయపాటి శ్రీను. 'భద్ర' నుంచి 'జయ జానకి నాయక' వరకూ ఆయన కథల్లో కొండంత హీరోయిజం కనిపిస్తుంటుంది. కథానాయకుణ్ని ప్రేమించి, అభిమానుల్లో ఓ అభిమానిగా మారి సినిమాలు తీస్తుంటారాయన. అవన్నీ వాణిజ్యపరంగా బాక్సాఫీసు దగ్గర మంచి విజయాల్ని అందుకుంటాయి. రామ్‌చరణ్‌ని 'వినయ విధేయ రామ'గా చూపించనున్నారు. శుక్రవారం ఈ చిత్రం విడుదల కానుంది. ఈసందర్భంగా బోయపాటి శ్రీను ఏమన్నారంటే.

ఈ రాముడు ఎవరికి విధేయుడు?

ఎవరు తనను నమ్ముకుంటారో వాళ్లకి. కుటుంబం, అన్నావదినలు, ప్రేమికురాలు ఇలా ఎవరైనా కావొచ్చు. తనది అనుకున్న దాన్ని సాధించడానికి ఎంత దూరమైనా వెళ్తాడు. ఏమైనా చేస్తాడు.

మీ సినిమాల్లో లెక్కలేనంతమంది నటీనటులు కనిపిస్తుంటారు. 'వినయ విధేయ..' ప్రచార చిత్రాల్లోనూ అదే కనిపిస్తోంది. వాటితో పాటు ప్రత్యేకంగా ఈ సినిమాలో ఏముంటాయి?

నా ప్రతి కథకీ కుటుంబమే పునాది. సమాజంలోని అంశాలు కనిపిస్తాయి. 'వినయ విధేయ రామ' కూడా కుటుంబ కథే. చరణ్ అన్నయ్యలుగా ప్రశాంత్, ఆర్యన్ రాజేష్ కనిపిస్తారు. వదిన పాత్రలూ బాగా వచ్చాయి. వాటిలో స్నేహ, హిమజ, ప్రవీణ నటించారు. సామాజిక స్పృహతో ఉన్న పాత్రని నటి హేమ పోషించింది. ప్రతినాయకుడిగా వివేక్ ఒబెరాయ్‌ని అనుకున్నాం. కానీ ఆయన అలాంటి పాత్రలు చేయడంలేదు. అయినా సరే.. ఓసారి కలసి కథ వినిపించాను. బాగా నచ్చి వెంటనే కాల్షీట్లు సర్దుబాటు చేశారు. యాక్షన్ దృశ్యాలు వేటికవి ప్రత్యేకంగా ఉంటాయి. మరీ ముఖ్యంగా అజర్‌బైజాన్‌లో తెరకెక్కించిన పోరాట ఘట్టం అభిమానుల్ని మైమరిపిస్తుంది. దేవిశ్రీప్రసాద్‌తో నేను చేసిన ఐదు చిత్రాలూ హిట్లే. ఈ సినిమాలోనూ మంచి సంగీతం అందించాడు. సంభాషణలు ఆకట్టుకుంటాయి. రామ్ చరణ్ పాత్రకు తగినట్టు తన దేహాన్ని తీర్చిదిద్దుకున్నారు. తెరపై చరణ్ ఐరన్‌మ్యాన్‌లా కనిపిస్తారు. ఈ చిత్రానికి కర్త కర్మ క్రియ అన్నీ రామ్ చరణ్.

యువ కథానాయకులతో ప్రేమకథలు తీసే ప్రయత్నాలు చేయటం లేదు ఎందుకని?

బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'జయ జానకి నాయక' తీశాను. తను ప్రేమించిన అమ్మాయి ఎక్కడున్నా సుఖంగా ఉండేందుకు తన వెంటే ఉండి పోరాడే ప్రేమికుడి కథ అది. చేస్తే దాన్ని మించిన ప్రేమకథలే చేయాలి. అలాంటి కథల గురించే ఇటీవల నేను, రామ్‌చరణ్ మాట్లాడుకున్నాం. త్వరలో మేమిద్దరం అలాంటి ప్రేమకథ చేస్తామేమో.

అగ్ర దర్శకులు అప్పుడప్పుడూ చిన్న సినిమాలు చేస్తున్నారు. మీకూ అలాంటి ఆలోచనలున్నాయా? బయోపిక్‌లు చేయమని ఎవరైనా అడిగారా?

నేను ఏ సినిమా చేసినా, ఎవరితో చేసినా ప్రేక్షకులు ఆ సినిమాని వాళ్ల గుండెల్లో పెట్టుకుంటున్నారు. చిన్న సినిమాలు చేసినా అవీ ఇట్లానే ఉండాలి. హంగు, ఆర్భాటాలు లేకుండా చిన్న సినిమాలు తీసి ప్రేక్షకుల్ని సంతృప్తిపరచడం సాధ్యమా? అని ప్రశ్నించుకుంటే కాదనే సమాధానమే వస్తోంది. అందువల్లే చిన్న సినిమాలు చేయను. బయోపిక్ సినిమాలు చేయాలని నాకూ ఉంది. కథలో దమ్ముంటేనే బయోపిక్స్ చేయాలి. అవి దొరికినప్పుడే చేస్తా. అన్ని జోనర్లూ చేసేందుకు అన్నీ కుదరాలి.

మీ ప్రతి కథనీ చిరంజీవికి వినిపిస్తారు కదా. ఈ కథనీ చెప్పారా? ఆయన ఎలాంటి సలహాలు ఇచ్చారు?

ప్రతి కథనీ సెట్‌కి వెళ్లే ముందు చిరంజీవి గారికి వినిపిస్తాను. ఆయన విలువైన సలహాలిస్తారు. 'సరైనోడు' కథ విన్నాక కొన్ని సూచనలు చేశారు. 'వినయ విధేయ రామ' కథ ఆయనకు చెప్పాను. ప్రతి సన్నివేశం జాగ్రత్తగా విన్నారు. అంతా అయిపోయాక 'బాగా సిద్ధం చేశావు. మార్పులు చెప్పేందుకు అవకాశమే లేదు' అని మెచ్చుకున్నారు.

చిరంజీవితో సినిమా ఎప్పుడు?

కొన్ని కథల గురించి చిరంజీవిగారితో మాట్లాడుతున్నాను. ఇప్పుడాయన 'సైరా నరసింహారెడ్డి' పనిలో నిమగ్నమయ్యారు. ఆయన స్థాయిలో సరైన కథ పక్కాగా ఖరారయిన తర్వాతే అది పట్టాలెక్కుతుంది.



రకుల్‌ప్రీత్ సింగ్, కార్తి

ప్రేమికుల రోజున 'దేవ్'

'ఖాకి' కోసం తొలిసారి జంటగా నటించారు కార్తి, రకుల్‌ప్రీత్ సింగ్. ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు మరోసారి జోడీ కట్టారు. వీరిద్దరూ కలసి నటించిన చిత్రం 'దేవ్'. నిక్కీ గల్రాని, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రధారులు. రజత్ రవిశంకర్ దర్శకత్వం వహించారు. ఎస్.లక్ష్మణ్ కుమార్, ఠాగూర్ మధు నిర్మాతలు. ఈనెల 14న పాటల్ని విడుదల చేస్తారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రమిది. కుటుంబ అనుబంధాలకూ స్థానం ఉంది. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వచ్చింది. కార్తి, రకుల్ జంట మరోసారి ఆకట్టుకుంటుంద"న్నారు. సంగీతం: హరీష్ జయరాజ్

పంచ్ డైలాగ్

గాయపడిన సింహం నుంచి వచ్చే శ్వాస గర్జన కంటే భయంకరంగా ఉంటుంది.

చిత్రం: కె.జి.ఎఫ్, – పంపినవారు: బీఏఎస్ ప్రసాద్, చాగల్లు

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

చుల్‌బుల్ పాండే మరొక్కసారి



సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ మరో సారి చుల్‌బుల్ పాండేగా చెలరేగిపోనున్నాడు. ఖాకీ యూనిఫాంలో తెరపై సందడి చేస్తూ తన స్టైల్‌లో పంచ్‌లు, ఫైట్లతో అభిమానులను ఖుషీ చేయనున్నాడు. సల్మాన్ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిన 'దబాంగ్' సిరీస్‌లో మూడో చిత్రానికి రంగం సిద్ధమైంది. అందరూ ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దబాంగ్ 3' ఏప్రిల్‌లో సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ విషయాన్ని సల్మాన్ సోదరుడు, 'దబాంగ్' నిర్మాత అర్బాజ్ ఖాన్ వెల్లడించారు. మూడో 'దబాంగ్'లోనూ చుల్‌బుల్ పాండేకు జోడీగా సోనాక్షి సిన్హా అలరించనుంది. సల్మాన్‌తో 'వాంటెడ్' చిత్రాన్ని తెరకెక్కించిన ప్రభుదేవా దీనికి దర్శకత్వం వహించనున్నారు. అర్బాజ్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా లొకేషన్ల ఎంపికలో చిత్రబృందం బిజీగా ఉంది. కాగా సల్మాన్ నటిస్తున్న 'భారత్' చివరి షెడ్యూల్ చిత్రీకరణలో ఉంది. ఆ సినిమా పూర్తయ్యాక 'దబాంగ్ 3' పైనే పూర్తి దృష్టిపెట్టనున్నారు సల్మాన్. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఏడాదిలోనే చుల్‌బుల్ పాండేను మళ్లీ తెరపై చూడొచ్చు.

అంతా రహస్యం

సాగర్ శైలేష్, శ్రీరితిక జంటగా నటించిన చిత్రం 'రహస్యం'. సాగర్ శైలేష్ దర్శకుడు. భీమవరం టాకీస్ పతాకంపై తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మించారు. హైదరాబాద్‌లో ప్రముఖ కథానాయకుడు శ్రీకాంత్ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "తుమ్మలపల్లి రామసత్యనారాయణ ప్రణాళికాబద్ధంగా చిత్రాల్ని నిర్మిస్తుంటారు. 'రహస్యం' ప్రచార చిత్రాలు బాగున్నాయి. విజయం సాధించే లక్షణాలు కనిపిస్తున్నాయ"న్నారు. "ఇదో థ్రిల్లర్. అనుక్షణం ఆసక్తికరంగా నడుస్తుంది. ఈనెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు నిర్మాత.



సాగర్ శైలేష్, శ్రీరితిక



మోదీతో ముచ్చటగా

ప్రధాని నరేంద్రమోదీని బాలీవుడ్ యువ తారలు, దర్శకులు గురువారం దిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా అందరూ కలసి ఆయనతో ఓ సెల్ఫీ దిగారు. ఆ ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్, వరుణ్‌ధావన్, విక్కీ కౌషల్, ఆయుష్మాన్ ఖురానా, రాజ్‌కుమార్ రావ్, సిద్ధార్థ్ మల్హోత్రా, ఆలియా భట్, భూమి పెడ్నేకర్‌తో పాటు దర్శకులు రోహిత్ శెట్టి, అశ్వనీ అయ్యర్ తివారీ తదితరులు మోదీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ మధ్యే బాలీవుడ్ ప్రముఖ దర్శక నిర్మాతలు కొంతమంది మోదీని కలసి బాలీవుడ్ సినిమా సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఒక్క మహిళ కూడా లేకపోవడంతో విమర్శలు వచ్చాయి. అందుకేనేమో ఈసారి ఆయనతో భేటీ అయినవారిలో మహిళలూ ఉన్నారు.

ఇసుక మాఫియాపై



మధుర్ భండార్కర్

'చాందినీ బార్', 'ట్రాఫిక్ సిగ్నల్', 'ఫ్యాషన్' తదితర చిత్రాలతో సామాజిక సమస్యలను కొత్త కోణంలో చూపించారు మధుర్ భండార్కర్. తన తదుపరి ప్రయత్నంగా మరో భిన్నమైన చిత్రాన్ని తెరకెక్కించడానికి సిద్ధమౌతున్నారు. ఇటీవలి కాలంలో ఇసుక మాఫియా ఆగడాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఆ నేపథ్యంలోనే స్క్రిప్టును తయారు చేసుకుంటున్నారు భండార్కర్. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఇసుక మాఫియా చుట్టూ ఈ కథ సాగుతుందట. అందుకోసం భండార్కర్ ఆరు నెలలుగా పరిశోధన చేశారట. సహజత్వం కోసం ఎక్కువ భాగాన్ని ఉత్తర్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారని సమాచారం. ఒక ప్రముఖ కథానాయకుడు ఈ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే తారాగణం, లొకేషన్ల ఎంపిక ఖరారు చేసి ఈ వేసవిలో సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లనున్నారని సమాచారం.

చిట్కా

బ్రేక్ ఫెయిలైనా.. ఆపొచ్చు!



వేగంగా వెళ్తున్న కారు ఇంజిన్ బ్రేక్ ఉన్నట్టుండి ఫెయిలైతే ఏమవుతుంది? ముందు బండి నడుపుతున్న వ్యక్తి గుండెలదిరిపోతాయి. గాబరా పడతాడు. దురదృష్టవశాత్తు అప్పుడే ఏదైనా అడ్డొస్తే ప్రమాదమూ జరగొచ్చు. ఈ దుస్థితి నుంచి తప్పించుకోవడానికీ ఓ మార్గముంది. ఎనభై, వంద కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నపుడు బ్రేక్ ఫెయిలైనా పదిసెకన్లలో కారుని ఆపొచ్చు. ఎలాగంటే..

1 ఇంజిన్ బ్రేక్ ఫెయిలైనా ఆందోళన చెందకుండా బ్రేక్ పెడల్‌ని నాలుగైదు సార్లు వేస్తూ, వదులుతూ టకటకా తొక్కాలి. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి బ్రేక్ పని చేయొచ్చు.

2 మొదటి ప్రయత్నం విఫలమైనపుడు కారు వేగంలో ఉండగానే హ్యాండ్‌బ్రేక్‌ని సగం వరకు పైకి లాగాలి. ఇలా చేయడంవల్ల ఆటోమేటిగ్గా వేగం సగానికి తగ్గుతుంది. హ్యాండ్‌బ్రేక్ ఒకేసారి పూర్తిగా వేస్తే వాహనం అదుపుతప్పే ప్రమాదముంది.

3 హ్యాండ్‌బ్రేక్ సగం వేసిన వెంటనే ఐదు, నాలుగో గేరు నుంచి వెంటనే రెండు, ఒకటికి మారాలి. దీంతో కారు జర్క్‌లిస్తూ వేగం మరింత తగ్గుతుంది. ఇప్పుడు హ్యాండ్‌బ్రేక్‌ని పూర్తిగా పైకి లేపాలి. బండి పూర్తిగా ఆగిపోతుంది. ఇదంతా ఆరు నుంచి పది సెకన్లలో పూర్తవుతుంది.

యూబీఎస్‌తో సెల్యూటో

పరిచయం



కమ్యూటర్ విభాగంలో యమహా కంపెనీ మోడళ్లు సెల్యూటో ఆర్‌ఎక్స్, సెల్యూటో 125లు. ఇప్పుడు యూబీఎస్ టెక్నాలజీతో వస్తున్నాయి. యూబీఎస్ అంటే యూనిఫైడ్ బ్రేకింగ్ సిస్టమ్. ఏంటి దీని ప్రత్యేకత అంటే బైక్ నడుపుతున్న వ్యక్తి వెనక బ్రేక్ వేసినపుడు ఆటోమేటిగ్గా ముందు బ్రేక్ కూడా పడిపోతుంది. కాకపోతే వెనక బ్రేక్ పూర్తిగా పడితే ముందుది పాక్షికంగా పడుతుంది. దీనివల్ల ప్రయోజనం ఏంటంటే ఇది వేగాన్ని త్వరగా నిరోధించడమే కాదు.. సురక్షితం కూడా. ఎయిర్‌కూల్డ్, సింగిల్ సిలిండర్, 125 సీసీ ఇంజిన్, 8.3పీఎస్ ఇతర టెక్నికల్ ఫీచర్లు.

సెల్యూటో ఆర్‌ఎక్స్ **ధర రూ.52వేలు,** సెల్యూటో 125 **ధర రూ.60,500** (ఎక్స్‌షోరూం).

వేలిముద్రతో ఆన్/ఆఫ్



ఇంజిన్ స్టార్ట్ కావాలంటే ఏం కావాలి? అదేం ప్రశ్న తాళంచెవి ఉండాలంటారా! ఇంకొద్దిరోజుల్లో అదీ అవసరం లేదు. వేలిముద్రలతో ఇంజిన్‌ని ఆఫ్/ఆన్ చేసే టెక్నాలజీ తీసుకొస్తోంది హ్యుందాయ్. కొత్త టెక్నాలజీ, ఫీచర్లు పరిచయం చేయడంలో ముందుండే ఆటోమొబైల్ కంపెనీ. భద్రతను మరింత కట్టుదిట్టం చేసే ఈ వ్యవస్థను ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా సాంటా ఫె స్పోర్ట్ యుటిలిటీ వాహనంలో ప్రవేశపెట్టబోతున్నారు. ఈ ఏడాది మార్చికల్లా కారు మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుంది. ఇంతకీ ఇదెలా పని చేస్తుందంటే.. డోర్ హ్యాండిల్ దగ్గర ఒక ఫింగర్‌ప్రింట్ సెన్సర్ అమర్చుతారు. వాహన యజమాని వేలిముద్రలకు సంబంధించిన సమాచారం కంట్రోలర్ బాక్స్‌లో భద్రపర్చుతారు. మొదటి సెన్సర్‌పై వేలిముద్ర సరిపోతేనే డోరు తెరుచుకుంటుంది. రెండో సెన్సర్ కారు లోపల ఉంటుంది. దానిపై ఫింగర్‌ప్రింట్ వేయగానే ఆటోమేటిగ్గా కారు స్టార్ట్ అవుతుంది. ఆఫ్ కావాలంటే అదే వేలిముద్ర మరోసారి వేస్తే సరిపోతుంది.

సర్వీసింగ్ ఇస్తున్నారా? చూస్తున్నారా?



క్లిక్ కొడితే నిమిషాల్లో మనముందుంటారు... కాల్ చేస్తే కోరిన సమయానికి వాహనం తీసుకెళ్లిపోతారు... మొరాయించే కారుని సరిచేసి పోర్టికోలో పార్క్ చేసేస్తారు... ఇబ్బంది పెట్టే బైక్‌ని బాగు చేసి చేతికందిస్తారు... గతంలో లాగా ఆపసోపాలు పడుతూ వాహనాల్ని గ్యారేజీకి తీసుకెళ్లే పన్లేదు... రోడ్డుమీద ఆగిపోయిన మోటార్‌సైకిల్ పరిస్థితేంటని హైరానా పడనక్కర్లేదు... వాహనం వాషింగ్ నుంచి ఇంజిన్‌ని మార్చేసేదాకా.. సమస్య ఏదైనా సర్వీస్‌సెంటర్ ప్రతినిధులు సిద్ధం... ఇదంతా సరే.. సర్వీసుకిచ్చేముందు సరిచూసుకోవాల్సిన సంగతులేంటి? బండి చేతికందాక చెక్ చేయాల్సిన విషయాలేంటి? వివరంగా.

కారు, మోటార్‌సైకిల్‌కి ఏదైనా సమస్య ఏర్పడితే ఉసూరుమంటూ కంపెనీ డీలర్ దగ్గరికో, దగ్గర్లోని గ్యారేజీకో, తెలిసిన మెకానిక్ దగ్గరికో తీస్కెళ్లిపోతాం. ఇప్పుడూ చాలామంది అలాగే చేస్తున్నా.. ఆ ప్రయాస లేకుండా ఒక్క ఫోన్‌కాల్‌తో, ఆన్‌లైన్ క్లిక్‌తో సర్వీస్ సెంటర్ ప్రతినిధులే వచ్చి మన కారు, బైక్‌ని తీసుకెళ్లి మరమ్మతు చేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చేసింది. వాహనం సమస్య చెప్పి వీలైన తేదీ, కుదిరే సమయం చెబితే చాలు వాళ్లొచ్చి వాలిపోతారు.

అన్నిరకాల సర్వీసులు

వాషింగ్, నిర్ణీత సమయంలో చేసే సర్వీసింగ్, వాక్సింగ్, ఎక్స్‌టీరియర్ ట్రీట్‌మెంట్, ఇంటీరియర్ క్లీనింగ్, స్క్రాచ్‌లు పడకుండా ఫిల్మ్ ప్రొటెక్షన్, రాపింగ్, సన్‌ఫిల్మ్, బ్యూటిఫికేషన్, కస్టమైజేషన్, డెంటింగ్, అలైన్‌మెంట్.. కారు విషయానికొస్తే అందించే సర్వీసులు. మోటార్‌సైకిళ్లకైతే పంక్చర్ వేయడం, వాషింగ్, కార్బురేటర్ చెకప్, సర్వీసింగ్, ఆయిల్ మార్చడం.. ఇలా. కొన్ని సర్వీస్‌సెంటర్‌లు అయితే



సమాచారం అందిస్తే ప్రమాదాల్లో దెబ్బతిన్న వాహనాలను సైతం పికప్ చేసుకొని చెప్పిన సమయానికి మరమ్మతు చేస్తున్నారు. వాహనాలు బ్రేక్‌డౌన్ అయినా, ఏదైనా కారణంతో ఆగిపోయినా 24x7 రోడ్‌సైడ్ అసిస్టెన్స్ ఇచ్చే వాళ్లున్నారు. ఇలాంటి సర్వీసులు అందించేవాళ్లలో స్థానిక గ్యారేజీల నుంచి అంతర్జాతీయ గొలుసుకట్టు ఫ్రాంఛైజీలున్నాయి. బోష్ కారు సర్వీస్‌సెంటర్‌కి దేశవ్యాప్తంగా శాఖలున్నాయి. ఇంగ్లండ్ సంస్థ 3ఎం కార్‌కేర్ మనదేశంలోని ప్రధాన నగరాల్లో బ్రాంచీలు తెరిచింది. కార్జ్, కార్‌జోమో, పారామౌంట్ ఆటోబే సర్వీసెస్, గాడీఘోస్ట్, మోటోఫిక్స్, బైక్‌జోన్ ఇలాంటి సర్వీసులందిస్తున్నాయి. ఆల్టో కారు నుంచి ఫెరారీ వరకు.. స్ప్లెండర్ బైక్ నుంచి హార్లీడేవిడ్‌సన్ వరకు వేటికైనా హోంపికప్ ఓకే అంటున్నారు. నెలవారీ, ఏడాది ప్యాకేజీలు తీసుకుంటే ఆ కాలం మొత్తం ఏ మరమ్మతు అయినా చేసే బాధ్యత మాదే అని ఆఫర్లు ఇస్తున్నారు.

ఇవి పాటించండి

బెంగళూరులో జరిగిందిది. తన కారుని సర్వీసింగ్ కోసం డీలర్‌కిచ్చాడో వ్యక్తి. వాళ్ల పనితీరుపై అనుమానమొచ్చి కారులో సీసీ కెమెరా పెట్టాడు. వాహనం మొత్తం విప్పదీసి సర్వీసింగ్ చేయాల్సినచోట నీటితో శుభ్రం చేసి మమా అనిపించారు. వీడియో ఆన్‌లైన్‌లో వదిలాడాయన. పెద్ద పేరున్న కంపెనీ పరువు పోయింది. అందరూ ఇలాగే చేస్తారని కాదు.. సర్వీసింగ్‌కి ఇచ్చేముందు మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే.

- వాహనాన్ని సర్వీసింగ్‌కి ఇచ్చేముందు కిలోమీటర్ రీడింగ్ రాసుకోవాలి. కొందరు మెకానిక్‌లు, గ్యారేజీ ఓనర్లు వాహనాల్ని సొంత అవసరాల కోసం వాడుకుంటారు. అందులో సాధ్యమైనంత తక్కువగా పెట్రోల్, డీజిల్ ఉండేలా చూసుకోవాలి.
- చాలామంది 'పాత విడిబాగాలు మార్చి కొత్తవి వేశాం' అంటారు. అలాంటి సందర్భాల్లో పాతవి చూపించమని అడగాలి. కొత్త ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్ (ఓఈఎం) పార్ట్స్ వేస్తే తప్పకుండా బిల్లులు తీసుకోవాలి. గ్యారెంటీ/వారంటీ ఉంటే స్టాంప్‌తో సహా వేయమని చెప్పాలి.
- హోం పికప్ సర్వీసుల ప్రతినిధులు వాహనం తీసుకెళ్లేముందు మ్యూజిక్ ప్లేయర్, టైర్లు, టూల్‌కిట్‌లాంటి ఏవైనా ఖరీదైన ఫిట్టింగ్స్ ఉంటే వాటి జాబితాతో కూడిన జాబ్ కార్డు ముందే ఇస్తారు. ఆ రశీదు తీసుకోవాలి. అవసరమైతే వాహనాన్ని ఫొటోలు కూడా తీసుకోవచ్చు.
- ఏదైనా సమస్యతో సర్వీసింగ్‌సెంటర్‌కి వెళ్లినపుడు ఏమేం విడిభాగాలు పాడయ్యాయో, ఎంత మొత్తం బిల్లు అవుతుందో చెబుతారు. దాన్ని గుడ్డిగా నమ్మేయకుండా దేనికెంత మొత్తం ఖర్చవుతుందో ఒక ఎస్టిమేషన్ వేసి ఇవ్వమనాలి. నాలుగైదుచోట్ల వాకబు చేసి వాటి ధరలు కనుక్కోవచ్చు. ఆటోమొబైల్ తయారీ కంపెనీల వెబ్‌సైట్‌లోకి వెళ్లి తెలుసుకోవచ్చు.
- సర్వీసింగ్ అయిన తర్వాత కూలంట్‌లు, బ్రేక్ ఆయిల్, ఇంజిన్ ఆయిల్, ఆయిల్ ఫిల్టర్లు డిప్‌స్టిక్‌తో పరిశీలించడం పెద్ద కష్టమేం కాదు. మొహమాట పడకుండా వాటి మూతలు విప్పి పరిశీలించవచ్చు. ఫ్యూయెల్ బర్నింగ్, వెలువడే పొగ ఆధారంగా కూడా కొన్ని కొన్ని అంతర్గత విడిభాగాలు పనితీరు కూడా తెలుసుకోవచ్చు.
- చిన్నచిన్న మరమ్మతులకైతే ఫర్వాలేదుగానీ పెద్ద ఎత్తున విడిభాగాలు మార్చాల్సి వస్తే తప్పకుండా ఒకటికి రెండు గ్యారేజీల్లో పరిశీలించి ఎంత కోట్ అవుతుందో కనుక్కోవాలి.
- మెకానిక్, సర్వీసింగ్ సెంటర్ ప్రతినిధి ముందు చెప్పినట్టుగా కాకుండా అదనంగా ఎలాంటి మరమ్మతు చేసినా మనకు చెప్పకుండా చేయొద్దని కచ్చితంగా చెప్పేయాలి. సర్వీసింగ్ చేసిన తర్వాత చెప్పిన సమయానికి ఇవ్వమనాలి. ఎక్కువ సమయం వాళ్ల దగ్గరే ఉంచుకుంటూ ఎక్కువ బిల్లులు వేయాలని ప్రయత్నిస్తారు.
- సర్వీస్ పూర్తైన తర్వాత మెకానిక్‌ని బైక్, కారులో కూర్చోబెట్టుకొని ఒక రౌండ్ తిప్పాలి. మనం చెప్పిన సమస్యలు పరిష్కారం అయ్యాయా, లేదా ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు.
- నిర్లక్ష్యంతోనో, వాళ్ల మీద అతి భరోసాతోనో వాహనాన్ని గ్యారేజీ/సర్వీస్ సెంటర్‌లో ఎక్కువ రోజులు ఉంచడం శ్రేయస్కరం కాదు. సరిగ్గా మెయింటెయిన్ చేయకపోవచ్చు.

- విద్యా నంబిరాజన్



నమ్మకమే ముఖ్యం

డబ్బుకన్నా ఇప్పుడు చాలామందికీ సమయమే ముఖ్యం. అందుకే హోం పికప్, డ్రాప్ సర్వీసులు పెరిగిపోతున్నాయి. దాంతోపాటు నాణ్యమైన సర్వీసు అందిస్తే కొంచెం ఎక్కువ డబ్బులు చెల్లించడానికైనా ఎవరూ వెనకాడటం లేదు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరులాంటి నగరాల్లో ఎక్కువగా ఉన్న హోం పికప్, డ్రాప్ ట్రెండ్ హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లోనూ విస్తరిస్తోంది. మేమైతే పికప్‌కి ముందే వాహనంలో ఏమైనా విలువైన వస్తువులు ఉంటే వాటి జాబ్‌కార్డు జాబితా ఇస్తాం. సర్వీస్ పూర్తైన తర్వాత వెరిఫికేషన్ చేసుకొమ్మని చెబుతాం. వినియోగదారుడితో మాట్లాడ్డం నుంచి సర్వీస్, తదనంతరం వారంటీ వరకు పక్కా ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తాం. వాషింగ్, వాక్సింగ్, ఎక్స్‌టీరియర్ ట్రీట్‌మెంట్, ఇంటీరియర్ క్లీనింగ్‌లతోపాటు బ్యూటిఫికేషన్ సర్వీసులు అందిస్తున్నాం. ఏ సర్వీసుకు ఎంత బిల్లు అవుతుందో ముందే చెబుతాం. ఫోన్, వెబ్‌సైట్ ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకుంటాం. సర్వీస్‌సెంటర్‌కి తీసుకెళ్లి వాహనం అప్పజెబితే వాహనాల్లోని ఖరీదైన, నాణ్యమైన విడిభాగాలు మార్చేసి నకిలీవి వేస్తారనే భయం కొంతమందిలో ఉంటుంది. నమ్మకమే ప్రధానంగా కొనసాగే ఆటోమొబైల్ రంగంలో ఇలాంటి మోసాలు తక్కువే.



- గణేష్, 3ఎం కార్‌కేర్ మేనేజర్

మెకానిక్ గురూ

కల్తీ పట్టేద్దామిలా..

■ **నా బరువు 65 కేజీలు, ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు. సంవత్సరానికి ఆరు లక్షలు సంపాదిస్తాను. కొత్తగా కారు కొనాలనుకుంటున్నాను. రోజులో ఎక్కువదూరం ప్రయాణించను. నిర్వహణ వ్యయం తక్కువగా ఉండి మా అవసరాలకు సరిపోయే మంచి మోడల్ సూచించండి. - పాతకోటి శిఖామణి,** ఈమెయిల్

ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న చాలా కార్లు మీ అవసరానికి తగ్గట్టుగా సరిపోతాయి. ఎక్కువ దూరం ప్రయాణించను అంటున్నారు కాబట్టి నిర్వహణ వ్యయం తక్కువగా ఉండే పెట్రోల్ కారును తీసుకోవడం మంచిది. డీజిల్ కారు అయితే రూ.70వేల వరకు ధర ఎక్కువగా ఉంటుంది. మారుతిసుజుకీ స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, టాటా టియాగో కొన్ని పాపులర్ కార్లు. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఉన్న ఈ బండ్లలో దేన్నైనా ఎంచుకోండి.

■ **తరచూ పెట్రోల్ బంక్ మార్చితే వాహనం మైలేజీ తగ్గుతుందంటారు. నిజమేనా? అసలు మనం బంక్‌లో పోయించుకునే ఇంధనం కల్తీదా? మంచిదా? అని గుర్తించడం ఎలా? - వలీ,** కడప

వాహనం మైలేజీ తక్కువ రావడానికి చాలా కారణాలుంటాయి. బండి నడిపే తీరు, ఇంధనం నింపే బంక్, నింపే సమయం.. ఇలా. బంక్‌బంక్‌కీ నాణ్యత, పరిమాణం మారుతుంటాయి. ఇంధనంలో చేసే కల్తీ, తూకంలో మోసాలు తప్పకుండా మైలేజీపై ప్రభావం చూపిస్తాయి. కల్తీ జరిగిందా, లేదా తెలుసుకోవాలంటే ఒక సులభమైన పద్ధతి ఉంది. ఒక స్టాక్ ఫిల్టర్ పేపరు తీసుకొని దానిపై కొన్ని ఇంధనం చుక్కలు వేయాలి. కాగితంపై ఎలాంటి మరకలు లేకుండా అది ఆవిరైపోతే కల్తీ కాలేదని అర్థం. మరకలా మారితే కల్తీ జరిగిందన్నమాట. ఐదులీటర్ల పరిమాణం ఉన్న గాజు బాటిల్‌తో పరిమాణం పరీక్ష చేయమని అడగొచ్చు.



■ **మా బంధువొకాయన ఈమధ్యే కొన్న తన కారుని తక్కువ ధరకే ఇస్తానంటున్నాడు. కాకపోతే అది ఆంధ్రాలో రిజిస్ట్రేషన్ అయింది. నేను హైదరాబాద్‌లో వాడుకోవాలనుకుంటున్నాను. దీనికోసం నేను మళ్లీ ఇక్కడ కొత్తగా పన్నులు కట్టాలా? ఏమేం చెల్లించాలి? దయచేసి వివరించండి. - శ్రీకాంత్,** హైదరాబాద్

మోటారు వాహన చట్టం-1988, సెక్షన్ 47 ప్రకారం వాహనం ఏ రాష్ట్రంలో కొన్నారో అక్కడే లైఫ్ టాక్స్ కట్టాలి. ఒకవేళ ఆ వాహనాన్ని ఇతర రాష్ట్రంలో ఏడాదికి మించి వాడుకోవాలనుకుంటే అక్కడా జీవితకాల పన్ను కట్టాలి. దీనికన్నా ముందు మొదటి రాష్ట్రంలోని రవాణాశాఖ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ) తీసుకొని రెండో రాష్ట్రంలో చూపించాలి. రెండోసారి కట్టిన జీవితకాలపు పన్ను రశీదును మొదటి రాష్ట్రంలో సమర్పించి మొదట కట్టిన పన్ను రిఫండ్‌కి దరఖాస్తు చేసుకోవాలి. అంతకుముందు ఆ రాష్ట్రంలో తిరిగిన సమయానికి అనుగుణంగా కొంతమొత్తం తగ్గించి మిగతాది వెనక్కి ఇస్తారు. కారు మోడల్, తయారైన తేదీ, ఇంతకుముందు ఆ వ్యక్తి పేరుపై ఉన్న ఇతర వాహనాల వివరాలకు అనుగుణంగా పన్నుల్లో మార్పులుంటాయి.

- హర్షిన్ లాల్‌పేట్, ఆటోమొబైల్ నిపుణుడు

(మీకూ ఇలాంటి సందేహాలు, సమస్యలుంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలు ఇప్పిస్తాం)

వెయ్యిమందికి 22

ఇప్పుడైతే కారు చూడని పల్లెలు అరుదు. పట్టణాలు, నగరాల్లో అయితే ఒక్కోసారి రోడ్లు చాలవు. కానీ ఇప్పటికీ ఆశ్చర్యంగా అతి తక్కువగా కార్లు వాడుతున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇక్కడ వెయ్యిమందిలో కేవలం 22 మందే కార్లు వాడుతున్నారు. మిగతా దేశాల విషయానికొస్తే.

దేశం	కార్లు
అమెరికా	980
బ్రిటన్	850
న్యూజిలాండ్	774
ఆస్ట్రేలియా	740
కెనడా	662
జపాన్	591
చైనా	164

● రాబోయే రెండు దశాబ్దాల్లో మనదేశంలో 775శాతం చొప్పున అమ్మకాల్లో వృద్ధి నమోదై వెయ్యిమందికి 175 కార్లు ఉండబోతున్నాయి.



విహారి

ఈనాడు విజయవాడ
శుక్రవారం జనవరి 11, 2019

మంచు కురవకపోతేనేం!

మంచుకురిసే వేళలో సాహస క్రీడలకు మనాలి వేదికగా మారుతుంది. తుషార పాతం ముఖంచాటేస్తే.. మంచుపై పరుగులు తీసే అవకాశం ఉండదు. స్కీయింగ్ ముచ్చట అస్సలుండదు. స్లెడ్జింగ్ సందడి కనిపించదు. మంచు ముంచేయకున్నా.. మనాలిలో ఖుషీ చేయొచ్చు ఇప్పుడు. కృత్రిమంగా మంచు కురిపించి చిన్న చిన్న పార్కులను సిద్ధం చేస్తున్నారు అక్కడి టూరిజం నిర్వాహకులు.



శీతకాలమంతా స్కీయింగ్, స్లెడ్జింగ్ క్రీడలకు మంచులోటు లేకుండా చూస్తున్నారు. యూరప్ నుంచి లక్షల రూపాయల విలువ చేసే 'స్నో గన్' యంత్రాలను తెచ్చి మరీ మంచువర్షం కురిపిస్తున్నారు. అరవై వేల లీటర్ల నీటి తోడుకొని సుమారు వందమీటర్ల విస్తీర్ణంలో అడుగు ఎత్తు మంచు కురిపిస్తుందీ యంత్రం. మనాలి సమీపంలోని సోలాంగ్, కులు సమీపంలోని ప్రైవేట్ స్థలాల్లో స్నో గన్ యంత్రం సాయంతో మంచు పేరుకుపోయేలా చేస్తున్నారు వీళ్లు. ఆయా ప్రాంతాల్లో స్కీయింగ్, స్లెడ్జింగ్ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు మంచుక్రీడలకు వేదికలుగా వాటిని తీర్చిదిద్దుతున్నారు. స్నోపార్క్‌లో ప్రవేశానికి రూ.500 వసూలు చేస్తున్నారు. గతేడాది శీతకాలంలో మనాలి ప్రాంతంలో మంచు కురిసింది లేదు.. ఫలితంగా పర్యాటక ఆదాయానికి భారీగా గండి పడింది. ఈ నేపథ్యంలో ఇలా కృత్రిమ మంచు పార్కులను సిద్ధం చేసి వహ్వా అనిపిస్తున్నారు.

దిక్సూచి

షీరోస్ తోడుగా..

సోలో విహారం సో బెటరని మహిళలు కూడా ఫిక్సవుతున్నారు. నచ్చిన చోటుకు ఒంటరిగా వెళ్లిపోతున్నారు. బృంద విహారాల్లో చేరి విందువినోదాల్లో పాలుపంచుకుంటున్నారు. ఒంటరి ప్రయాణంలో ఎంత ఆనందం ఉంటుందో.. అంతే రిస్క్ ఉంటుంది. దానిని అధిగమించడానికి యాప్స్ సాయం తీసుకుంటున్నారు. అలాంటి వాటిలో



ఒకటి షీరోస్ (sheroes). మహిళా కమ్యూనిటీ యాప్ పర్యాటకంతో పాటు మరెన్నో విషయాలకు వేదికగా నిలుస్తోంది. యాప్‌లో చేరి.. ఇతర పర్యాటకులతో అభిప్రాయాలు పంచుకోవచ్చు. ప్రయాణంలో పాటించాల్సిన నియమాలు తెలుసుకోవచ్చు. ఇతరులు చెప్పే విహార అనుభవాలు వినొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాల వివరాలు, అక్కడికి చేరుకునే మార్గాలు కూడా యాప్‌లో లభిస్తాయి. పర్యాటకం ఒక్కటే కాదు.. ఆరోగ్యం, ఉపాధి, మానవ సంబంధాలు తదితర అంశాలపై కూడా యాప్‌లో సలహాలు పొందవచ్చు.

దారి చూడు.. బెల్టు చూడు..

పర్యాటక పర్వంలో రాత్రిపగలు తేడా లేదు. ట్రెక్కింగ్, ర్యాపెలింగ్, వాకింగ్ ఏదయినా సరే.. నడిరేయి ఏ జాములో అయినా సై అంటున్నారు. అలాంటి సాహస ప్రియులకు దారి చూపుతోంది ఈ బెల్టు. వెలుగులు విరజిమ్మే బెల్టు నడుముకు తగిలించుకుంటే చాలు.. విహారమైనా, సాహసమైనా కాంతిమంతంగా సాగిపోతుంది. ఇల్యుమనేటింగ్ బెల్టు పట్టుకోవాల్సిన పనిలేదు. రహదారి వెంట వెళ్తున్నప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు నడిపేవారికి ఇదో సంకేతంగా ఉంటుంది.





'అన్నీ కాకమ్మ కథలే!' అంటారు. కానీ, ఆకమ్మ కదిలినా అలజడే!! అక్కడి వాతావరణం ఒంట్లో వణుకుపుట్టిస్తుంది. వాటి వెనక గల చరిత్ర గుండెలో గుబులు రేపుతుంది. అయినా, అనుక్షణం భయపడుతూ.. ప్రతిక్షణం ఆస్వాదించేస్తుంటారు. నిజానిజాల సంగతి అటుంచితే.. వెంటాడే పర్యాటక కేంద్రాలుగా ముద్రపడ్డ ప్రాంతాలు మనదేశంలో బోలెడు. చరిత్ర పుటల్లో చెరగని రక్తపాతాన్ని దర్శించిన ప్రదేశాలు కొన్ని. నమ్మరాని కారణాలు చుట్టిముట్టి మట్టిదిబ్బగా మారిన ఊళ్లు ఇంకొన్ని. ఇప్పుడవన్నీ అరుదైన పర్యాటక ప్రాంతాలే. విహారంలో వినూత్నం కోరుకునే వాళ్లు ఇలాంటి ప్రదేశాలకు క్యూ కడుతుంటారు. ఆందోళనలోనూ ఆనందాన్ని వెతుక్కుంటారు. అలాంటి అనుభూతి మీకూ కావాలా? అయితే ఈ పర్యాటక కేంద్రాలకు దిలాసాగా వెళ్లి.. కులాసాగా రండి.

భయపడిపోదామా!

రాత్రుంటే శిక్షార్హమే! | భాన్‌గఢ్ కోట, రాజస్థాన్

రాజస్థాన్‌లోని ప్రముఖ కోటల్లో భాన్‌గఢ్ ఒకటి. అల్వార్ జిల్లాలో ఉంటుందీ భారీ కోట. వెలుతురులో వేలమంది మనసులు దోచే భాన్‌గఢ్ అందాలు.. రాత్రయ్యిందంటే అంతమందినీ ఉలిక్కిపడేలా చేస్తాయంటారు. అందుకు సాక్షిగా కోట ప్రాంగణంలో పురావస్తుశాఖ ఏర్పాటు చేసిన సూచిక కనిపిస్తుంది. 'సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత కోటలో ప్రవేశం నిషిద్ధం. అలా కాకుండా ఎవరైనా కోటలోకి ప్రవేశిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అందులోని సారాంశం ఇది. కోటలో.. రాజప్రాసాదాలు, ఆలయాలు, మండువా లోగిళ్లు, ఈత కొలనులు, మంచినీళ్ల బావులు ఇలా ఎన్నో అద్భుతాలు దాగున్నాయి. వీటన్నిటినీ తేరిపారా చూసి సాయంత్రానికి పర్యాటకులు తిరుగు ప్రయాణం అవుతారు. అక్కడ ఉండటానికి మాత్రం నిబంధనలు ఒప్పుకోవు.

చేరుకునేదిలా: భాన్‌గఢ్.. జైపూర్ నుంచి 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జైపూర్ నుంచి బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు.



రత్నావతి నవ్వేనా?

మొఘల్ చక్రవర్తి అక్బర్ సేనాని మాన్‌సింగ్ సోదరుడు మాధోసింగ్ ఆధీనంలో ఉండేది భాన్‌గఢ్ కోట. మొఘలుల ప్రాభవం తగ్గిన తర్వాత భాన్‌గఢ్‌పై శత్రురాజుల కన్నుపడింది. అదే కోటలో రత్నావతి అనే సౌందర్యరాశి ఉండేదట. ఆమెను వలచిన ఓ మాంత్రికుడు అత్తరును మంత్రించి ఆమెపై చల్లి వశపరుచుకోవాలని చూశాడట. రత్నావతి ఆ అత్తరు సీసాను బండకేసి కొట్టడంతో బండ పగిలి రాళ్లన్నీ మాంత్రికుడిపై పడ్డాయట. అతడు చనిపోతూ ఈ కోట నాశనమవుతుందని శపించాడట. ఈ సంఘటన జరిగిన ఏడాదిలోపే అజబ్‌గఢ్ రాజు భాన్‌గఢ్ కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఆ దాడిలో రత్నావతి సహా వందల మంది కోటలోనే ప్రాణాలు వదిలారట. నాటి నుంచి కోట నిర్మానుష్యంగా మారిపోయింది. చనిపోయిన వారంతా ఆత్మలుగా కోటలోనే ఉన్నారని చెబుతారు. రాత్రి పూట కోటలో వింత శబ్దాలు, నవ్వులు వినిపిస్తాయంటారు.

పున్నమి రాత్రి | శనివార్‌వాడ, మహారాష్ట్ర

మహారాష్ట్ర పుణెలో అందమైన కోటలు ఎన్నో ఉన్నాయి. అందులో ఒకటి శనివార్‌వాడ. మరాఠా యోధుడు బాజీరావు తనకోసం ఈ కోటను కట్టించాడు. బాజీరావు పేరు వినగానే మీ మనసు ఎక్కడో తెరపై తెరలుతెరలుగా పోతోంది కదూ! ఆ 'బాజీరావు మస్తానీ' యోధుడే ఈ కోటకు వీరుడు. కోట ముఖద్వారం మొదలు అణువణువూ అద్భుతంగా ఉంటుంది. విశాలమైన ప్రాసాదాలు, ప్రాంగణాలు, గదులు చక్రవర్తుల రాజ భవనాన్ని మరిపిస్తాయి. ఇటుకలతో నిర్మించినా నేటికీ చెక్కు చెదరని నిర్మాణం ఆనాటి పనితీరుకు అద్దంపడుతుంది. కోటలో ఉన్న తోట మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. పుణె వచ్చేవారంతా శనివార్‌వాడ కోటను సందర్శించకుండా తిరిగి వెళ్లరు. రోజూ వందల మంది కోటలోకి ప్రవేశిస్తారు. అదే పౌర్ణమినాటి రాత్రి కోట దరిదాపుల్లోకి వెళ్లడానికి కూడా సాహసించరు. ఔత్సాహిక పర్యాటకులు మాత్రం కోట పరిసరాల్లో బస చేస్తుంటారు.

చేరుకునేదిలా: పుణె పట్టణంలోనే ఉంటుంది శనివార్‌వాడ. బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి ట్యాక్సీల్లో, ఆటోల్లో కోటకు వెళ్లొచ్చు.

కాపాడు మామా

కోటను నిర్మించిన బాజీరావు మరణం తర్వాత అతడి కుమారుడు బాలాజీ రావు పీష్వాగా నియమితుడయ్యాడు. అతడి మరణం తర్వాత 16 ఏళ్ల మూడో కొడుకు నారాయణరావు పీష్వా అయ్యాడు. అతడికి మేనమామ రఘునాథరావు సంరక్షకుడిగా ఉండేవాడు. కొన్నాళ్లకు రఘునాథరావు అల్లుడిని అంతమొందించాలనుకున్నాడు. విషయం తెలిసి మేనమామను చెరశాలలో బంధించాడట. రఘునాథరావు స్నేహితుడైన గిరిజన నాయకుడు ఒక పౌర్ణమి రాత్రి కోటలోకి ప్రవేశించి నారాయణరావుపై దాడికి దిగాడట. 'మామా కాపాడు.. చంపేస్తున్నాడు' అని మొరపెట్టుకున్నా దారుణంగా చంపేశాడట. ఆనాటి నుంచి ప్రతి పౌర్ణమి రాత్రి 'మామా నన్ను కాపాడు..' అన్న మాటలు కోటలో ప్రతిధ్వనిస్తుంటాయని చెబుతారు. నేటికీ ఈ మాటలు వినిపిస్తాయని అనేవాళ్లు ఉంటారు.



ఇవీ అంతే

భయాన్ని కలిగించే ప్రదేశాలు ఊరూరా ఉంటాయి. వాటిలో విహార కేంద్రాలుగా పర్యాటకుల ఆదరణ పొందుతున్నవి కొన్నున్నాయి.

జీపీ బ్లాక్, మీరట్
(పురాతనమైన ఈ బంగళాలో ఏవో దుష్టశక్తులున్నాయని అంటారు. శిథిలావస్థకు చేరిన ఈ భవంతిని చూడగానే ఒకరకమైన భయం కలుగుతుంది)

అగ్రసేన్ కీ బావ్‌లీ, దిల్లీ
(దేశ రాజధానిలోని ఈ మెట్లబావిలో ఏదో అదృశ్యశక్తి ఉందని చెబుతుంటారు. రాత్రివేళలో బావిలోకి వెళ్లేందుకు సాహసించరు)

కుల్ధారా, రాజస్థాన్
(రాత్రికి రాత్రే కొన్ని ఊళ్లలోని ప్రజలందరూ ఎక్కడికో వెళ్లిపోయారు. ఇప్పుడా ప్రాంతం మొండిగోడలతో కనిపిస్తుంటుంది. రాత్రి ఇక్కడ ఎవరూ ఉండరు)

కిరాడు ఆలయాలు, రాజస్థాన్
(ఈ ఆలయాల్లో రాత్రి ఎవరైనా ఉన్నారంటే.. వాళ్లు రాయిలా మారిపోతారని ప్రచారంలో ఉంది. ఒక యోగి శాపం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతారు.)

రాస్ దీవి, అండమాన్
(ఆంగ్లేయుల కాలంలో పరిపాలనా కేంద్రంగా ఉండేదీ దీవి. వందల కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండేవి. 1941లో భారీ భూకంపం రావడంతో చాలా భవనాలు నేలమట్టం అయ్యాయి. నాటి నుంచి ఇక్కడ ఏవో అదృశ్యశక్తులు ఉన్నాయని చెబుతుంటారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత దీవిలోకి సందర్శకులను అనుమతించరు)

కల్లోల తీరం | డ్యూమాస్ బీచ్ 4, గుజరాత్

అరబిక్ కడలి కల్లోలంగా ఉన్నా అందంగానే కనిపిస్తుంది. ఆ సౌందర్యాన్ని ఆస్వాదించడానికి అంతకన్నా అందమైన బీచ్‌లు ఉన్నాయి. సూరత్ నగరానికి 21 కిలోమీటర్ల దూరంలో నాలుగు బీచ్‌లు ఉన్నాయి. డ్యూమాస్ బీచ్‌లని వాటికి పేరు. వీటిలో మూడు బీచ్‌లు పర్యాటకుల కేరింతలకు కేరాఫ్‌గా నిలిస్తే.. నాలుగో బీచ్ మాత్రం భయంకరంగా దర్శనమిస్తుంది. ఈ బీచ్‌కి ఎవరూ వెళ్లరు. దాని గురించి వాకబు చేస్తే.. 'ఇంట్లో చెప్పొచ్చారా?' అని తిరిగి ప్రశ్నిస్తారు. అందుకు తగ్గట్టే ఇక్కడ అలలు పోటుమీదుంటాయి. తీరం కల్లోలంగా ఉంటుంది. ఉదయం పూట కూడా ఇటుగా ఎవరూ రారు. ఎవరో ఆసక్తి ఉన్న పర్యాటకులు గుంపులుగా వచ్చి కాసేపు ఉండి.. వెంటనే వెళ్లిపోతారు.



ఇసుకలో బూడిద

డ్యూమాస్ బీచ్ 4లో ఇసుక నల్లగా ఉంటుంది. అందులో వింత లేకపోవచ్చు. కానీ, ఆ ఇసుకలో బూడిద పాళ్లుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒకప్పుడు ఈ తీరాన్ని శ్మశానంగా వాడేవారట. మృతదేహాలను దహనం చేసేవారట. ఆ బూడిద ఇక్కడి ఇసుకలోనూ, ఆత్మలు గాలిలోనూ ఉన్నాయని కొందరంటారు. ఇందులో నిజమెంతో తెలియదు కానీ, డ్యూమాస్ బీచ్ దగ్గరికి వెళ్లడానికి అంత త్వరగా ఎవరూ సాహసించరు. పైగా ఈ బీచ్‌లో మిస్సింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయట కూడా!

చేరుకునేదిలా: గుజరాత్‌లోని సూరత్ నగరానికి వెళ్లి.. అక్కడి నుంచి డ్యూమాస్ బీచ్ 4కు ట్యాక్సీల్లో చేరుకోవచ్చు.

టన్నెల్ నంబర్ 33 | బడోగ్, హిమాచల్‌ప్రదేశ్

హిమాచల్‌ప్రదేశ్ సిమ్లా వెళ్లేవారంతా.. అక్కడి నుంచి కాల్కా వరకు రైల్లో ప్రయాణించకుండా ఉండలేరు. కొండల మధ్య నుంచి సాగిపోయే రైలు మార్గంలో ప్రయాణం అనిర్వచనీయమైన అనుభూతినిస్తుంది. 98 కిలోమీటర్ల దారిలో 103 సొరంగాలున్నాయి. దాదాపు 800 వంతెనలున్నాయి. చలిగాలి గిలిగింతలు.. మంచుతెరల పలకరింతలు.. అంతెత్తు కొండలు చూసి ఆశ్చర్యపోవడాలు.. ఆ పక్కనే ఉన్న లోయలు కంటపడి భయపడటాలు ఇలా ఎన్నో అనుభూతుల మధ్య సాగే ప్రయాణం 33వ నంబర్ సొరంగం దగ్గరికి వచ్చేసరికి నెమ్మదిస్తాయి. ఆ సొరంగాన్ని చూసేందుకే సిమ్లా వరకు వెళ్లే పర్యాటకులు ఉన్నారు. దాని నిర్మాణం, ఆ తర్వాత తలెత్తిన పరిస్థితులు తెలుసుకొని ఒకింత ఆశ్చర్యానికి గురవుతారు. టన్నెల్ దాటగానే వచ్చే బడోగ్ రైల్వేస్టేషన్‌లో ఒకసారి దిగి అందాకే దాటివచ్చిన సొరంగాన్ని అనుమానంగా చూస్తారు.



రూపాయి జరిమానా!

సిమ్లా-కాల్కా న్యారో గేజ్ రైలు మార్గాన్ని బ్రిటిష్ హయాంలో నిర్మించారు. సుమారు ఒక కిలోమీటర్ పొడవున్న టన్నెల్ నం.33 నిర్మాణ బాధ్యతలను సివిల్ ఇంజినీర్ కోలోనెల్ బడోగ్‌కు అప్పగించారు అధికారులు. రెండు వైపుల నుంచి సొరంగం తవ్వకం ప్రారంభించాడు బడోగ్. రెండు ఒకచోట కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేశాడు. తానొకటి తలిస్తే.. విధి మరొకటి తలిచింది. రెండు సొరంగాలు దారి తప్పాయి. అధికారులు ఆగ్రహించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించావంటూ బడోక్‌కు ఒక రూపాయి జరిమానాగా విధించారు. దీనిని అవమానంగా భావించిన బడోగ్ అదే సొరంగంలో తుపాకీతో పేల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత కొన్నాళ్లకు రైలు మార్గం పూర్తయింది.. రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. టన్నెల్ 33లోకి ప్రవేశించగానే రైలు ఆగిపోయేదట. ఎవరో వచ్చి మరమ్మతు చేసేవారట. మళ్లీ రైలు కదిలేదట. అలా వచ్చే వ్యక్తి బడోగని కొందరి నమ్మకం. ఎందుకొచ్చిన గొడవని ఆ సొరంగాన్ని మూసేశారు అధికారులు. కానీ, సొరంగానికి వేసిన తాళాలు ఊడిపోయాయి. కట్టిన గొలుసులు తెగిపోయాయి. బడోగ్ రైళ్లను స్వాగతిస్తున్నాడని మళ్లీ రాకపోకలు ప్రారంభించారు. ఇప్పటికీ ఆ సొరంగం నుంచి రైళ్లు పరుగులు తీస్తున్నాయి. కొందరు మాత్రం టన్నెల్ 33లో కోటు, హ్యాటుతో ఉన్న బడోగ్‌ని చూశానని భయంగా చెప్పుకొంటూ ఉంటారు.

చేరుకునేదిలా: హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాకు వెళ్లి.. అక్కడి నుంచి కాల్కా రైలెక్కితే టన్నెల్ నం.33 గుండా ప్రయాణించవచ్చు.

విదేశీ విశేషం

కాసులిస్తేనే వెల్‌కం

యూరప్ పర్యటనలో అందరూ సందర్శించే ప్రాంతం వెనిస్. అలలపై తేలియాడే ఈ నగరానికి ఏటా లక్షల మంది వస్తుంటారు. కానీ, ఇక మీదట వెనిస్‌లో అడుగు పెట్టాలంటే తృణమో, ఫణమో చెల్లించుకోవాల్సిందే. ఒక్కపూట వెనిస్‌లో సంచరించాలన్నా రెండున్నర యూరోలు (సుమారు రూ.200) సమర్పించుకోవాల్సిందే. పీక్ సీజన్‌లో అయితే పది యూరోల (రూ.800) వరకు ఇస్తే గానీ లోనికి ప్రవేశం లభించదు. అలా చెల్లించిన వారినే నగరంలోకి ఆహ్వానిస్తారు. ఇటీవలి కాలంలో వెనిస్‌కు పర్యాటకుల తాకిడి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. నగర జనాభా కన్నా.. రోజూ అక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్యే ఎక్కువగా



ఉంటుంది. ఓవర్ టూరిజంపై స్థానికంగా నిరసనలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే కొంతకాలం కిందట వెనిస్‌లో నాలుగైదు రోజులు ఉండే పర్యాటకులు పది యూరోలు చెల్లించే నిబంధన తీసుకొచ్చారు. తాజాగా ఒక్కరోజు పర్యటించే వారి దగ్గర కూడా రుసుము వసూలు చేయాలని నిర్ణయించారు. క్రూజ్‌లలో వెనిస్ వచ్చే పర్యాటకులు, ప్యాకేజీల్లో భాగంగా వస్తున్న వాళ్లు ఉదయం అలా వచ్చి.. సాయంత్రం ఇలా వెళ్లిపోతుండటం వల్ల.. తమ ఖజానాకు పెద్దగా ప్రయోజనం చేకూరడం లేదని ఈ నిర్ణయం తీసుకున్నారు అధికారులు. తాజా నిర్ణయంతో ఒక్కరోజు వెనిస్‌కు వెళ్లాలన్నా అంతో ఇంతో చెల్లించాల్సిందే!



అరకులో బెలూన్లే పతంగులు

సంక్రాంతి సమయంలో.. వినీలాకాశం కొత్త రంగులు పులుముకుంటుంది. రంగురంగుల పతంగులు ఆకాశాన్ని కమ్మేస్తాయి. అంతటా గాలిపటాల జోరుంటే.. అరకులోయలో మాత్రం హాట్ బెలూన్లు సందడి చేయనున్నాయి. జనవరి 18 నుంచి 20 వరకు అరకులోయలో హాట్‌బెలూన్ ఫెస్టివల్ జరగనుంది. ఈ సంక్రాంతి సెలవులకు అందమైన ముగింపు పలకాలనుకునేవాళ్లు పనిలో పనిగా అరకు దాకా వెళ్లిరండి. అక్కడి కొండలు, లోయల్లోని పచ్చదనం ఆస్వాదించడంతో పాటు.. గగనతలంలో బెలూన్ల విన్యాసాలు చూసేయొచ్చు. 2017లో జరిగిన హాట్ బెలూన్ ఫెస్టివల్‌లో భారత్‌తో పాటు థాయ్‌లాండ్, టర్కీ, ఫ్రాన్స్, స్పెయిన్, న్యూజిలాండ్ తదితర 13 దేశాలకు చెందిన 16 బెలూన్లు గాల్లో చక్కర్లు కొట్టాయి. పోటీ పడ్డాయి. ఈసారి మరింత గొప్పగా ఈ పండగను నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఏర్పాట్లు చేస్తోంది. బెలూన్ ఫెస్టివల్ వీక్షించడంతో పాటు అరకులో కాఫీహౌస్, ట్రైబల్ మ్యూజియం, పద్మావతి గార్డెన్‌తోపాటు సమీప పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

ఇలా చేరుకోవచ్చు..

విశాఖపట్నం నుంచి అరకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులున్నాయి. మూడు గంటల ప్రయాణం. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 6.30 గంటలకు కిరండోల్ ప్యాసింజర్ రైలు ఉంటుంది. కొండలు, గుట్టలు దాటుకుంటూ గుహల్లోంచి సాగే ప్రయాణం భలేగా ఉంటుంది.

